ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 488 ఫిబ్రవరి 2026 వెల : రూ.20/-




జనసాహితి ప్రచురణ

## అఖిల భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక (AIPLCF)

## ఆరు నెలలకొకసారి ప్రచురిస్తున్న ద్విభాషాపత్రిక 'పీపుల్స్ లిటరేచర్'




































49వ ఏట ప్రవేశించి నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

488

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

సంపుటి : 49

సంచిక : 07

ఫిబ్రవరి 2026

*website : www.prajaasaahithi.com*

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : ట్రంప్ ఆధిపత్య పోకడలు – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....01 |
| ❑ రెండవ అట్ట | : ద్విభాషా పత్రిక 'పీపుల్స్ లిటరేచర్' | | .....02 |
| ❑ మూడవ అట్ట | : కిటుకు (కవిత) | – యండపల్లి భారతి | .....35 |
| ❑ నాల్గవ అట్ట | : అంతర్జాతీయ మాతృభాషా దినం – ఫిబ్రవరి 21 – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....36 |
| ❑ సంపాదకీయం | : బరితెగించిన బందిపోటు (అనే).... | | .....05 |
| ❑ కథ | : ముస్తాబు | – సౌరవ్ | .....07 |
| ❑ వ్యాసాలు | : ప్రముఖ హిందీ కవి గుల్జార్ జ్ఞాపకాల్లో మహాశ్వేతాదేవి | అను : బి. లలితానందప్రసాద్ | .....10 |
| | : కార్మికుల పోరాట ఫలితాన్ని హరిస్తున్న లేబర్ కోడ్స్ | – కృష్ణ కానూరి | .....29 |
| ❑ చారిత్రక పత్రాలు | : తూర్పు పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ 1952 ఫిబ్రవరి 20, 21 తేదీలలో ప్రచురించిన 2 కరపత్రాలు | అను : కొత్తపల్లి రవిబాబు | .....12 |
| ❑ పుస్తక సమీక్ష | : 'మై రావణ' | – జి.వి. భద్రం | .....14 |
| ❑ దేశ విభజన వస్తువుగా సాహిత్యం | : దేశ విభజన నేపథ్యంలో సినిమాలు, నాటకాలు–5 | – కొత్తపల్లి రవిబాబు | .....25 |
| ❑ స్పందన | : పండుగలు.... సంబరాలు కావేవీ దోపిడీకి అనర్హం | – అరుణ | .....20 |
| ❑ పుస్తక పరిచయం | : మూలవాసివాద కావ్యం 'కట్టెలమోపు' | – గుత్తా హరిసర్వోత్తమనాయుడు | .....22 |
| ❑ కవితలు | : డా॥ వెన్నా వల్లభరావు **(06)**; పి. మోహనరావు **(11)**; బొల్లిముంత వీరయ్య **(24)**; కంచరాన భుజంగరావు **(32)** | | |
| ❑ గుర్తుంచుకుందాం | : చందు సుబ్బారావు**(09)**; మాధవ్ గాడ్గిల్, పిట్టల రామచంద్రం **(13)**; వెనిగళ్ళ వెంకటరత్నం, మైత్రి శ్రీనివాసరాజు **(19)** | | |
| ❑ పాట | : జనసాహితి బడి | – కొన్న బాలక్రిష్ణ | .....30 |
| ❑ బాలసాహితి | : గౌతమ్! ఇంకా ఇంకా ప్రశ్నించు!! | – పి.యస్. నాగరాజు | .....31 |
| ❑ వివిధ | : ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' **(04)**; సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు **(21)**; ఈ పుస్తకాలు అందాయి **(33)**; వార్తాసాహితి **(34)** | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు, రచనలు పంపవలసిన చిరునామా :

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30–7–6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **70759 57010** prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

సంపాదకుని చిరునామా :

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **78936 97469** prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
0680101004936
IFSC No. CNRB0000680
UPI 9490196890

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి., యుపిఐల ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 25,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 20,000 |
| లోపలి అరపేజి | రు. 10,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రికపంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్పై ఏళ్ళ క్రితం "ప్రజాసాహితి"

**సంచిక : 7 సంపుటి : 19 ఫిబ్రవరి 1996**



**విశాఖపట్నం** చిత్రకారుడు పి.డి.ఎస్. కుమార్ గీచిన తారాశంకర్ బందోపాధ్యాయ ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ కవరు పేజీలో బద్దూరి ధర్మారెడ్డి రాసిన "ఒక సృజన గీతం", మూడో కవరు పేజీలో ఛాయరాజ్ రాసిన 'కొత్త రాగం', నాల్గవ కవరుపేజీలో మోతుకూరి అశోక్ కుమార్ రాసిన 'మౌనసంద్రం' కవితలను ప్రచురించారు.

'నల్ల లావా హవాలా....' అనే సంపాదకీయంలో అవినీతి హవా లావాలాగ దేశమంతా కుళ్ళునీ, కంపునీ వెదజల్లుతోందనీ, 1991 నాటి హవాలా కుంభకోణం కేసు పార్లమెంటు ఎన్నికల ముందు బయటకు రావటం వెనుక వున్న ఆంతర్యాన్ని చర్చించారు. సరళీకృత ఆర్థిక విధానాల సహజ పరిణామాలను, వాటివల్ల ఉత్పన్న మౌతున్న సంక్షోభాలను బద్ధలుకొడుతూ నల్లధన సామ్రాజ్యాన్ని అంతం చేయాలని, అప్పుడే ప్రజాస్వామిక, సాంస్కృతిక జీవన విలువల్ని సాధించుకోగలమని రాశారు.

'విరామమెరుగని కలం యోధుడు' శీర్షికలో బెంగాల్ ప్రజారచయిత "తారాశంకర్ బందోపాధ్యాయ"ను పి.ఎస్. నాగరాజు పరిచయం చేశారు. బజరా రాసిన 'గంటస్తంభం' కథనూ, ధారావాహికగా చినువా అచ్‌బే రాసిన ఆఫ్రికన్ నవల 'చెదిరిన సమాజం'ను, 'ఉద్యమం-పాట' శీర్షికలో ఉదయ్ రాసిన 'నల్లగొండ జిల్లా సాంస్కృతికరంగ అనుభవాలు'ను, ఎం.వి. కృష్ణయ్య రాసిన 'గీతారహస్యం' గల్పికను ప్రచురించారు. కెన్‌సారోవివా ఉద్యమ సన్నిహితుడు, ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక సలహాదారుడు వోల్ సోయింకా రాసిన 'అతడే నైజీరియా ఆఖరి క్రూర నియంత' వ్యాసాన్ని కొత్తపల్లి రవిబాబు అనువాదం చేశారు. 'పుస్తక సమీక్ష' శీర్షికలో ఛాయరాజ్ విద్యాసాగర్ కవిత 'దిష్టిబొమ్మ'ను, వర్గసంఘర్షణనీ, మేథోజీవుల బ్రతుకులలోని వెలితినీ చిత్రీకరించే జీవన్ కథలు "నిరంతరం"ను శిప్రద సమీక్షించారు. 'స్పందన' శీర్షికలో "సామ్రాజ్యవాద విషసంస్కృతికి క్లాప్ కొట్టి, 'నీ ఇష్టం' అనే సర్టిఫికెట్ ఇచ్చిన ఢిల్లీ ఫిలిమ్ ఫెస్టివల్" వ్యాసాన్ని టి. రవిస్వభావ్ రాశారు.

పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహిస్తున్న 'పిల్లల ప్రపంచం' శీర్షికలో 'రచయితగా నేను' అని కాలువ మల్లయ్య చేసుకున్న పరిచయాన్ని, నిర్మలానంద అనువాదం చేసిన వియత్నాం కథ "పేద ధనికుడు"ను 'దేశదేశాల జానపద కథలు' శీర్షికలో ప్రచురించారు. ఆర్. రామకృష్ణ రాసిన "గురజాడ జిల్లా" కవిత, డా॥ శాంతికుమార్ రాసిన "పేటెంట్ దోపిడీ" కవిత, స్వా.మై.సం రాసిన 'కరువు వ్యతిరేక ఉద్యమ పోరాట పాట', కోయి కోటేశ్వరరావు రాసిన "ఆ గుప్పెడు నమ్మకం కోసం" కవిత, శీలం రాంమూర్తి రాసిన 'నీ పాటను ఆపం' కవిత, సూర్యవంశి రాసిన 'దళిత గజల్'ను ప్రచురించారు. 'ఉత్తరాలు', అందుకున్న పుస్తకాల శీర్షిక 'స్వీకారం', జనసాహితి కార్యక్రమాల వివరాల 'చైతన్యవాహిని'లను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : రూ.5/-

సంపాదకీయం

# బరితెగించిన బందిపోటు! (అనే) The Great Dictator!

**భూమిని** చాపలా చుట్టి చంకన పెట్టుకోగలమని దురాశ పడేవారిని చూచి 'భూమి ఫక్కున నవ్వు'తుందని వేమన చెప్పిన సూక్తి ఈ బందిపోటుకు తెలియదు, మానవ ద్వేషులకు 'దేశమంటే మనుషులు' అన్న గురజాడ భావన బోధపడదు. అలాంటి వారికి ఇక శ్రీశ్రీ చెప్పిన "అణవ శక్తి కన్న మానవ శక్తి మిన్న!" అన్నది ఎలా జీర్ణం కాగలదు? ఇవన్నీ సామ్రాజ్యవాదుల అమానుషత్వంలో అంతర్భాగాలు.

ప్రపంచ ప్రజలందరూ ఛీ కొడుతున్నా అమెరికన్ సామ్రాజ్యవాద ప్రతినిధి, ప్రపంచ టెర్రరిస్టు ఐన ట్రంప్ 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు!' అనుకుంటున్నాడు.

తన కడుపునిండా దాచుకున్న ఆయుధాలని విసర్జించక తప్పని ఆర్థిక సంక్షోభపు విరోచనాల యుద్ధ రోగం అమెరికాకు పట్టుకుంది. అందుకే గడచిన 20 రోజులలోనే వెనుజువెల రాజధాని కారకాస్‌పై దాడి చేసి ఆ దేశ ప్రధాని మదురోను అతని భార్యను కిడ్నాప్ చేసి న్యూయార్క్ నగరానికి తరలించారు. ఇది స్పష్టమైన టెర్రరిస్ట్ చర్య. గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటాననీ, కాదంటే తమకే తప్పనిసరిగా దాన్ని అమ్మి తీరాలనీ అదే పనిగా ట్రంప్ మాట్లాడుతున్నాడు. నేటికి నేడు ఇరాన్ దేశంపైకి యుద్ధ విమానాలను నౌకా బలగాలను తరలిస్తున్నాడు. నాటో దేశాల పట్ల ఒకనాటి హిట్లర్ తరహాలో దురహంకారపూరితంగా ప్రవర్తిస్తున్నాడు.

గడిచిన సంవత్సరంలోనే ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఇరాన్‌పై ట్రంప్ దాడి చేసిన సంగతి మనకు తెలుసు. ఇరాన్‌లోని ఆంతరంగిక సంఘర్షణలను ప్రోత్సహిస్తూ సహాయపడుతూ చివరకు వారి పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకుని తాను చెప్పిన విధంగా లొంగి నడుచుకోకపోతే దురాక్రమణ తప్పదు అని ఈ బందిపోటు ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నాడు.

'తోడేలు – మేకపిల్ల' సామెత లాగా వెనుజువెలా తమ దేశానికి నార్కోటిక్స్ (నిషిద్ధ మాదకద్రవ్యాలు) సరఫరా చేస్తోందని అబద్ధాల ఆరోపణలు ట్రంప్ చేస్తున్నాడు. ఆ సాకుతో కిడ్నాప్ దుశ్చర్యకు పాల్పడ్డాడు. ఒకప్పుడు ఇరాన్ నుండి సహజవాయువు పైపు లైనుకి అడ్డుపెట్టిన అమెరికా ఇప్పుడు రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకోకూడదని భారతదేశానికి ఆదేశాలు ఇస్తున్నాడు. ధిక్కరిస్తే హద్దు పద్దు లేని వాణిజ్య సుంకాలు విధిస్తున్నాడు.

తమ దురహంకారపూరిత హూంకరింపులకు లొంగని ఐరోపా కూటమి దేశాలను బెదిరింపులతో సాధిద్దామని చూస్తున్నాడు. ట్యారిఫ్‌ల మీద ట్యారిఫ్‌లు వేసేస్తున్నాడు.

నాటో దేశాలలో ఒకటి అయిన కెనడాను తమ 51 వ రాష్ట్రంగా మారమని, గ్రీన్ ల్యాండ్‌ని అమెరికాకు అప్పచెప్పేయమని డెన్మార్క్‌ను సంవత్సరంపైగా బహిరంగంగా బెదిరిస్తున్నాడు.

తనకు ఎటూ నోబెల్ శాంతి బహుమతి లభించలేదు కనుక, "ఇక శాంతి అనే మాటే లేదు అంతా యుద్ధమే" అంటున్నాడు. ఇవన్నీ ఇటీవల ట్రంప్ ప్రేలాపనలలో కొన్ని ఉన్మాద చర్యలు, ప్రకటనలు.

ఇక్కడే ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. మన భారత పాలకవర్గ మీడియా నేటి అమెరికా విధానాలన్నిటినీ ట్రంప్ అనే తుంటరి, తుగ్లక్, పిచ్చోడు, బఫూన్, జోకర్ లాంటివాని అవకతవకలతో కూడిన అడ్డదిడ్డపు చేష్టలుగా ప్రచారం చేస్తున్నారు. ఆ దేశ అధ్యక్షుడిని కేవలం ఒక వ్యక్తిగా చూపి దాని సామ్రాజ్యవాద దురాక్రమణపూరిత దోపిడీతత్త్వాన్ని మరుగునపరచడమో పల్చన పరచటమో చేస్తున్నారు. కానీ గడిచిన చరిత్ర అంతా అమెరికన్ సామ్రాజ్యవాద స్వభావాన్ని స్పష్టం చేస్తోంది.

200 ఏళ్ల క్రితం అమెరికా దేశ అధ్యక్షుడయిన మన్రో (1823) యూరోపియన్ వలసవాదానికి వ్యతిరేక నినాదం ఇచ్చాడు. అది ఐరోపా వలసవాదులకు బదులు అమెరికాను పశ్చిమార్ధగోళ సామ్రాజ్యాధిపతిగా తామే పరిగణించుకుని, హెచ్చరిక రూపంలో ప్రకటితమైన ఒక సిద్ధాంతం. అది దక్షిణ అమెరికా ఖండంపై ఐరోపా దేశాల ఆధిపత్యానికి బదులు ఐరోపా దేశాల నుండి స్వతంత్రం పొందిన అమెరికా ఆధిపత్యాన్ని స్థాపించడానికి రూపొందినది. కాలక్రమంలో పూర్తిస్థాయి సామ్రాజ్యవాదంగా ఎదిగి రెండు ప్రపంచ యుద్ధాల నుండి లాభాలు పొంది, నయా వలస పద్ధతులలో కేవలం లాటిన్ అమెరికాపైనే కాక ప్రపంచమంతటా తన పెత్తనాన్ని నెలకొల్పుకునే ప్రయత్నం నాటినుంచి నేటి దాకా డాన్రో (మన్రో) సిద్ధాంతాన్ని అమెరికా అమలు చేస్తోంది.

వలస, నయా వలస విధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం ప్రజాస్వామ్యం కోసం పోరాడిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలపై సైనిక అణచివేతలకు పాల్పడింది. ప్రపంచంలో రక్షణ వ్యవస్థకు పెట్టే మొత్తం ఖర్చులో అమెరికా వాటా 37%. మొత్తం ఆయుధాల ఎగుమతులలో 43% దానిది. మాటవరసకు ప్రపంచంలో నిజంగానే యుద్ధాలు లేని శాంతి ఏర్పడితే మొట్టమొదట కుప్పకూలిపోయే ఆర్థిక వ్యవస్థ కూడా అమెరికాదే! యుద్ధాలు లేకుండా మనుగడ సాగించలేని వ్యవస్థ అది. ఇపుడు సామ్రాజ్యవాదపు మాయ రూపాలు తెలియనివారికి కూడా స్పష్టమయేటట్లు తమ క్రూర రాక్షస నిజరూపాన్ని ప్రపంచ ప్రజానీకం ముందు ట్రంప్ ప్రదర్శిస్తున్నాడు. ప్రస్తుత సందర్భం ఎలా ఉందంటే, ఒక కవి అన్నట్లు,

"మానవ రక్త సముద్రంలో నిలువునా యుద్ధ జలకాలాడే వైట్ హౌస్, భూగోళం గుండెల్లో మృత్యుపతాకను దిగపాదుస్తోంది"

ఇటీవల గాజాలో "Board of Peace" అనే 'అంతర్జాతీయ శాంతి మండలిని ఏర్పాటుచేశాను అందరూ చేరండి!' అంటున్నాడు. నిజమే...

"ఒక పులి / పశ్చాత్తాపం ప్రకటించిందట / తోటి జంతువుల్ని సంహరించినందుకు!" (అలిశెట్టి ప్రభాకర్)

సోవియట్ యూనియన్ కూలిపోయిన దగ్గర నుండి ఏకధృవ ప్రపంచంగా ఆడింది ఆటగా పాడింది పాటగా చలాయించిన అమెరికాను ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. మార్కెట్ సర్వస్వ ఉదారవాద విధానాలు గాలికి ఎగిరిపోయాయి. ఐక్యరాజ్యసమితి 'బే ఖాతర్' అయింది. యుద్ధమే దిక్కయింది. ఈలోగా కొంత ఆలస్యంగానైనా చైనా రష్యాలు ఆర్థిక, ఆయుధ రంగాలలో అమెరికాతో పోటీకి వచ్చాయి. బ్రిక్స్ ఏర్పాటువల్ల ప్రపంచ వాణిజ్యంలో తిరుగులేనిదిగా చలామణి అవుతున్న డాలర్ హోదాకు గత వైభవం ప్రశ్నార్థకమైంది. తమకు అనుకూల కరెన్సీతో ఇతర దేశాలు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తే, ఇన్నాళ్లూ ప్రపంచంపై రుద్దిన డాలర్ సామ్రాజ్య పెత్తనం చిత్తయ్యే ప్రమాదం ముంచుకు వచ్చింది. అంతేకాక తన పెరటి దొడ్డి లాంటి లాటిన్ అమెరికాలో, ముఖ్యంగా వెనుజువెలాలో చైనా వాణిజ్యాన్ని విస్తరిస్తుంటే, ప్రపంచ చమురు నిలవలలో 17% దాకా (303 బిలియన్ బేరెళ్లు) ఉన్న, ఇంకా సహజవాయువు, కొన్ని ముఖ్య సాంప్రదాయక వనరులతో పాటు ఆధునిక బ్యాటరీలు, చిప్‌లలో వాడే ఖరీదైన అరుదైన లోహాల నిల్వలు కూడా ఉన్న వెనుజువెలాతో చైనా తమ సొంత కరెన్సీలో వాణిజ్య కార్యకలాపాలు పెంచుకోవటాన్ని అమెరికా తట్టుకోలేకపోతోంది. తన డాలర్ గుత్తాధిపత్యం బీటలు వారుతున్నట్లు గమనించింది.

పీడిత ప్రజల రాజకీయ పరిస్థితులలో ఇటీవల కొన్ని ప్రతికూలతలు ఏర్పడ్డాయి. ఒకనాటి రష్యా, తర్వాతకాలపు చైనా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన దేశాలకు, జాతులకు ఒకప్పుడు అండగా ఉండేవి. నేడు ప్రపంచ పీడిత ప్రజానీకానికి అలాంటి చేయూత అవసరమవుతుంది. అయినా అసంఘటితంగా ప్రతి దేశంలో తరతమ స్థాయిలలో పీడిత ప్రజాపోరాటాలు ఎడతెగకుండా సాగుతూనే ఉన్నాయి. నేడు అమెరికన్ సామ్రాజ్యవాదానికి బాహాటంగా మద్దతునిచ్చే దేశాలు ఒకటి రెండు తప్ప లేకపోవడం అమెరికా ఎంత ఏకాకి అయిందో తెలుపుతోంది. దాని కనుసన్నలలో బతుకుతున్న నాటో దేశాలు (కెనడా, ఫ్రాన్స్, డెన్మార్క్, జర్మనీ) ట్రంప్ ప్రభుత్వ విధానాలను బాహాటంగా విమర్శించిన పాటి కూడా భారత ప్రభుత్వం చేయలేక పోతోంది. విశ్వ గురువునని డబ్బాలు వాయించుకునే భారత పాలకుల పరాధీనతత్వపు లొంగుబాటు రంగు మరొకసారి బయటపడింది.

అమెరికన్ సామ్రాజ్యవాదంతో భారత పాలకులు అంటకాగడాన్ని స్వేచ్ఛా స్వాతంత్ర్యప్రియులు, శాంతికాముకులందరూ తమ గొంతు విప్పి ఖండించాలి!

బరితెగించిన బందిపోటుల్లాంటి గ్రేట్ డిక్టేటర్‌ల సామ్రాజ్యవాద చరిత్ర ఎంత రక్తసిక్తమైనదో అది ప్రపంచ మానవాళికి ఎంత బద్ధ శత్రువో సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివిధ సాహిత్య, కళారూపాల ద్వారా వివరించాలి.

మదురోను, ఆయన భార్యను తక్షణమే విడుదల చేయాలి!

ఇరాన్‌పై అమెరికా దుశ్చర్యలు విరమించుకోవాలి

సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు ప్రపంచ దేశాలన్నీ మద్దతుగా నిలవాలి.

సామ్రాజ్యవాద తత్వాన్ని బట్టబయలు చేస్తూ 65 సంవత్సరాల క్రితం శ్రీశ్రీ చెప్పిన కవితాపంక్తులను ఒకసారి గుర్తు చేసుకుందాం!

"అరువులిచ్చి కరువు తెచ్చి / రుణం పెట్టి రణం తెచ్చి / జనం ధనం ఇంధనమై / చరణ కరాబంధనమై / ఒకనాడోహో అనిపించుకు తిరిగిన ధనికవాదమిక వెగటై జిగటై / మరణంలో మసౌతోంది." ✣

కవిత

# నా మాతృభాష

హిందీ మూలం : **కుమార్ విక్రమ్**

అనువాదం : **డా॥ వెన్నా వల్లభరావు**

*(మాతృభాష నేర్చుకోవాల్సిన దశలో ఆంగ్లభాషా మాధ్యమంలో విద్యాభ్యాసం పిల్లలపై చూపే దుష్ప్రభావం వల్ల పిల్లలు పరభాషనే స్వభాషగా భావించేంత తీవ్రంగా వుంటుందని కవి కుమార్ విక్రమ్ వ్యంగ్యంగా రాసిన కవిత ఇది. పరభాషా వ్యామోహాన్ని వీడి మాతృభాషలో విద్యను అందించాలని కవి కోరుతున్నారు.)*

నా మాతృభాష ఇంకా ఏర్పడుతోంది
అప్పటివరకు నేను
నా తండ్రి, ఆయన తండ్రి నుండి నేర్చిన
నా పితృభాషలోనే
రాస్తూ-చదువుతూ-మాట్లాడుతూ ఉంటాను.
నా మాతృభాష ఇంకా ఏర్పడుతూనే ఉంది
పూర్తిగా ఏర్పడటానికి ఇంకొన్ని దశాబ్దాలు పట్టొచ్చు
అది రూపాన్ని సంతరించుకునే ప్రక్రియలో
నా పితృభాష అక్షరాలు - మాటలు - వ్యాకరణం
వాక్య నియమావళి - ఉచ్చారణ - భావాలు - జాతీయాలు
ఒక పెద్ద అడ్డుగోడ
దాన్ని దాటుకుని రూపుదిద్దుకుంటోంది నా మాతృభాష.
అప్పటివరకు నేను బిడియ పడుతూ
నా పితృభాషనే ఉపయోగిస్తూ ఉంటాను
అన్నిచోట్లా అందరి ముందూ -
'ఇదే నా మాతృభాష' అని చెపుతూ.... ✣

కథ

# ముస్తాబు

సౌరవ్

**తెల్లవారకుండానే** ఫోన్ మోగగా ఉలిక్కిపడి లేచాడు కామేశ్వరరావు. నిద్రమత్తులోనే ఫోన్ చేతిలోకి తీసుకొని "హలో" అన్నాడు. అట్నుంచి "కామేశ్వరరావేనా మాట్లాడేది", అని అడిగారెవరో. గోడ మీద ఉన్న వాచ్‌లోని రేడియం డయల్ తెల్లవారుజామున మూడున్నర చూపిస్తోంది.

బంగారంలాంటి నిద్ర పాడుజేసిన అవతలి మనిషి మీద చిర్రెత్తుకొచ్చింది..

"నాకు ఫోన్ చేసి కామేశ్వరరావు ఎవరని అడుగుతావా.. బుద్ధుందా.. వేళాపాళా లేదా.. పెట్టు ఫోన్!", అని ఫోన్ కట్ చేశాడు.

మళ్ళా బెడ్ మీదకి ఒరిగాడు. నిద్రపట్టలేదు.

అవతలి మనిషి అడిగిన కామేశ్వరరావు ఎవరా అని ఆలోచించడం మొదలుపెట్టాడు. కాసేపు ఆలోచించాక అవతలి మనిషి అడిగిన కామేశ్వరరావు తనే అని గుర్తొచ్చింది. గబగబా ఫోన్ తీసి చూసాడు.. డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అని ఉంది. గుండె గుబేల్ మంది.

"కొంపలు మునిగాయిరా నాయనా", అని భయపడుతూనే తిరిగి కాల్ చేశాడు.

అనేక స్తోత్ర వచనాలు చెప్పాక గానీ డీఈఓ శాంతించలేదు.

"అమరావతి కమిషనర్ ఆఫీస్ నుంచి నాకు ఒంటిగంటకు కాల్ వచ్చిందయ్యా..మరి నన్నెవరితో చెప్పుకోమంటావ్!"

"సరే, అవన్నీ తరవాత.. ఇదిగో అసలు విషయం చెబుతున్నాను విను.. ముస్తాబు కార్యక్రమాన్ని కమిషనర్‌గారు లైవ్‌లో చూస్తారట. అందుకు మీ స్కూల్‌ను సెలెక్ట్ చేసుకున్నారు. నువ్వేం చేస్తావో తెలీదు.. తెల్లారేసరికి మీ స్కూల్లో ముస్తాబు కార్యక్రమం చాలా ఘనంగా చెయ్యాలి.. మన జిల్లా పేరు, మీ స్కూల్ పేరు చరిత్రలో సువర్ణాక్షరాలలో లిఖించాలి తెలిసిందా.. ముఖ్యమంత్రిగారు ఈ కార్యక్రమం చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారు. కమిషనర్‌గారు రాండమ్‌గా మీ స్కూల్‌ను ఎంచుకున్నారు.. దీన్ని సక్సెస్ చేసే బాధ్యత నీదే!.. ఏం చేస్తావో.. ఎలా చేస్తావో నాకు తెలీదు.. నేను తెల్లారి ఏడు గంటలకల్లా నా మందీ మార్బలంతో నీదగ్గరుంటాను.. ఆర్జేడీ గారు కూడా వస్తున్నారు" అని ఫోన్ పెట్టేసాడు డీఈఓ.

కామేశ్వరరావుకి మత్తు గిత్తు వదిలిపోయి ఒక్కసారిగా అలెర్ట్ అయిపోయాడు. ఆ టైమ్‌లో స్టాఫ్‌కి ఫోన్ చేస్తే బండబూతులు తిట్టుకుంటారని తెలుసు. అయినా ప్రోగ్రామ్ సక్సెస్ చెయ్యకపోతే వచ్చే తాఖీదులకన్నా ఈ తిట్లే నయం అనుకొని ఒక్కొక్కరికీ ఫోన్ చేసి తెల్లవారి ఆరుగంటలకే స్కూల్‌కి అటెండ్ కావాలని చెప్పాడు.

ఆ తర్వాత పిల్లల పేరెంట్స్‌కి ఫోన్ చేసి పిల్లలను ఉదయం 8.30 కల్లా స్కూల్‌కి పంపించాలని చెప్పాడు. హడావిడిగా లేచి స్నానం పానం లేకుండానే తొందర తొందరగా స్కూల్ కి బయలుదేరిపోయాడు.

స్కూల్ చైర్మన్‌కి కూడా ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఇదేదో పొలిటికల్ మైలేజీ వచ్చే కార్యక్రమంలా అనిపించిందతనికి. వెంటనే అతను చక్కగా తెల్లటి లాల్చీ, షరాయి వేసుకొని చక్కగా ముస్తాబయ్యి స్కూల్‌కి వచ్చేశాడు. ఆ తర్వాత ఊళ్ళో రాజకీయ నాయకులకు ఫోన్లు చేసి పిలిచేసాడు. వాళ్ళు కూడా చక్కగా ముస్తాబయ్యి వచ్చారు. ఈలోగా టెంట్ హౌస్ వాడి చేత పెండాల్స్ గిండాల్స్ తెప్పించి స్కూల్ ఆవరణను హెడ్మాస్టారు బాగా ముస్తాబు చేయించారు. ప్రోగ్రామ్ ఏర్పాటు చెయ్యడానికి వచ్చిన టెక్నీషియన్లు మైక్‌లు, మానిటర్‌లు సెట్ చేసుకునే పనుల్లో పడ్డారు. అన్నట్టుగానే డీఈఓ గారు సిబ్బందితో వచ్చేశారు. లైవ్ లో కమిషనర్ గారు చూస్తారనే ఉద్దేశ్యంతో మామూలుగా కన్నా మరింత చక్కగా ముస్తాబయ్యి వచ్చారు ఆయన. డీఈఓ గారు వచ్చిన కాసేపటికి ఆర్జేడీ గారు వచ్చారు.. వారిని చూస్తే ముస్తాబు వెళ్ళి దాని తాతతో చెప్పుకుంటుందన్నంతలా వచ్చారాయన.

స్టాఫ్ కూడా డీఈఓ గారికి, ఆర్జేడీ గారికి స్వాగతం చెప్పాలనే ఉద్దేశ్యంతో మరింత చక్కగా ముస్తాబయ్యారు. పిల్లల కోసం దువ్వెనలు, స్నోలు, పౌడర్లు, ఫేస్ క్రీములు, అద్దాలు టేబుళ్ల మీద ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత పిల్లలు వచ్చారు. ఒక్కొక్కరుగా వస్తున్న వాళ్లని ఆర్జేడీ గారు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. టైమ్ దగ్గర పడేసరికి ఇంచుమించు రావాల్సిన పిల్లలంతా వచ్చేశారు. అప్పటిదాకా వాళ్ళని పరిశీలనగా చూస్తున్న ఆర్జేడీ గారు డీఈఓ గారి వైపు చూసి పెదవి విరిచేశారు

"డీఈఓ గారూ మన ప్రోగ్రామ్ ఫెయిల్ అయిపోతుంది" అన్నారు.

డీఈఓ గారికి ఆర్జేడీ గారు ఆ మాట ఎందుకన్నారో అర్థం కాలేదు.

"ఏమైంది సార్!", అన్నారు ఆందోళనగా.."

ఏమైనా లాప్సెస్ ఉంటే చెప్పండి సార్.. ఈ హెడ్ మాస్టర్ కి మెమో ఇచ్చేద్దాం", అన్నారు డీఈఓ గారు ఉత్సాహంగా.

"టోటల్ కొలాప్స్ అంటూ ఉంటే ఇంకా లాప్సెస్ అంటారేమిటండీ.. ప్రోగ్రామ్ అంతా సర్వనాశనం అయిపోయింది.. ఆ హెడ్ మాస్టర్‌కి విషయం సరిగ్గా చెప్పనందుకు..

ముందు మీకు మెమో ఇవ్వాలి" అన్నారు ఆర్జేడీ గారు కోపంగా డీఈఓ ని చూస్తూ.

"అన్నీ సరిగ్గానే చెప్పాను సార్. ఇంతకీ తమరు లోపమేంటో చెప్పలేదు సార్.. అదేంటో చెప్పండి వెంటనే చేయిస్తాను"

"ఆ పిల్లల్ని చూడు",

ఆర్జేడీ చెప్పిన వైపుగా చూసారు డీఈఓ గారు. అక్కడ కొంతమంది పిల్లలు తెల్లని ఇస్త్రీ బట్టలు వేసుకొని, తలలు నీట్‌గా దువ్వుకొని ఒక లైన్‌లో నిలబడి ఉన్నారు. డీఈఓగారికేమీ అర్థంకాలేదు. కానీ ఆ విషయం ఆర్జేడీ గారికి తెలిస్తే తన జడ్డితనం బయట పడిపోతుందని "నిజమే సార్..ఆ పిల్లల పద్ధతేమీ బాలేదు", అన్నారు. అలా ఎందుకన్నారో ఆయనకే తెలీదు. ఒకవేళ 'ఏం బాలేద'ని ఆర్జేడీ గారు అడిగితే ఏం చెప్పాలా అని తెగ ఇదయిపోయారు. అదృష్టవశాత్తు డీఈవో గారు అన్నదాన్ని ఆర్జేడీ గారు పెద్దగా పట్టించుకోలేదు.

"ఆ పిల్లల తల్లిదండ్రులకు అసలు బుద్ధుందా", అన్నారు ఆర్జేడీ గారు కోపంగా.

"అవును సార్! బుద్దుంటే అలా ఎందుకు పంపిస్తారు", అన్నారు డీఈఓ గారు.

"ఈ స్కూల్ హెడ్మాస్టర్ ఎవరు..అర్జెంట్‌గా ఇలా పిలవండి",

ముస్తాబు కార్యక్రమంలో తలమునకలై పోయిన హెడ్ మాస్టర్‌గారు జిడ్డోడుతున్న మొహంతో వచ్చి ఆర్జేడీ గారి ముందుకొచ్చి నమస్కారం పెట్టారు.

డీఈఓ గారు ఆర్జేడీ గారి ముందు మెహర్బానీ కోసం

"ఏమయ్యా! ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ముస్తాబు కార్యక్రమం మీద నీకు సదభిప్రాయం ఉందా అసలు... నేను మొత్తమంతా ఎలా చెయ్యాలో వివరంగా చెప్పానా లేదా" అని హెడ్మాస్టర్‌ని నిలదీశారు.

హెడ్మాస్టర్‌కి బుర్ర ఊపకపోతే ఏమి ప్రమాదం ముంచుకొస్తోందో అని ఊపేసారు.

ఆర్జేడీగారి వైపు తిరిగి

"తెల్లవారే ఫోన్ చేసిన నన్ను అధికారినని కూడా చూడకుండా కసిరాడండీ.. ఇప్పుడేమో ప్రోగ్రామ్ ఫెయిల్ అవడానికి చేయాల్సిందంతా చేస్తున్నాడు. ఇలాంటివాళ్లకు మెమోలతో సరిపెడితే లాభంలేదు సార్.. ఏకంగా సస్పెండ్ చెయ్యాలి",

డీఈఓ గారికి ఈ కార్యక్రమం ఫెయిల్ అయితే ఆర్జేడి ఆ ఫెయిల్యూర్‌ని తన మీదకి నెట్టేస్తాడని తెలుసు. అందుకే తను కూడా హెడ్మాస్టర్ని సిద్ధం చేస్తున్నాడు.

"సార్! నేనేం చేసాను సార్!", అన్నారు హెడ్మాస్టర్ గారు.

డీఈఓ గారు కళ్ళెర్రజేస్తూ "నువ్వేమీ మాట్లాడకయ్యా.. ఇంకొక్క మాట మాట్లాడావంటే నేనేమి చేస్తానో నాకే తెలీదు" అన్నారు.

దానితో హెడ్మాస్టర్‌గారు సైలెంట్ అయిపోయారు.

"ఏమయ్యా! గవర్నమెంట్ ఒక చక్కని ఉద్దేశ్యంతో ఒక కార్యక్రమం పెడితే.. దాని స్పిరిట్‌ని అర్థం చేసుకోకపోతే ఎలా?" అన్నారు ఆర్జేడీ గారు.

హెడ్మాస్టర్‌గారికి తను చేసిన పొరపాటేంటో అర్థం కాలేదు. అడగడానికి ధైర్యం చాలటం లేదు. అందుకే మాట్లాడకుండా ఉండిపోయారు.

ఆర్జేడీ గారు మరోసారి పిల్లల్ని చూసారు. శుభ్రంగా తయారయ్యి వచ్చిన ఆ పిల్లల్ని చూస్తుంటే ఆయనకు ఒళ్ళు కుతకుతలాడి పోతుంది. మరి కాసేపట్లో కమిషనర్ లైవ్‌లోకి వస్తారు.. పిల్లల్ని ఇలా చూశారంటే ముస్తాబు కార్యక్రమం ఫెయిల్ చేసినందుకు తనకు తగిన ప్రతిఫలం ముట్ట జెప్పకుండా వదలరు.

ఆయనకి ఈ ఉపద్రవం నుంచి ఎలా బయట పడాలో అర్థం కావడం లేదు. ఏం చెయ్యాలో పాలుపోక నుదురుని అరచేత్తో కొట్టుకున్నారు.

హఠాత్తుగా ఆయన బుర్రలోకి మెరుపు లాంటి ఆలోచన ఒకటి వచ్చింది.

గబగబా స్కూల్ చైర్మన్‌కి కబురు పెట్టారు. పెళ్లి కార్యక్రమానికి వచ్చినట్టుగా చక్కగా లాల్చీ, షరాయి వేసుకొని, తలకి సువాసనలు వెదజల్లుతున్న నూనె రాసి చక్కగా క్రాఫ్ దువ్వుకుని, మొహానికి పౌడర్ రాసుకొని వచ్చిన అతన్ని చూడగానే ఆయనకి నిస్పత్తువ ఆవరించింది.

అయినా కూడదీసుకొని "చైర్మన్ గారూ... ఈ కార్యక్రమం సక్సెస్సు, ఫెయిల్యూరూ మీ మీదే ఆధారపడి ఉందండీ" అని కొంచెం కుషామత్ చేశారు. అసలే తనని ఎవరూ గుర్తించటం లేదని ఫీల్ అవుతున్న చైర్మన్‌కి భుజాలు గజాలైపోయాయి.

అది గమనించిన ఆర్జేడీ గారు "కేవలం మీ మీద మాత్రమే ఆధారపడి ఉంది", అని రీఎన్ఫోర్స్ చేశారు.

దానితో తబ్బిబ్బు అయిపోయిన ఛైర్మన్

"చెప్పండి సార్", అన్నాడు.

"ఏమీ లేదండీ.... ఊళ్ళో బూడిద దొరుకుతుందా", అని అడిగారు.

ప్రోగ్రామ్ సక్సెస్‌కి బూడిదకీ లింకేంటో అర్థం కాక అయోమయంగా చూసాడు ఛైర్మన్.

ఆర్జేడీ గారు అదేమీ పట్టించుకోకుండా "ఒక్కరెండు బస్తాలుంటే అర్జెంట్‌గా తెప్పించండి.. ఇది మీరు మాత్రమే చెయ్యగలరు" అని ఇంకోసారి ఇంకొంచెం గాలి ఊదారు.

"ఇప్పుడు బూడిద అంటే కష్టం సార్.. అందరూ గ్యాస్ స్టౌవ్ లే కదండీ వాడుతున్నారు" అన్నాడు చైర్మన్.

మళ్ళా ఆర్జేడీగారిని నిరాశ ఆవహించింది. అయితే చైర్మన్‌కి ఆర్జేడీ అంతటి ఆఫీసర్‌గారు తన భుజాల మీద పెట్టిన గురుతరమైన బాధ్యతను అంత సులువుగా దించేయడం ఇష్టం లేదు. అతని బుర్ర పాదరసంలా పని చేసింది. గబగబా స్కూల్‌లోనే ఉన్న వంట షెడ్ వైపుకి నడిచాడు.. అక్కడ కుప్పలు తెప్పలుగా బూడిద, బొగ్గులు పడి ఉన్నాయి.

"సార్! ఎక్కడో ఎందుకు సార్.. మన స్కూల్‌లోనే కావలసినంత బూడిద బొగ్గులూ ఉన్నాయి.. ఇప్పుడు చెప్పండి వాటితో ఏం చెయ్యమంటారో" అన్నాడు ఉత్సాహంగా ఛైర్మన్.

"స్కూల్‌లో బొగ్గులు బూడిదా ఉన్నాయా. అదెలా?!" ఆర్జేడీ గారి మొహంలో రంగులు మారాయి. వారిలో ఉన్న ఆఫీసర్ మేల్కొన్నాడు.

హెడ్మాస్టర్ ని పిలిచి విషయం అడిగారు.

ఎండీఎం వండేవాళ్ళు గ్యాస్‌తో చెయ్యమంటే కిట్టటం లేదని కర్రలతోనే వంట చేస్తున్నారని చెప్పారు హెడ్మాస్టర్‌గారు.

"ఇప్పుడైనా నీకు మెమో ఇవ్వకపోతే నేను పర్యావరణానికి చాలా హాని చేసినట్టే.. నీ సంగతి తర్వాత చూస్తాను.. చైర్మన్ గారూ పదండి", అని బూడిద రాశులవైపు నడిచారు ఆర్జేడీగారు. ఏమి చెయ్యాలో చైర్మన్‌కి వివరించారు.

కాసేపటిలో విద్యార్థులందరినీ గేటు బయటకు పంపేశారు. చైర్మన్‌గారు తన లాల్చీ చేతుల్ని వెనక్కి మడిచి గేట్ దగ్గర నుంచొని ఒక్కొక్కరిగా లోపలికొస్తున్న విద్యార్థుల మోహాలకు తన ముందున్న బూడిద బస్తాల్లో బూడిద పూయడం మొదలు పెట్టారు. అక్కడ్నించి, దువ్వుకున్న తలలు చిందర వందర చేసే బాధ్యత ఒక టీచర్ తీసుకున్నారు. అక్కడ్నించి మోహాలు సబ్బుతో కడిగించడం, జుట్టు దువ్వడం, తలకు నూనె పట్టించడం, మోహానికి పౌడర్ పూయడం ఇలా ఒక్కొక్కరూ ఒక్కో బాధ్యత తీసుకొని విద్యార్థుల ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించిన కమిషనర్ గారు అమితమైన, అమేయమైన, అచింతానంత ఆనందం పొందారు. రేపు ముఖ్యమంత్రి గారి దగ్గర తను పొందపోయే సత్కారాలను ఊహించుకుంటూ అధికారులను, ఉపాధ్యాయ సిబ్బందిని మెచ్చుకున్నారు.

'ఇందులో ఉపాధ్యాయుల పాత్ర ఏమీ లేదు.. తన ఒక్కడిదే ఉంది.. తన ఒక్కడిది మాత్రమే.. ఈ విషయాన్ని అవకాశం వస్తే చెప్పకుండా వదలకూడదు' అని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నారు ఆర్జేడీ గారు.

ముస్తాబు కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, ఆ కార్యక్రమాన్ని అంత విజయవంతంగా ఆ స్కూల్‌లో జరిపిన ఆర్జేడీ గారిని, డీఈఓ గారినీ అందరూ మెచ్చుకున్నారు. ఆ సభలో మాట్లాడిన చైర్మన్ ఆ ముస్తాబు కార్యక్రమ విజయంలో తన పాత్ర కూడా ఉందని చెప్పాడు. అతని చేతులకంటిన బూడిద పోయినప్పటికీ అతని బట్టల మీద మరకలుండడం చాలా మంది గమనించారు.

ఈ సభ అంతటినీ గమనించిన హెడ్మాస్టర్ గారికి, చాలా సంవత్సరాల క్రితం జరిగిన కార్యక్రమం ఒకటి గుర్తొచ్చింది. ఊళ్ళో రాజకీయ నాయకులంతా ఇప్పటిలాగే ముస్తాబయ్యి స్కూల్‌లోకి వచ్చారు. శుభ్రంగా ఉన్న స్కూల్‌లోకి పంచాయతీ స్కావెంజర్ చేత చెత్త తెప్పించి అటూ ఇటూ జల్లించారు. అతని చేతే చెత్త బండి తెప్పించారు. ఆ చెత్తను ఆ బండిలో పోస్తున్నట్టు ఫోటోలు తీయించుకున్నారు. ఆ మర్నాడు పేపర్‌లో క్లీన్ అండ్ గ్రీన్ సక్సెస్ చేసిన వాళ్లందరి ఫోటోలు ప్రముఖంగా పడ్డాయి.

ఇదంతా గుర్తొచ్చి హెడ్మాస్టర్ విరక్తిగా నవ్వుకున్నారు. ✣

గుర్తుంచుకుందాం

## అభ్యుదయ సాహితీవేత్త, భూభౌతిక శాస్త్రవేత్త

# చందు సుబ్బారావు మరణం



**ఆంధ్ర** విశ్వకళాపరిషత్తు భూభౌతికశాస్త్ర శాఖ ఆచార్యులు, అభ్యుదయ రచయితల సంఘం నాయకుడు చందు సుబ్బారావు 2026 జనవరి 29న విశాఖపట్నంలో తన 80వ ఏట మరణించారు. ఆయన తెనాలి సమీపంలోని చదలవాడ గ్రామంలో 1946 మే 18న జన్మించారు. వీరు ప్రముఖ రచయిత బొల్లిముంత శివరామకృష్ణకు మేనల్లుడు.

1964లో విజయవాడ లొయోల కళాశాలలో బి.ఎస్సి. చదివిన సుబ్బారావు, 1967లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో టెక్నాలజీలో ఏం.ఎస్సి పూర్తి చేసి, 1974లో భూభౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. 1974-85 మధ్య అక్కడే లెక్చరర్‌గానూ, 1985-93 మధ్య రీడర్‌గానూ, 1993 నుంచి ప్రొఫెసర్‌గానూ పనిచేసారు. చిన్న నాటి నుండే సాహిత్య పరిచయం పొందిన సుబ్బారావు తనపై గురజాడ, శ్రీశ్రీ, జాషువాల ప్రభావం వుందని చెప్పేవారు. కవిత్వంతోపాటు వివిధ ప్రక్రియలలో రచనలు చేసారు. అభ్యుదయ రచయితల సంఘానికి 1979-82 మధ్య కార్యదర్శిగా వ్యవహరించారు. సాహిత్యపరంగా ఆయన 40 కథలు, 8 నవలలు, 5 విమర్శా గ్రంథాలు, భూభౌతిక శాస్త్రానికి చెందిన అనేక పరిశోధనావ్యాసాలూ రాసారు. జ్యోతిష్యాన్ని విద్యాలయాల్లో నేర్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

'ఇండియన్' నవలలో ప్రాథమిక విద్యను, 'అచంచలం' నవలలో విశ్వవిద్యాలయ విద్యను, 'శాస్త్రీయం' నవలలో రిసెర్చ్ స్కాలర్‌ల సమస్యలను, 'అగ్గిపుల్లలు' నవలలో హాస్టల్ జీవితాన్ని నేపథ్యంగా రాసారు. పత్రికారంగంలో మార్పులు, పెడధోరణులను 'ఎడిటర్' నవలలో చర్చించారు. 'ఎరికా' అనే యాత్రానవలను కూడా రాసారు. 'కవికి విమర్శకుడు శత్రువు కాదు.' అనేది ఆయన విమర్శాగ్రంథాలలో ముఖ్యమైనది.

వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తోంది. ✣

**ఇది మహాశ్వేతాదేవి శత జయంతి సంవత్సరం**



# ప్రముఖ హిందీ కవి గుల్జార్ జ్ఞాపకాల్లో మహాశ్వేతాదేవి

తెలుగు అనువాదం : **బి. లలితానంద ప్రసాద్**

**1968లో** దిలీప్‌కుమార్ – వైజయంతి మాల నటించిన 'సంఘర్ష్' చిత్రం బహుళ జనాదరణ పొందింది. ఆ సినిమాకి నేను మాటలు రాశాను. దీనికి ముందే అబ్రార్ అల్వి మూల కథకి స్క్రీన్ ప్లే, డైలాగులు రాశారు. కొన్ని కారణాల వలన అతను అర్ధాంతరంగా దీని నుండి నిష్క్రమించాడు. అతని స్థానంలో నేను చేరాను. ఇది నాకు ఒక బంగారపు కలశాన్ని సొంతం చేసుకొన్న అనుభూతిని ఇచ్చింది.

నా మొదటి కర్తవ్యం మూల కథ చదివి దాని ఆధారంగా సంభాషణలు రాయటం. అల్వి గారు అప్పటికే కొంత పూర్తి చేశారు. ఈ కథ నాకొక అపూర్వమైన నిధి అనిపించింది. నేను దీర్ఘకాలంగా ఆ రచయిత్రి అభిమానిని. ఆమె అనేక కథలు అప్పటికే హిందీలోకి అనువాదమయ్యాయి. కానీ ఈ కథ మాత్రం నన్ను మంత్రముగ్ధుడిని చేసింది. మూలంలో దీని పేరు 'లేలి అసమానేర్ ఐనా'. దీనినే 'సంఘర్ష్'గా మార్చారు. ఈ కారణంగానే మొదటిసారిగా మహాశ్వేతాదేవికి దగ్గరయ్యాను. వాస్తవానికి ఆమె రాసిన ఒక కథతో ప్రేరణ పొంది ఒక కవిత రాసేంత దగ్గరయినా, వ్యక్తిగతంగా ఆమెను చాలాకాలం వరకు కలుసుకోలేదు.




ఆ తర్వాత నేను 'రుడాలి' సినిమాకి స్క్రీన్ ప్లే, సంభాషణలు రాశాను. ఈ సినిమా అవకాశం నాకు వచ్చేటప్పటికే రెండు రకాల స్క్రీన్ ప్లేలు సిద్ధమయ్యాయి. నేను మూల కథ చదవడం మొదలెట్టాను. వీలైనంతగా అసలు కథకి దగ్గరగా వుండి దానికి పూర్తి న్యాయం చేసేదిగా వుండాలని, రచయిత్రి దార్శనికత పూర్తిగా సినిమాలో సంపూర్ణంగా ప్రతిబింబించాలని స్క్రీన్‌ప్లేను తయారు చేయడం ప్రారంభించాను.

ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకి ఆమెను ఢిల్లీలో సాహిత్య అకాడమీ సమావేశంలో కలవగలిగాను. ఆ సమావేశం కూడా సాహిత్యం–సినిమాకి సంబంధించినది అవటం యాదృచ్ఛికం.. ఆ సమావేశంలో నేను స్పష్టంగా వివరించాను. ఏ రచననైనా మరొక భాష లోనికి అనువాదం చేసినప్పుడు, సాధ్యమైతే దానిని మూల రచయిత పరిశీలించాలనీ, అలా పరిశీలించకపోతే మూల రచయిత భావాల్లోని సారం అదృశ్యమయ్యే ప్రమాదం వుందని నా అభిప్రాయాన్ని తెలిపాను. అనువాదాల విషయంలో ఇది మరింత వాస్తవం. నేను మహాశ్వేతాదేవి రాసిన 'లేలి అసామేనేర్ ఐనా', 'రుడాలి' నవలలను అనుసరించి స్క్రీన్ ప్లేలు రాశాను. వీటిలో నా శక్తి మేర మూల రచనలకు న్యాయం చేయ ప్రయత్నించాను. అనేక పాత్రలను ఒక పాత్రలో ఇమడ్చడం, లేక ఒకే పాత్రని మరో పాత్రకి ఆపాదించడం ఒక్కోసారి జరుగు తుంటుంది. రచయితలందరూ అవసరమైనప్పుడు ఇటువంటి మార్పులు చేయాల్సి వస్తుంది. 'హక్కులు' కొనడం అంటే ఇష్టం వచ్చినట్లు ప్రతిదీ మార్చే హక్కు ఉందని కాదు.

దీదీ మహాశ్వేతాదేవి నాకు చెప్పారు. "నేను వేరొక కారణంతో 'లేలి ఆస్మాన్....' హక్కులు ఇవ్వటానికి అంగీకరించాను. దిలీప్ కుమార్ నా అభిమాన నటుడు. ఆ నిర్మాత దిలీప్ ఈ సినిమాలో నటిస్తున్నాడని చెప్పగానే ఏమాత్రం ఆలోచించకుండానే అంగీకరించాను. నేను మెచ్చే నాయకుడు నేను రాసిన నవల ఆధారంగా తీస్తున్న సినిమాలో నటిస్తున్నాడు. నాకు ఇంకేం కావాలి?" అన్నారు. ఇది వినగానే మేము పగలబడి నవ్వుకున్నాం. ఒక ప్రక్క భారతీయ సాహిత్యంలోనే అత్యంత గొప్ప రచయిత్రి అయి ఉండి, అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలు ఎన్నెన్నో పొందినా కూడా మరో ప్రక్క ఇలాంటి కోరికలకి లొంగిపోయారు. అంతటి స్థాయి గల వ్యక్తులకు మాకు వున్నట్లు తారల పట్ల ఇంతగా ఆకర్షణ, ఆసక్తి ఉండదని అనుకుంటూ వుండేవాళ్ళం.

నా జీవితంలో అసాధారణమైన విజయాన్ని ఆరోజు సాధించాను. సమావేశం నుండి బయటకు వస్తూ దీదీ, 'గుల్జార్, నీవు నీ కుమార్తె కోసం రాసిన కథలన్నీ చదివాను. నిజానికి వాటిని అనేక మంది పిల్లలకు బహుమతులుగా ఇచ్చాను. అంత బాగా అందంగా రాయటం,

అంత అద్భుతంగా పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం – బహు కొద్దిమందికే వరంగా లభిస్తుంది. వారిలో నీవు ఒకడివి' అన్నారు. అది విని నేను ఆకాశంలో తేలియాడాను. వాస్తవానికి నేనేమిటో ఆమెకు తెలుసు. సినిమారంగంలో రోజువారీ పనులు కాక బయట నా రచనలు ఏమిటో కూడా ఆమెకు బాగా తెలుసు అన్న విషయం నన్ను పొంగిపోయేలా చేసాయి. ఆమెకు జవాబు చెప్పలేని స్థితిలో పడ్డాను. ఆ రోజు నుండి నాకు ఆమె నా 'దిలీప్ కుమార్' అయింది.

ఆమె నమ్మశక్యం కాని శక్తితో, నిరంతరం పని చేస్తూనే ఉంటుంది. లేక ఏ ఏ పనులు చేయాలో ఆలోచిస్తూనే ఉంటుంది. ఆమె రాస్తూ వుంటారు. పోరాటాల్లో పాల్గొంటూ వుంటారు. ఆదివాసీల శ్రేయస్సు కొరకు అలుపెరుగకుండా పని చేస్తూనే ఉంటారు. ఆమె తన కథల హక్కులను సినిమా వాళ్ళకి అమ్ముతారు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ఆదివాసీల ప్రయోజనాల కొరకు ఉపయోగిస్తారు. నేను ఎన్నడూ అంతటి దృఢత్వం గల మహిళను చూడటం తటస్థించలేదు. ఏ ఇతరులకి సాటిరాని, సాటిలేని నిజమైన కథానాయకి( హీరోయిన్) ఆమె.

ఆ తర్వాత మేము 2006 లో 'ఫ్రాంక్ ఫర్ట్' పుస్తక ప్రదర్శనలో కలిశాము. ఇండియాకు మొదటి స్థానం ఇచ్చి, గౌరవించిన ఆ ప్రదర్శనలో మహాశ్వేతాదేవి ముఖ్యఅతిథిగా అందరి దృష్టిని ఆకర్షించారు. అక్కడ ఆమె తన దేశం గురించి, దాని వారసత్వం, సాహిత్యం, సంస్కృతి లాంటి అంశాలపై ప్రసంగించారు. హృదయాన్ని స్పృశించే అలాంటి ప్రసంగాలు ఎప్పుడో గాని వినలేము. అది నా కళ్లు తెరిపించింది. ఆ కార్యక్రమం అనంతరం ఆ రాత్రి ఇక ఆమెను కలవలేదు. ఆ మర్నాడు ఉదయం అల్పాహారానికి కిందకు వెళ్లాను. అక్కడ ఆమె ఒంటరిగా ఒక టేబుల్ వద్ద తింటూ ఉండటం గమనించాను. ఆమె దగ్గరకు వెళ్లి మోకాళ్ళపై కూర్చుని ఆమె ఒడిలో తలపెట్టాను. ఆమె ఎంతో ఆప్యాయతతో నా నుదుటిపై ముద్దు పెట్టింది. ఇది నాకు నా 'దిలీప్ కుమార్' నుండి లభించిన అత్యంత గొప్ప బహుమతి.

సౌజన్యం : From **"Actually I Met Them…. A Memoir"**
*by Guljar*

కవిత

# బాలుడు అడిగిన నిజం

– పి. మోహనరావు

ప్రశ్నిస్తే...?
నోరు మూయించే చట్టం,
నిజం చెప్పితే
జైలు గోడలే పాఠశాల.

పిల్లాడు
వాస్తవాన్ని చూపిస్తే
"దేశద్రోహి!"
అదే పిల్లాడు
భవిష్యవాణి పలికితే
"యోగి పుంగవుడు!"

చేతిలో పుస్తకం ఉంటే
భయం భయం,
జ్యోతిష్యం ఉంటే
భక్తి పరవశం!

బతుకు ప్రశ్నకు
లాఠీ జవాబు!
భ్రాంతి గొల్పులకి
పూల వర్షం!!

కళ్ళు తెరిస్తే
నిద్ర కరువవుతుంది,
మూసుకుంటే
పీఠం నిలబడుతుంది

అంధత్వాన్ని
సంస్కృతి అందామా?
అజ్ఞానాన్ని
ఆచారం అందామా?
నిజం మాట్లాడే
చిన్న శ్వాసను కూడా భయపెట్టే
ఈ వ్యవస్థ...
పిరికిదా...?

తన కుర్చీ
కదిలిందని వణికే
అంతరాత్మ చరుపు!

ప్రశ్నించే గొంతు
పిల్లలదైనా సరే
వాళ్లకి భయమే.
ఎందుకంటే..?
నిజం
ఎప్పుడూ
వయసు అడగదు!

చైతన్యపు పురిటి కేక
పుడుతూ బిగించిన
పిడికిలిపై క్రూరత్వం
మనిషి మనుగడే
మటు మాయం!

(14 ఏళ్ల అశ్వమిత్ గౌతమ్ అనే కుర్రాడు సామాజిక అంశాలపై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించినందుకు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు స్పందనగా)

ఫిబ్రవరి 21 : మాతృభాషాదినం సందర్భంగా చారిత్రక పత్రాలు :

# నినదించండి గొంతెత్తి! అన్ని భాషలకు సమానస్థాయి ఉండాలని!!

## తూర్పు పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ 1952 ఫిబ్రవరి 20, 21 తేదీలలో ప్రచురించిన రెండు కరపత్రాల గురించి

**1. పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన తూర్పు బెంగాల్ ఆర్గనైజింగ్ కమిటీ (పూర్వ బంగా సంఘాధనీక్ కమిటీ) 1952 ఫిబ్రవరి 20న ప్రచురించిన కరపత్ర విశేషాలు.**

"నినదించండి గొంతెత్తి!

"రాష్ట్ర భాషగా ఇక ఇంగ్లీషు వద్దు

"పాకిస్తాన్‌లోని అన్ని భాషలకూ సమాన స్థాయి వుండాలి.

"బెంగాలీ, పంజాబీ, పఠాన్, సింధీ, బలూచి, ఉర్దూ మొదలగు భాషలు వాడుతున్నవారందరికీ తమ తమ భాషలలో విద్యామాధ్యమం వుండే, ఆయా భాషల్లోనే కార్యక్రమాలు నిర్వహించుకునే హక్కు కలిగి వుండాలి.

"బెంగాలీ, రాష్ట్ర భాషలలో ఒకటిగా తప్పనిసరిగా వుండాలి".

పై నినాదాలు అన్ని భాషల కొరకు ఉద్దేశించినవి. కేవలం బెంగాలీ భాష కోసమే కాదు. ఇది పూర్తిగా ప్రజాస్వామిక దృక్పథం. అందరి హక్కులను అంగీకరిస్తుంది. దీనికి వ్యతిరేకమైనది – పాలకవర్గం పాటిస్తున్న యజమాని మనస్తత్వం – పూర్తిగా అప్రజాస్వామికమైనట్టిది.

ఈ కరపత్రంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలను ప్రాంతాలవారీగా 1952 ఫిబ్రవరి 21న సమ్మెలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించమని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అంటే అది స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. బుజ్జగింపులు లేవు, రాజీ లేదు.

అవతలవైపు పాలకులు – ముస్లింలీగువారు దీనికి వ్యతిరేకం. ప్రజలు – పాలకులుగా రెండు పంథాలు రాజకీయ దృశ్యంలో ఏర్పడ్డాయి. కాలక్రమంలో బెంగాలీ భాష సమర్థకులైన కొందరు పశ్చాత్తాపపడి ఆర్థిక ప్రయోజనాల కోసం పాలకుల పక్షం చేరారు.

తన కరపత్రం శీర్షికలోనే కమ్యూనిస్టు పార్టీ అన్ని భాషలకూ సమాన స్థాయి వుండాలనీ, బెంగాలీ రాష్ట్ర భాషల్లో ఒకటిగా వుండాలని కోరింది.

రెండోపక్షం – పాలకుల పక్షం బెంగాలీ మాట్లాడేవారి హక్కును నిరాకరించింది.

రాష్ట్ర భాషల అఖిలపక్ష వర్కింగ్ కమిటీ పిలుపును అందుకోమని ఈ కరపత్రం విజ్ఞప్తి చేసింది.

174 పదాలు గల ఈ కరపత్రంలో :

"బెంగాలీ భాష కొరకు జరుగుతున్న ఉద్యమం ఉర్దూ భాషకు వ్యతిరేకం కాదు. అధికార భాషగా ఇంగ్లీషు కాకుండా, బెంగాలీ, ఉర్దూలతోపాటు అన్ని భాషలను గుర్తించమని ఈ ఉద్యమం కోరుతోంది.

కమ్యూనిస్టు పార్టీ తూర్పు బెంగాల్‌శాఖ తన కరపత్రంలో ఇంగ్లీషువారు తమ భాషను అధికారభాషగా ప్రవేశబెట్టి, తమ సామ్రాజ్యవాద భూస్వామ్య దోపిడీ వ్యవస్థను కొనసాగిస్తూ, వివిధ జాతుల అభివృద్ధిని ఆటంకపరిచారు అని పేర్కొంది.

తన వలస యజమాని లక్ష్యానికి అనుగుణంగానే ముస్లింలీగు ప్రభుత్వం ఉర్దూను ప్రవేశపెడుతోంది.

కొత్తగా ఏర్పడిన ఈ నయావలస దేశమైన పాకిస్తాన్‌లో ఏ ప్రాంతంలోనూ ఏ ప్రజలూ ఉర్దూ ఎక్కడా మాట్లాడరన్న వాస్తవాన్ని కూడా ఈ కరపత్రం బట్టబయలు చేసింది. ఉర్దూ భాషను అన్ని ప్రాంతాల ప్రజలపై రుద్ది, అన్ని రాష్ట్రాలను కలిపేదానిగా చేయాలని అపరిపక్వ పాలకుల భావం. వైరుధ్యాలను పట్టించుకోకుండా, ప్రచారం మీద ఆధారపడి పాశవిక శక్తిపై పాలకులు ఆధారపడ్డారు. ముస్లింలీగు వారిలో ఈ పరిమితి పుట్టుకతోనే వుంది.

**2. ఇదే సంస్థ 1952 ఫిబ్రవరి 21న విడుదల చేసిన రెండవ కరపత్రం శీర్షిక ఇలా వుంది :**

"నియంత నురుల్ అమిన్ ప్రభుత్వం చేసిన పాశవిక హత్యను ఖండిస్తూ

తూర్పు బెంగాల్ అంతా బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించండి!"

ఈ కరపత్రంలో విశ్వవిద్యాలయ ఆవరణలోనూ, వైద్య కళాశాల వసతి గృహంలోనూ పోలీసులు చేసిన దాడులూ, లాఠీఛార్జీలు, భాష్ప వాయు ప్రయోగము, కాల్పులను క్లుప్తంగా వివరించింది.

మరణించినవారు మన దేశ అమరవీరులని కీర్తించింది. వారు చేసిన అత్యున్నత త్యాగాన్ని, కోట్లాది ప్రజలు ఫిబ్రవరి 21న గుర్తుచేసు కుంటున్నారు.

ఆ కరపత్రం ఢాకా పౌరులను నురుల్ అమిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడమని పిలుపునిచ్చింది.

అంతేగాక, ముస్లింలీగు ప్రభుత్వం ఏ ప్రజా సమస్యనూ పరిష్కరించలేదనీ, సంక్షోభాన్ని తీవ్రతరం చేసిందనీ ఆ కరపత్రం పేర్కొంది.

అధికార భాషా ఉద్యమాన్ని రక్తపాతంతో అణచాలని నురుల్ అమీన్ ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పింది.

పాకిస్తాన్‌లో వున్న వివిధ భాషల ప్రజలను సంస్థలను ఈ క్రింది నినాదాలతో తమ కోర్కెలను తెలియచేయాలని ఆ కరపత్రం కోరింది.

"నురుల్ అమీన్ ప్రభుత్వం రాజీనామా చేయాలి?"

"తక్షణమే బెంగాలీ భాషను అధికార భాషలలో ఒకటిగా ప్రకటించాలి!"

"హంతకులను శిక్షించాలి! ప్రభుత్వేతర విచారణ కమీషన్‌ను నియమించాలి! మృతులకూ, క్షతగాత్రులకూ నష్టపరిహారం అందించాలి!"

"రాజకీయ ఖైదీలందరినీ తక్షణమే విడుదల చేయాలి"

"రక్షణ చట్టం – సెక్షన్ 144, ఇంకా నిర్బంధ చట్టాలను ఉపసంహరించాలి!"

"మీ మీ ప్రాంతాలలోసమ్మెలూ, సమావేశాలూ, ప్రదర్శనలూ నిర్వహించి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి" కరపత్రం చివర్లో

"ఉద్యమాన్ని అమరవీరుల సాక్షిగా ముందుకు తీసుకుపోతామని ప్రతిజ్ఞ చేయండి" అంటూ ముగించింది.

ఈ విధంగా పాకిస్తాన్‌లో శాస్త్రీయమైన భాషావిధానం కోసం కమ్యూనిస్టు పార్టీ ఏనాటి నుండో కృషి చేస్తూ వచ్చింది.

**(ఫరూక్ చౌదరీ రాసిన ఈ వ్యాసం 2022 ఫిబ్రవరి 21వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఢాకా నుంచి వెలువడుతున్న 'న్యూ ఏజ్' పత్రిక ప్రత్యేక అనుబంధంలో ప్రచురించారు).**

సేకరణ, అనువాదం : **రవిబాబు**

గుర్తుంచుకుందాం

# పర్యావరణ పరిరక్షకుడు మాధవ్ గాడ్గిల్ మృతి



**పర్యావరణ** రంగంలో విశేష కృషి చేసిన మాధవ్ గాడ్గిల్ తన 83 వ ఏట పూణే లో 2026 జనవరి 7 న మరణించారు. వారు 1942లో పూణే లో జన్మించారు. పూణే ఫెర్గుసన్ కళాశాలలో డిగ్రీ, ముంబై విశ్వవిద్యాలయంలో ఏం.ఏ. చదివి హార్వర్డ్ లో పి.హెచ్.డి.చేసారు. 1983లో బెంగళూరులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ సైన్సు, సెంటర్ ఫర్ ఎకలోజికల్ సైన్సెస్ సంస్థలను స్థాపించారు. పశ్చిమ కనుమల పరిరక్షణ వుద్యమాన్ని నడిపారు. జీవ వైవిధ్యాన్ని కాపాడటం ఎంత ముఖ్యమో తెలియచేసారు. పర్యావరణ రంగంలో నోబెల్ బహుమతి లాంటి టైలర్ బహుమతి ని వీరు అందుకున్నారు. 2006 వీరికి భారత ప్రభుత్వం పద్మ భూషణ అవార్డు ఇచ్చి గౌరవించింది. ఐక్యరాజ్య సమితి వీరిని 'ఛాంపియన్ ఆఫ్ ది ఎర్త్' అని ప్రశంసించింది.

# చిత్రకళా సృజనకారుడు పిట్టల రామచంద్రం మృతి



**ఇటలీ** కళకు పునర్వైభవం తెచ్చిన సృజనాత్మక చిత్రకారుడు పిట్టల రామచంద్రం మాష్టారు 4 జనవరి 2026న అనారోగ్యంతో మరణించారు. వారు 12 జనవరి 1940లో నల్గొండలో జన్మించారు. వృత్తిరీత్యా హిందీ పండిట్‌గా పనిచేసిన రామచంద్రం మాష్టారు ప్రవృత్తి రీత్యా చిత్రకారుడు. ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్స్‌తో పాటు వారు నేర్చుకుని గీచిన ఇటలీ చిత్రకళ స్టంప్ పౌడర్‌రూప చిత్రాలు చిత్రకళారంగంలో వారిని ఎప్పటికీ నిలిపి వుంచుతాయి. నల్గొండ, చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఇంచుమించుగా అందరి ఇళ్ళల్లో వీరు గీసిన పెద్దవాళ్ళ చిత్రాలుంటాయి. ఫొటోలు లేని కాలంలో మనిషి రూపురేఖలు చెప్పించుకుని, ఫొటోలను చూసి స్టంప్ పౌడర్‌రూప చిత్రాలను ఫొటోగ్రఫీని తలపించేలా వేసేవారు. రామచంద్రం మాష్టారు చేతుల్లో రూపుదిద్దుకున్న చిత్రాలలో తమ పెద్దవాళ్ళను పేద ప్రజలు చూసుకునేవారు. నల్గొండ ప్రాంతంలో అనేకమంది యువ చిత్రకారులను తయారుచేశారు.

# “మై రావణ”

## (నవల)

**ప్రసాద్ సూరి**

**సమీక్షకుడు : జి.వి. భద్రం**

*(సూరాడ ప్రసాద్ (ప్రసాద్ సూరి) తన 22వ యేట 2022లో రాసి ప్రచురించిన నవల 'మై రావణ'. 35 సంవత్సరాలలోపు వయసుగల రచయితలకు కేంద్ర సాహిత్య అకాడమీ ఇచ్చే సాహిత్య యువపురస్కారం ఈ నవల రాసిన ప్రసాద్ సూరికి 2025లో లభించింది.*

*రచయిత మత్స్యకారుల వాడబలిజల వృత్తికి సంబంధించినవారు. ఈ నవలకు అవార్డు వచ్చిన తరువాత ఆయన 2025 జులై 6న బి.బి.సి.కి ఇచ్చిన ఇంటర్వ్యూలో “మా కష్టాలు, చేపల వృత్తిలో మేం పడే బాధలు కళ్ళారా చూశాను. అనుభవించాను. వాటిలో చాలావరకు 'మై రావణ' నవలలో ప్రతిబింబించేలా రాశాను. మా మత్స్యకార జనుల జాతి వెతలే నేను రాసిన 'మై రావణ' నవల.... ఈ అవార్డు వల్ల మత్స్యకారుల జీవితాలకు సంబంధించిన ప్రచారం జరిగితే చాలు” అన్నారు. అయితే ఈ నవలలో మత్స్యకారుల జీవితాలు అరాకొరగా మాత్రమే ప్రస్తావించారనీ, తనకు తెలిసిన సామాజిక, రాజకీయ విశేషాలన్నిటితో ఈ ప్రధాన కథలోని పాత్రలకు కృత్రిమంగా సంబంధం కలిపి, నవలను కలగాపులగం చేసారని తెలియచేస్తూ జి.వి. భద్రం రాసిన ఈ సమీక్షను చదవండి. – సం॥)*

తెలుగులో గత రెండు, మూడు దశాబ్దాలుగా వస్తున్న అస్థిత్వవాద నవలలో భాగంగా 2022 నవంబర్‌లో 'మై రావణ' నవల ప్రచురితమైంది. విశాఖపట్న సముద్ర తీరంలో వున్న ఊళ్ళలో చేపలు పట్టే వృత్తి జీవనాధారంగా జీవిస్తున్న వాడబలిజ కులానికి చెందిన ప్రసాద్ సూరి, “తన బెస్త నేపథ్యాన్ని మరచిపోకుండా ప్రయోగాత్మకంగా” యీ నవల రచించినట్లు పుస్తక ప్రచురణకర్తల టీం ఛాయ తెలియజేసింది.



విద్యావంతుడూ, ఎన్నో విషయాలు తెలిసినవాడైన ప్రసాద్ సూరి, “అచ్చమైన వాడబలిజ అస్తిత్వాన్ని తనలో స్థిరంగా నింపుకొన్న తన శ్రీను అన్నయ్య, తమ తాతలు, మామ్మలు దగ్గర అద్భుతమైన కథల్ని విని, తాను పరిశోధన చేసి, పుస్తకాలు చదివి తెలుసుకొన్న విషయాలపైన, వాళ్ళనీ, వీళ్ళనీ అడిగి సేకరించిన విషయాలపైన ఆధారపడి, యీ నవలను రచించినట్లు తెలియజేశారు.

ఈ నవలను వ్రాయటానికి, పాశ్చాత్య సాహితీకారులు (కాల్పనిక సాహిత్యకారులు) అనుసరించే పలు టెక్నిక్‌లను, ధోరణులను, రచయిత అనుకరించారు. మాంత్రిక (Magical Realism) వాస్తవికతతో కూడిన టెక్నిక్‌ను, కథావృత్తాంతానికి నేరుగా సంబంధం లేకపోయినా కొన్ని చారిత్రక ఘటనలను కథాక్రమంలో ప్రస్తావిస్తూ వాటిని యాంత్రికంగా, అసంబద్ధంగా కథలోని ఘటనలను అతికించటం అనే టెక్నిక్‌ను వాడారు. పాశ్చాత్య క్రైమ్, థ్రిల్లర్, గూఢచారి నవలలలో మాదిరి వివిధ ప్రాంతాలలో జరిగినవాటిని కథాక్రమంలో గుదిగుచ్చి కథనం అల్లటం అనే టెక్నిక్‌లు, ధోరణులు గల పాశ్చాత్య కాల్పనిక రచనా పద్ధతులను, వాడారు. కానీ వారి మాదిరిగా లోతైన అధ్యయనం, పరిశీలన చేయకుండానే (కథాంశ విషయాలను), పైపై వివరాల సేకరణలతో, వాటన్నింటినీ కలగాపులగం చేసి ప్రసాద్ సూరి యీ నవలను రాసినట్లుగా స్పష్టంగా కనబడుతోంది.

రచయిత యీ నవలను “జానపద వీరుడు వంటి బెస్త మైరావణుడి ప్రధాన పాత్రగా భారతదేశ గత ఎనభై ఏళ్ళ సామాజిక చరిత్రతో పాటుగా, వర్తమాన రాజకీయ అంశాలను బలమైన తర్కంతో” రాశారు అనీ “అధికార మదానికీ, పీడనకీ లొంగని, జానపదవీరుని గురించి చెప్పారు” అని యీ నవల ప్రచురణకర్తలు అంటున్నారు.

అంతేకాక “రచయిత తాను చెప్పదలచుకొన్నదానిని, అనుభవ పూర్వకంగా మమేకమై వున్నపుడు లేదా అది తన జీవితంతో ముడిపడినది ఐనప్పుడు, ఏమి రాశాడు, ఎలా రాశాడు, దానిలో సామాజిక ప్రయోజనం ఏముంది అనే విమర్శక కొలమానాల్లోంచి కాకుండా తానెరిగిన విషయాలను ఎంత ప్రేమతో, తపనతో, పారదర్శకతతో చెప్పాడన్న దృక్కోణంలో చూడాలని” కూడా ప్రచురణకర్తలు పాఠకులకు సలహా యిచ్చారు.

ఈ నవల పూర్వం ఓడలు తయారుచేసేవారు, వారి పనులు ఆగిపోవటంతో చేపలు పట్టే వృత్తిలోకి మారిపోయారనీ, ఆ తర్వాత చాలాకాలానికి ఇరవయ్యో శతాబ్దంలో మొదలయ్యే ఓ వాడ కుటుంబ కథ ఇది అని రచయిత అన్నారు.

పైన వెలువరించిన అభిప్రాయాలను, సలహాలను, సూచనలనూ దృష్టిలో పెట్టుకొని, ఈ నవల సాధించిన సామాజిక ప్రయోజనం ఏమిటి అన్న కొలమానాన్ని తాత్కాలికంగా ప్రక్కనపెట్టి, అసలు యీ కథ ద్వారా రచయిత చెప్పిన విషయాలను పరిశీలిద్దాం.

ఈ నవలలో ఆధునిక వాడబలిజల జీవిత వాస్తవికతను చిత్రించటానికి రచయిత ప్రాచీన కల్పిత గాధలను మాంత్రిక (మాయా) వాస్తవికతను ఉపయోగిస్తూ, నవలలోని ప్రధాన పాత్ర అయిన మై రావణుడి (మైరావుడి)ని కారణజన్మునిగా, అతీంద్రియ శక్తులున్న వాడిగా చిత్రీకరించారు. నా చిన్నతనంలో (1953 నాటి కాలంలో) బ్రిటిష్ ముష్కరులు కాల్చి చంపిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రతికుండి బెండపూడి సాధువు రూపంలో రోగులకు చికిత్స చేస్తున్నాడని సామాన్య ప్రజలు చెప్పుకున్న కట్టుకథలు గుర్తుకొస్తున్నాయి.

శాస్త్రీయ విజ్ఞానంలోనూ, సాంకేతికతలోనూ అనూహ్యంగా ముందడుగు వేసిన నేటి అత్యాధునిక యుగంలో యిటువంటి కట్టుకథలు కొందరినైనా ‘అహేతుక, అవిజ్ఞాన’ మూర్ఖత్వం వైపుకు ప్రేరేపిస్తాయన్నది కాదనలేని వాస్తవం. ఇటువంటి కథలను ఎంత తపనతో చెప్పినా అవి అభివృద్ధి నిరోధకత వైపుకే ప్రేరేపించి, తిరోగమింపజేస్తాయన్న దాన్ని ఆ రచయిత మాత్రం ఎలా కొట్టిపారేయకలుగుతారు? అనాలోచితంగానైనా రచయిత, తన నవల ద్వారా అటువంటి అసంబద్ధమైన, అనవసరమైన కట్టుకథ రూపంలోని, తిరోగమన ప్రేరణాత్మక అభిప్రాయాలను కలిగించటం ఏ రకంగా సమర్ధనీయం?.

తన నవలలోని ప్రధాన పాత్ర అయిన మైరావుడిని రచయిత నార్త్ ఇండియాలో చిన్న చిన్న పట్టణాల్లో కన్పించే డాన్‌ల లాంటి ఆహార్యంలో పాఠకుల ముందు ప్రవేశపెట్టాడు. అతడ్ని విశాఖపట్నం నుంచి వచ్చి స్థిరపడిన బెస్తవాళ్ళ నాయకుడిగానూ, సంపన్నుడిగాను, స్థానిక ఎమ్మెల్యేకి మద్దతునిచ్చేవాడుగానూ, అతడి మద్దతుతోనే అప్పటిదాకా స్థానిక ఎమ్మెల్యే, ఎలక్షన్లలో గెలుస్తూ వుంటాడని చిత్రించారు. అలా మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టబడిన మైరావుడు, దుర్గి హైస్కూలులో ఎగ్జామ్ హాల్స్‌లోంచి ఎగ్జామ్ పేపర్లను బయటకు విసిరేస్తున్నవాడిగా, కత్తులు పట్టుకొని అరుస్తున్న భూతాల్లా వున్న వారికి నాయకునిగా, భయం భయంగా చూస్తున్న స్టూడెంట్స్, ఇన్విజిలేటర్లు, ముందు పరీక్ష జవాబు పత్రాలను పోగేసి మంట బెదుతున్న ఆగంతకులు, ఎదురుగా మోకాళ్ళమీద కూర్చొని దెబ్బలు తగిలి బిక్కు బిక్కుమంటున్న హైస్కూల్ హెడ్‌మాస్టరు, ఒక మూల ఒక అమ్మాయి శవాన్ని పట్టుకొని కొందరు ఆడవాళ్ళు గుండెలు బాదుకొని ఏడుస్తున్న సన్నివేశంలో కనబడతాడు. ఆలస్యంగా వచ్చినందుకు, పదో తరగతి పరీక్షలు రాయనీయనందుకు మనస్తాపం చెందిన ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకొన్నందున దానికి ప్రతిచర్యగా మైరావుడి నాయకత్వంలో అటువంటి అల్లరి జరుగుతున్నట్లుగా మనకు తెలుస్తుంది.

దీన్ని చూసిన మనం దీన్ని “అధికారమదానికీ, పీడనకీ లొంగని వెరువని పోరాటతత్త్వం” అనుకోవాలా? పరీక్ష సమయానికి ఆలస్యంగా వస్తే పరీక్ష రాయటానికి అనుమతించం అని, నిర్ణయం చేసి అమలుజరుపుతున్న విద్యాపాలనా వ్యవస్థకు వ్యతిరేకంగా జరిపిన నిరసనాపూర్వక ఆందోళనగా అర్థం చేసుకోవాలా? ఈ రకంగా మైరావుడిని తన వాడబలిజ వారి ప్రయోజనాలను పరిరక్షించుతున్న పోరాట వీరుడిగా అర్థం చేసుకోవాలా? చౌకబారు సినిమాల్లో చూపించే హీరోయిజం తప్ప మరేమీ కాదు గదా!

ఇటువంటి అల్లరి నిరసనకు నాయకత్వం వహించిన నాయకుడి అనుచరులను అదుపు చేయటానికి వచ్చిన పోలీసు ఇన్‌స్పెక్టరును, బురదలోకి తోసివేసి, ఆ అల్లరిమూకల గుంపు మొత్తం రెండు సుమోలు, ఒక జీపులోనూ చూస్తుండగానే మాయమైపోతారు. ఇదంతా క్షణాల్లో జరిగిపోతుంది. ఈ సందర్భంగా గతంలో మైరావుడు జరిపిన ఒక వీరోచిత చర్య గురించి కూడా రచయిత గుర్తు జేస్తాడు. ఒకప్పుడు బుగ్గవాగులో చేపలు పడకపోవటంతో, మైరావుడు ఓ అయిడియా వేసి, దొంగసారా కాయటం మొదలెట్టాడు! పోలీసులకు యీ విషయం తెలిసి అతడ్ని అరెస్టు చేయటానికి వెళ్ళగా, అతడు అక్కడ లేకపోవటంతో అతడి తల్లినీ, మేనకోడల్నీ పోలీసులు అరెస్టు చేశారట! విషయం తెలిసిన మైరావుడుకి మండిపోయి, స్టేషన్‌కు ఫోన్ చేసి “ఏరా బతకాలని లేదా?” అంటూ యిన్‌స్పెక్టరును బెదిరించటంతో అతడు ఏదో బూతు సమాధానం చెప్పి ఫోన్ పెట్టేశాడట! అయినా ఆరోజు సాయంత్రమే మైరావుడి తల్లినీ, మేనకోడల్నీ వదిలిపెట్టేశారట! కానీ ఆరోజు రాత్రే బాంబువేసి పోలీస్ స్టేషన్‌ను పేల్చేయటంతో తొమ్మిదిమంది కానిస్టేబుళ్ళు, ఒక ఎస్సై ఆ ఘటనలో చనిపోయారు. ఇది (మావోయిస్టు)

అన్నలు చేశారంటారుగానీ, మైరావుడే చేశాడు – వాడికి భయంలేదు అని రచయిత చెబుతాడు. ఇటువంటి సినీమాటిక్ ఘటనలు మైరావుడి యొక్క అసందర్భపు ప్రతీకార ఘటనలు అతణ్ని ఏ రకంగా “అధికార మదానికీ, పీడనకీ లొంగని, వెరవని ధీరుడిగా” నిలబెడతాయి? ఇటువంటి కొన్ని ప్రతీకారపు అరాచకపు చర్యలు చేస్తున్న మైరావుడిని అతడున్న బుగ్గవంక ఏరియాకు, జనాలకూ రాజుగా అభివర్ణిస్తాడు రచయిత.

ఇక యీ ప్రధానపాత్ర అయిన మైరావుడి బాల్యం గురించి చెప్పిన విషయాలు చూద్దాం. బుగ్గ రిజర్వాయర్ కట్టడానికి ముందు ఊరిలో బుగ్గ మల్లేశ్వరస్వామి గుడి వుండేది. ఆ గుడి బుగ్గ డ్యామ్‌లో మునిగిపోయి, డ్యామ్‌లో నీటిమట్టం బాగా తగ్గిన సమయంలో ఆ గుడి శిథిలాలు కనబడతాయి. అక్కడ ఒక నిలువెత్తు శాసనం వుంది. దాన్ని చూసిన 13, 14 ఏళ్ళ బాలుడైన మైరావుడుకి అది ముత్తాతలనాటి భాషలో వుండటం వలన అర్థం కాకపోయినా, అక్కడున్న ఒక వృద్ధుడు (బాతుగుడ్లు అమ్ముకొనే యానాది) దాని అర్థం చెప్పాడట! “నీళ్ళలో వున్న శివలింగాన్ని పానవట్టంలోంచి పైకెత్తగలిగే మొగోడికి, ఏం కోరితే అది సిద్ధిస్తుందని” తన తాతలు చెప్పుండేవారని ఆ వృద్ధుడు చెప్పాడు. అది విన్న మైరావుడు, ఆ మర్నాడు పొద్దున్న అతికష్టపడి ఆ శివలింగాన్ని పైకి లేపాడట! (పాఠకులకు ‘బాహుబలి’ సినిమా గుర్తుకు వస్తే నేనేమీ చేయలేను).

ఈవిధంగా మైరావుడు బాల్యంలోనే ‘మొగోడు’ అయినట్లుగా రచయిత మనకు అన్యాపదేశంగా తెలియజేసాడు. అంతేకాదు మైరావుడు నీళ్ళల్లో వున్న దానిని దూరం నుంచే కనిపెట్టగలడనీ, అందుకు ఉదాహరణగా డ్యామ్‌లోకి నీళ్ళు వదిలిన రోజుల్లో కొట్టుకొస్తున్న ఒక శవాన్ని మైరావుడు లాగి, దాని మెడలో వేలాడుతున్న వెండి పులి గోరుతో కూడిన సన్నటి బంగారు గొలుసు తీసుకొని తన మెళ్ళో వేసుకొన్నాడు. ఇంతకీ ఆ పులిగోరు గొలుసు పలనాటి ఎలమంద అనే పెద్ద దొంగది. అంతకుముందు అది ఒక నక్సలైట్‌కు చెందినది. మైరావుడు తీసుకొన్న గొలుసుతోపాటే ఆ శవంగా మారిన మనిషి ఆత్మ కూడా మైరావుడిని ఆవహించిందని చెప్పుకొంటారు.” ఈ రకంగా ఒక నక్సలైట్ నుండి పులిగోరు గొలుసు మెడలోకి చేరిన పెద్ద దొంగ పలనాటి ఎలమంద ఆత్మ మైరావుడిని ఆవహించటం ద్వారా అతడు మరింతగా ధీరుడయ్యాడని రచయిత చెబుతున్నాడు.

అతడికి మైరావుడిగా పేరు రావటానికి కారణమయిన మరో వీరకృత్యం గురించి రచయిత మరో కథ చెప్పారు. : బుగ్గవాగు కాలువపాటులో అప్పటికే లక్ష రూపాయలు అందుకున్న మొదటి మనిషిగా రికార్డు సంపాదించిన మైరావుడు మూడు లక్షల బిల్లు అందుకోవాలని టార్గెట్ పెట్టుకొని, పాత బ్రిడ్జి తిన్నగా వలలు వేసి వలెత్తుతూ వుంటే, అందులో పడ్డ ఒక రవ్వ చేపని దుడ్డుకర్రతో స్పృహతప్పేట్టు కొట్టి, తొంగో పెట్టాడుట! కానీ నదిని దాటుతున్నప్పుడు పుట్టి పళ్ళెం తిరగబడిపోయి, పుట్టి కూడా తిరగబడే స్థితికి రావటంతో, మైరావుడు ఏభై కిలోల బతికిన చేపల మూటను, అసాధ్యం అయిన పనిని, గజేంద్రుడిలాంటివారికే సాధ్యమయిన పనిని – లాక్కొని ఒడ్డుకు తీసుకువచ్చాడట! ఆ రకంగా మైరావుడిని రచయిత ఒక వీరుడిగా చిత్రించాడు.

రచయిత చెప్పిన మరో కథ ప్రకారం చేపలు పట్టడం కోసం ఒక రోజున ఏడేళ్ళచ్చు వలలు వేసినప్పుడు మైరావుడి వలా, గనగళ్ళ దేవుడి వలా ఒక దానిమీంచి ఒకటి వెళ్ళి ఆ వలలు క్రాస్ కాగా మధ్య రాత్రప్పుడు ఆ రెండు వలలూ క్రాస్ అయిన దగ్గర ఒక పది కేజీల రవ్వ (చేప) దూరేసిందట! మర్నాడు ఎవడు ముందొచ్చి వల ఎత్తుకొంటాడో వాడిదే ఆ చేప అనే రివాజు ప్రకారం. ముందుగా వచ్చిన మైరావుడు ఆ చేపను ఎత్తుకొంటున్నప్పటికీ, గనగళ్ళ దేవుడు వచ్చి అది తన చేప అని వివాదం పెట్టుకొన్నాడట! కానీ మైరావుడు ఆ చేప రాత్రి తన కలలోకి వచ్చి తాను మైరావుడి వలలో పడ్డానని చెప్పినట్లు వాదించాడు. దాంతో ఈ వివాదం పెద్దల దగ్గరికి పంచాయితీకి వెళ్ళిందట! అప్పుడు నేలమీద కొన ఊపిరితో పడున్న చేప ఆ పంచాయితీలో “తనకు ఈ మైరావుడు ప్రాణభిక్ష పెట్టిన దాత అనీ, అందువలన తాను ఆయన వలలో దూరినట్లు తన చేప జాతి మీద ఒట్టు పెట్టుకొని సాక్ష్యం చెప్పిందట! ఈ కథను గనగళ్ళ దేవుడే స్వయంగా చెప్పినట్లు రచయితే తెలియజేస్తున్నాడు. ఇటువంటి అభూత కల్పన కథలు ఏవిధంగా బెస్తవారి జీవితాన్ని స్పష్టంగా చిత్రించినట్లు అవుతుందో రచయితే చెప్పాలి!

రచయిత చెప్పిన మరో కథ యిలా వుంది : ఉట్లపల్లి లంబాడీ తండాలోని మోతీలాల్ నాయక్ మైరావుడి దోస్తు. వీరిద్దరూ కలసి ఒకరోజున కడుపుతో వున్న పందిని కొట్టి చంపారు. ఆ పాపం వారిద్దరినీ గట్టిగానే కొట్టింది! ఐదుగురి ఆడపిల్లలను అప్పటికే కన్న మోతీలాల్ రెండవ భార్య ఆరో ఆడపిల్లను కన్నది. అందువల్ల ఆ పుట్టిన ఆరోపిల్లను మోతీలాల్ పీక మీద కాలేసి త్రొక్కబోతోంటే మైరావుడు వచ్చి ఆపి, ఆ పసిగుడ్డును, పిల్లలు లేక బాధపడుతున్న వెంకటేశ్‌కు యిచ్చే ఏర్పాట్లు చేశాడు. కానీ మైరావుడూ, మోతీలాలూ డబ్బులకు పిల్లల్ని అమ్ముతున్నారన్న కేసులో పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత బెయిల్‌పై వచ్చిన మైరావుడు అక్కడ నుండి బస ఎత్తేసుకొని బుగ్గవాగు వెళ్ళిపోయాడు. బుగ్గవాగులో మైరావుడి పెళ్ళాం తన చంటిదానికి స్నానం చేయించి, గుగ్గిలం పొగ వేస్తుండగా పొగ ఊపిరితిత్తుల్లోకి పోయి ఊపిరి ఆడక ఆ చంటిపిల్ల చచ్చిపోయింది. అప్పుడు తనకు, తన కూతురు కావాలని తీసుకురమ్మని మైరావుడి భార్య పట్టుపట్టడంతో అతడు ఏదో చేసి పోలీసులు తీసుకుపోయిన ఆ లంబాడీ పాపనే తీసుకొచ్చి భార్యకు యిచ్చాడు.

ఈ కథలాగే, నమ్మక తప్పనంత విధంగా బుగ్గవాగు చెరువు చుట్టూ వున్న ప్రజలు, మైరావుడు అసలు ఉన్నట్టుండి ఇంత డబ్బు ఉన్నవాడు ఎలా అయ్యాడు? అసలు ఎవరూ టచ్ చేయలేనివిధంగా ఇంత పేరూ పలుకుబడి ఎలా సంపాయించాడు? అని చెప్పుకొంటున్న

కథ ప్రకారం, ఆత్మకూరులో తనకు ఎడ్లు యిచ్చిన సైదులుకున్న ఎప్పటినుంచో బీడుపడి వున్న పొలం కౌలుకు తీసుకొని, అందులో పత్తి పండిద్దాం అనుకొని, పొలం దున్నుతుండగా మైరావుడి నాగలికి మామిడి పిందెలా ఉండే పాత్రకు లంకె వేసున్న 'లంకె పిందెలు' దొరికాయి. చాలామంది దీన్నే లంకెబిందెలుగా తప్పుగా అర్థం చేసుకొన్నారు. పొలం గట్టు నుండి వీటిని ముందుగా పొలం కౌలుకిచ్చిన సైదులే చూశాడట. ఆ లంకెపిందెలు మైరావుడే తీసుకోవటం వలన సైదులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు అంటారట! ఇది ముందు చెప్పిన కథల మాదిరి జానపద కథ కాదు అన్నట్టుగా రచయిత యీ కథను చెప్పారు! అయితే ఈ కథ ద్వారా రచయిత ఏం చెప్పదలచుకున్నారో అర్థం కాదు.

మైరావుడు చిన్నప్పుడే చదవటం రాయటం నేర్చుకొన్నాడనీ, ఓసారి ఆటల పోటీలో పరుగుపందెంలో ఫస్టు వచ్చినందుకు మాస్టారు మెచ్చుకొని బహుమతిగా తెన్నేటి సూరి 'చంఘీజ్‌ఖాన్' బహుమతిగా యిచ్చారనీ, ఆ పుస్తకం తెగనచ్చిన మైరావుడు తనను తాను చంఘీజ్ ఖాన్‌గా భావించేవాడనీ, మాస్టారు అతడికిచ్చిన "స్పార్టకస్" లాంటి యితర పుస్తకాల్లోని పాత్రలు తనూ తన కుటుంబంలోని పాత్రల్లా వున్నాయనీ, తాను వాళ్ళ మధ్యనుంచే పైకి లేచే కథానాయకుడిలా అనుకోవడం మొదలుపెట్టాడనీ, ఆ పుస్తకాలు 'మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి!' అని అతడికి స్పష్టంగా చెప్పాయి అంటూ రచయిత తెలియచేశాడు. ఆ రోజుల్లోనే సినిమా చూడ్డానికి మాచర్ల వెళ్ళిన మైరావుడి తమ్ముడు రోడ్డు దాటుతుండగా లారీ గుద్దేసి చనిపోయాడని, దాంతో అమ్మవార్ల మీద నమ్మకం పోయిన అతడి తల్లి ఒక పాస్టరు దగ్గర బాప్తిజం తీసుకొని, మతంలో చేరిపోయినట్లు తెలియజేస్తాడు. అదే రోజుల్లో అన్నిచోట్లా అన్నల గురించీ, వారి కదలికల గురించీ కబుర్లు రావటం మొదలుపెట్టాయట! అయితే అన్నలతో పరిచయం దొరకలేదుగానీ, కమ్యూనిస్టు కార్యకర్తలతో 'అఖిల భారత రైతుకూలీసంఘం వాళ్ళతో' మైరావుడి తల్లికి పరిచయం ఏర్పడిందట! ఆమె అప్పుడు వాళ్ళకు తమ ప్రాంతంలోని ప్రజల పరిస్థితి గురించి చెప్పటంతో, వాళ్ళు ఒకరోజు వచ్చి టెంట్లు వేసి, ఊరి జనాలు అందరినీ పిలిచి మీటింగు పెట్టి పాటలు పాడి, ఊరి మధ్యలో కమ్యూనిస్టు జెండా ఎగురవేసి వెళ్ళిపోయారట! ఆ మీటింగులో మొదటిసారి మైరావుడు, కొత్తపేర్లు – కామ్రేడ్, కమ్యూనిజం, పెట్టుబడిదారీ వ్యవస్థ, విప్లవం, మార్క్స్, లెనిన్, స్టాలిన్, రష్యాలాంటివి విన్నాడట! మీటింగ్‌కు వచ్చిన పెద్దవాళ్ళలో అమరయ్య అనే పెద్దాయనను మైరావుడు కలిసి కమ్యూనిజం అంటే ఏంటో, కమ్యూనిజం వస్తే అందరూ సమానం అయిపోతారా అన్న విషయాలపై వివరంగా చెప్పమని కోరితే, ఆయన వివరంగా చెప్పాలంటే చాలా సమయం పడుతుంది కనుక, వీలయినంత సులువుగా కమ్యూనిజం గురించి చెప్పాడట! ఈ రకంగా అన్నలతో, కమ్యూనిజంతో మైరావుడికి సంబంధాన్ని కల్పిస్తాడు రచయిత. తర్వాత ఆ విషయంలో మైరావుడు ఏవిధంగా ప్రతిస్పందించాడో రచయిత తెలియజేయలేదు.

మైరావుడు ఒకరోజు కన్పించకుండాపోయి, కొన్నాళ్ళు చినగాలమ్మ అనే ఒక వివాహిత యువతితో యవ్వారం నడిపించాడనీ, యిద్దరూ కలిసి కసిగా ఒకరిని ఒకరు కలేసుకొని కుమ్మేసుకొనేవారంట! (దానిని హనీమూన్ అనొచ్చునని వారికి తెలియదట!) ఇంతలో చినగాలమ్మ మనుషులు వాళ్ళిద్దరినీ పట్టుకొని, మైరావుడిని స్థంభానికి కట్టేసి కొట్టి, చినగాలమ్మను కుక్కను కొట్టినట్టు కొట్టి అన్నంలో విషం పెట్టి చంపేశారట! పంచాయితీ పెట్టి మైరావుడు చేసిన తప్పుకి ఇరవై వేలు కట్టించుకొన్నారట! అప్పుడు మైరావుడికి పద్దెనిమిదిదేళ్ళట! ఈ ఘటన జరిగిన తర్వాతే మైరావుడు ఇంటి నుంచి వెళ్ళిపోయాడట! కొంతకాలానికి యింటికి తిరిగొచ్చి, మెట్టమీద జమ్ముగడ్డి గుడిసె వేసుకొని, చేపలుపట్టే సాధనాలు, సరంజామా సమకూర్చుకొని చేపలు పట్టడం మొదలెట్టాడట! పాటొద్దడానికి మైరావుడు సేట్ల దగ్గర పెట్టుబడి దీసుకోలేదట! అప్పుడు మైరావుడు అన్నలుతో తిరిగాడు అనీ, పోలీసులు అన్నలను చంపేస్తున్నారని తిరిగొచ్చినాడనీ, అన్నలు అందరూ చచ్చిపోతే వాళ్ళ డబ్బు మైరావుడికి దొరికేసింది అనీ, ఊరిజనాలు అనుకొన్నట్లూ మైరావుడు వస్తావస్తా తెచ్చిన ఒక చిన్న సూట్కేసులో రెండు జతల బట్టలతో పాటు కొన్ని పుస్తకాలు వాటిలో ఒక 'వార్ అండ్ పీస్' అనే లావాటి పుస్తకం పేజీల మధ్యలో పేజీలు కత్తిరించి అమర్చిన రివాల్వర్ ఉన్నట్లు, దాని చిత్రాన్ని గూడా నవలలో చూపించటం ద్వారా (మనకు అర్థం కాదేమోనని) రచయిత మైరావుడి అజ్ఞాత జీవితపు 'సాహస' యాత్ర గురించి తెలియజేస్తారు. అప్పటినుండి మైరావుడు ఊళ్ళో అప్పులు కావల్సినవారికి వడ్డీకి డబ్బులు అప్పు యిచ్చేవాడు! అప్పులు తీర్చటానికి ఇబ్బంది పడే జనాలను ఇబ్బంది పెట్టకుండా, కొంచెం ఆలస్యమైనా ఇచ్చెయ్యమనేవాడు తప్ప తిట్టడం, కొట్టడం లాంటివి చేసేవాడుకాదు. ఆవిధంగా మెజారిటీ ప్రజల అభిమానం సంపాదించుకొన్నాడు. తన తల్లికి బంధువైన దేవుడమ్మ ముగ్గురి కొడుకులను తన దగ్గర పెట్టుకొన్నాడు. మైరావుడి సొంత సైన్యంలో యీ ముగ్గురే మొదటివాళ్ళు. ఆ తర్వాత కూడా కొంతమందిని అక్కడ నుంచి ఇక్కడ నుంచి రప్పించి పనిలో పెట్టుకొని, మైరావుడు సైన్యాన్ని కూడేసుకొన్నాడు. బారు మెట్టమీద తను మేడ కట్టుకొన్నాడు.

ఉన్నట్టుండి పొలం దున్నుతుండగా లంకెబిందెలు దొరికి, ధనవంతుడు అయిపోయాక మైరావుడు ఊరిని కూడా మార్చాడు. పక్కా యిళ్ళు కట్టుకోవటానికి అందరికీ సాయం చేశాడు. రోడ్ దగ్గరి నుంచి ఊర్లోకి బాట బాగుచేయించి సిమెంటు రోడ్డు వేయించాడు. చిన్నపిల్లలకి బడి కట్టించాడు. ఒకరోజు అతడికి చంఘీజ్ ఖాన్‌లా విశాలమైన ప్రపంచం మీదికి దండయాత్రకి పోదాం అనిపించింది.

మాచర్ల రాజకీయ నాయకులకు బుగ్గవాగు జనాల అవసరం ఉండటం కోసం, వాళ్ళని ఓటు బ్యాంకుగా మార్చటం కోసం మైరావుడు బుగ్గవాగు జనాలందరినీ వాళ్ళ ఓట్లు మాచర్ల నియోజకవర్గానికి మార్చుకోమని, పద్దెనిమిదేళ్ళు నిండిన వాళ్ళందరినీ ఓటు తీసుకోమని, కొత్తవాళ్ళని కూడా పిలిచి, బుగ్గవాగులో వుండటానికి వాళ్ళకు చోటు

చూపించి విశాఖపట్న ప్రాంతం నుండి వచ్చినవారి ఓట్లను ఆత్మకూరు పంచాయితీకి మార్పించి, తను ఎప్పుడు ఎవరికి చెప్తే వాళ్ళకు ఓటు వేసేలా వాళ్ళందరినీ ఒప్పించి, అలా వచ్చిన ఓట్లన్నిటినీ "తన సంకలో మడిచి పెట్టుకొని", స్థానిక ఎమ్మెల్యేగా తాను బలపరచినవారినే గెలుపొందించే స్థాయికి చేరుకొన్నాడు. స్థానికంగా ఎవరు ఎమ్మెల్యే అయినా బుగ్గవాగు చెరువు మీద తన పెత్తనమే సాగటం కోసం, తన మనుషులనందరినీ అందుకు సిద్ధం చేశాడు. కుర్రాళ్ళందరికీ తుపాకీ కాల్చటం, గొడవ వచ్చినపుడు ఆయుధం లేకపోయినా ఫైట్ చేయటం లాంటివి తనే దగ్గరుండి నేర్పించి, మైరావుడు తన ప్రైవేటు ఆర్మీ క్యాంపు ఏర్పాటు చేసుకొన్నాడు. రిజర్వాయర్లు, ఆనకట్టలు ఎక్కడ వున్నా అక్కడ చేపలు పట్టుకొని బతికే తన మనుషులందరినీ కూడేసి, మీటింగులు పెట్టి మత్స్యకారులందరిలోనూ మైరావుడు పాపులారిటీ సంపాదించు కొన్నాడు. ఈ రకంగా తన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని 'రాజు'గా వెలుగొందుతున్న మైరావుడినే రచయిత మనకు దుర్గి హైస్కూలులో అల్లరి చేస్తున్న దుండగుల నాయకుడిగా మన ముందు నిలబెట్టారు.

మరి యీ రకంగా వాడబలిజల నాయకుడిగా తనను స్థాపించుకొన్న మైరావుడిని, మనం వాడబలిజ కులస్థుల 'రక్షకుడి'గా అర్థం చేసుకోవాలా? లేక దేశమంతటా అనేక పేర్లు చెప్పుకొని, అనేక సెంటిమెంట్లు రెచ్చగొట్టి స్థానికంగా తమ, తమ పెత్తనాలను దౌర్జన్యం ద్వారా పెంచుకొంటూ, దోపిడీ రాజకీయ నాయకులకు మద్దతు ఏజెంట్లుగా వున్న రౌడీ నాయకుడిగా చూడాలా?

మైరావుడి కథకు పూర్వపు కథను రచయితే తానే "సర్వాత్మ"గా యీవిధంగా చెప్పాడు. 1930లో పూడిమడకలో మసేను దేవర అనే వ్యక్తి ఇంట్లో గంజి లేక (చేపల వేటకెళ్ళిన కొడుకు యింకా రాకపోవటంతో) ఇంత కల్లు త్రాగుదామని ప్రభుత్వ ఆధీనంలో వున్న ఉప్పుమడుల్లో ఉప్పు దొంగతనం చేస్తుండగా, అతడ్ని పట్టుకొని మార్టిన్ అనే సైనికుడు (తెల్లవాడు) అతడ్ని పశువును బాదినట్టు బాదుతుంటే అది చూసి తట్టుకోలేకపోయిన, మసీసుదేవర పదిహేనేళ్ళ కొడుకు, లావుగా వున్న ఒక తెడ్డు దొరికితే దానితో మార్టిన్ తలపై ఒక దెబ్బ వేశాడు. ఆ సైనికుడు ఉన్న పాటున కూలిపోయి ప్రాణం విడుస్తాడు. ఆ కుర్రాడి పేరు నూకన్న. తాను సైనికుడ్ని కొట్టేసిన తర్వాత పారిపోయి, విశాఖపట్నం జాలరిపేటలోని వాళ్ళ బాప్ప దగ్గరికి వెళ్తాడు. ఆమె వాడికి ధైర్యం చెప్పి వాణ్ణి "తెల్లోళ్ళు ఉన్నంతకాలం ఎనక్కి రాకురా కొడుకా" అని జాగర్త చెప్పి ఆ మరుసటిరోజే అలివి లాగటానికి రంగం (రంగూన్) వెళ్ళే బంగారు చిట్టి జట్టుతో ఓడ ఎక్కించి పంపేస్తుంది. అప్పటికే కరువు వలన జీవనోపాధి లేకపోవటం వలన, విశాఖపట్నం జిల్లా నుండి రంగం వెళ్ళినవాళ్ళు ఓ లక్షమంది పైనే వుంటారు. అక్కడ ఆ వాడబలిజలు బాగా గడించేరు. ఆ దేశం వెళ్ళినప్పుడు కుర్రాడిగా వున్న నూకన్న డబ్బులు కూడబెట్టి స్వంతంగా అలివి కొనుక్కొని, వూరి నుండి కుర్రాళ్ళను రప్పించుకొని తనూ సరంగు (యజమాని) అయ్యాడు. అతడ్ని ఒక బర్మా దేశపు వితంతువు (పెళ్ళయిన రెండేళ్ళకు భర్త చనిపోయి ఒక కొడుకు వున్న స్త్రీ)ను ప్రేమించి ఒక రాత్రి "అతనితో తాను సుఖపడి, అతడ్ని సుఖపెట్టి" అతడు తెల్లారుఝామున తిరిగి వెళ్తోంటే, ఒక నగిషీలు చెక్కిన రాగి భరిణను అతడి చేతిలో పెడుతూ, దాన్ని తరతరాలుగా తన కుటుంబం కాపాడుతూ వస్తోందనీ, ఆ భరిణలో బుద్ధ భగవానుడి అస్తికలున్నాయని వాళ్ళ పెద్దల నమ్మకమనీ, తానైతే ఎప్పుడూ తెరిచి చూడలేదనీ, నూకన్ననూ చూడవద్దని చెప్పింది. వాస్తవానికి అనోరథా మహారాజు కాలంలో భారతదేశం నుండి ఆ రాగి భరిణ బర్మా వచ్చిందనీ, అది ఎక్కడ వుంటే అక్కడ రాజ్యం సుభిక్షంగా వుంటుందనీ చెప్పి, ఒక పెద్ద యుద్ధం రాబోతోందనీ, అందుకని నూకన్నని తన దేశం వెళ్ళిపోమనీ చెప్పింది. బ్రిటిష్ బర్మాపై జపాన్ యుద్ధం చేయటంతో, నూకన్న స్వదేశానికి బయలుదేరతాడు. దారిలో ఎన్నో కష్టాలు పడతాడు. అతడికి బర్మా స్త్రీ యిచ్చిన రాగి భరిణ కూడా దారిలో పోతుంది. స్వదేశానికి చేరుకొన్న యీ నూకన్నే మైరావుడి తల్లికి తండ్రి అయిన మైరావుడి తాత. – ఇదీ రచయిత చెప్పిన వాడబలిజలకు చెందిన గత చరిత్రకు చెందిన విషయం.

రచయిత ఒకవైపు మైరావుడికి చెందిన, దుర్గి హైస్కూలు ఉదంతం చూపిస్తూనే, దానికి సమాంతరంగా మరో ఉదంతాన్ని కూడా ప్రారంభించి, కొనసాగించి, ఆఖరిలో ఆ రెండింటినీ అతికించారు. ముంబాయికి చెందిన ఒక ఇంగ్లీషు దినపత్రికలో రిపోర్టర్‌గా పనిచేసే మహీత్యాగీ, ఒక కారులో ప్రయాణం చేస్తూ, మహారాష్ట్రలోని ఒక జైలును చూడటానికి ఆ జైలు జైలర్ ఆహ్వానంపై వెళ్తోంది. అంతకుముందు రెండురోజుల క్రితం తాను ఆ జైలు గురించి ఒక వ్యాసం రాస్తూ, "ఆ జైలు కండిషన్ సరీగ్గా లేదని, శుభ్రత విషయంలో జైలు అధికారులు ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవటంలేదని, ఆరోగ్య సమస్యలున్న ఒక ఎనభై ఏళ్ళ వృద్ధుడిని అందులో ఉంచటం సరికాదని, పూర్తి ఆరోగ్యవంతులు అయిన యువకులే అలాంటిచోట వుండటమే కష్టం, అలాంటిది తప్పు చేశారో లేదో రుజువు కాని వ్యక్తిని ఉంచటం నిజంగానే మానవ హక్కులను ఉల్లంఘించటం" అని వ్రాసింది. ఆ ఆర్టికల్ దేశంలో అప్పటిదాకా అరెస్టుకి వ్యతిరేకంగా వస్తున్న విమర్శలకు ఊతం యిచ్చిందట! అరెస్టు కాబడ్డ వృద్ధుడు దేశవ్యాపితంగా అరెస్టయిన అనేకమంది సామాజిక కార్యకర్తల్లో ఒకడు. (ఈ వృద్ధుడి పాత్రను ఆ మధ్య కాలంలో అరెస్టు చేయబడి, ముంబై జైలులో మరణించిన ప్రముఖ మానవహక్కుల నాయకుడు స్టాన్ స్వామినీ, రాడికల్ కమ్యూనిస్టు పార్టీని నిర్మించి, రాడికల్ ఉద్యమాలు నిర్వహించిన నాయకుడు కొండపల్లి సీతారామయ్యనీ – కలిపి, ఒకే పాత్రగా రచయిత రూపొందించారు). ఆమె వ్రాసిన ఆర్టికల్‌కు స్పందనగా ఆ జైలరు, రిపోర్టర్ మహీత్యాగిని లంచ్‌కి ఆహ్వానించాడు. అతడితో మాట్లాడితే ఒక స్టోరీ వ్రాసుకోవచ్చునని, ఆమె అక్కడికి బయలుదేరింది. దారిలో ఆమె 'చరిత్రకారుడి భయం' అనే ఆర్టికల్ చదువుకొంటోంది. ఆమె కొన్ని నెలలుగా దేశంలో బాగా పేరుమోసిన ఒక మల్టీనేషనల్ కంపెనీ

చేసిన ఒక స్కామ్‌కి సంబంధించి కూడా స్టడీ చేస్తోందట! సరిగ్గా ప్రయాణం చేస్తున్న ఆ సమయంలోనే దుర్గి హైస్కూలులో మైరావుడి నాయకత్వాన, ఆగంతకులు జరిపిన అల్లరి, గోల వీడియో, సెల్‌లో వస్తే ఆమె చూస్తుంది. ఆమెను లంచ్‌కి పిలిచిన జైలరు పేరు 'విజయ్ సలస్కర్' అట! మరాఠీ కుటుంబానికి చెందిన విజయ సలస్కర్ చిన్నప్పటి నుండీ ఆర్.ఎస్.ఎస్ సంఘసభ్యుడు. శివసేన వారి ప్రోత్సాహంతో సివిల్ సర్వీసులోకి ఎంటరు అయ్యాడట! ప్రస్తుతం అతడు మాహీని లంచ్‌కి పిల్చి, మాటల్లో "ఖైదీల సేఫ్టీ మేం చూసుకొంటాం, ఇంకెప్పుడూ పేపర్‌లో అలా యిష్టం వచ్చినట్లు రాయకు" అని డైరెక్టుగానే బెదిరించాడట!

(ఇంకా వుంది) ✣

గుర్తుంచుకుందాం

## చిత్రకళా విమర్శకుడు, రచయిత

# వెనిగళ్ళ వెంకటరత్నం మరణం



**'ప్రజాసాహితి'** సన్నిహితుడు, సాహిత్య ప్రియుడు, చిత్రకళా విమర్శకుడు వెనిగళ్ళ వెంకటరత్నం తన 88 వ ఏట హైదరాబాదు లో 2026 జనవరి 24న సుదీర్ఘ అనారోగ్యంతో మరణించారు. ఆయన స్వగ్రామం తెనాలి సమీపంలోని గోవాడ.

గొవాడలో హై స్కూల్ విద్య, తెనాలి లో బి.ఏ.చదివారు. 1965లలో తెనాలి సమీపాన గల తుమ్మపూడిలో సంజీవదేవ్ ఇంటిలో శ్రీరమణ, తపస్వి లతో కలసి వుండి చిత్రకళ గురించి అధ్యయనం చేసారు. ఆ తరువాత హైదరాబాదు చేరి అక్కడ పలు సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. ఎం.ఎన్. రాయ్ అనుచరులతో కలిసి పని చేసారు. వీరు నార్ల, నారిసెట్టి ఇన్నయ్యలతో కలిసి 1970 లలో నెలకొక సాహిత్య సమావేశాన్ని హైదరాబాదులో నడిపారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, కాలమిస్టుగా పది సంవత్సరాలు పత్రికలకు చిత్రకళ, సాహిత్య సాంస్కృతిక అంశాలపై విరివిగా వ్యాసాలూ రాసారు. 1970 లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్న హరిత విప్లవకారుడు నార్మన్ బోర్లాగ్ ను 1983లో ఇంటర్వ్యూ చేసి వారి కృషిని తెలుగు వారికి పరిచయం చేసారు. ఆ తరువాత కోరమండల్ ఫెర్టిలైజర్స్ లో చేరి మేనేజర్ గా రిటైర్ అయ్యారు.

2023 లో శ్రీరమణ, తపస్వి లతో కలిసి 'రసధ్వని' అనే వ్యాసాల సంపుటిని ప్రచురించారు. ఆయన తెనాలి ప్రేమికుడు. 'ఆంధ్రా పారిస్ తెనాలి' అనే గ్రంధాన్ని రచించారు.

వారి మృతదేహాన్ని వారి కుమార్తెలు తమ తండ్రి కోరిక ప్రకారం పటాన్ చెరువులోని టి.ఆర్.ఆర్.వైద్య కలశాలకు అప్పచెప్పారు. స్నేహశీలి, సాహిత్య,కళాప్రియుడు వెంకటరత్నం మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తోంది. ✣

# మైత్రి శ్రీనివాసరాజు



**కాకర్లముడి** శ్రీనివాసరాజు తన 62వ ఏట విజయవాడలో 2025 డిసెంబరు 28న మరణించారు

ఆయన ప్రెస్ కంపోజిటర్‌గా చేరి, విజయవాడలో నవ భారత యువజనసంఘంలో సభ్యునిగా, జనసాహితి కళాకారునిగా కృషి చేసారు. ఆ తరువాత మైత్రి బుక్ హౌస్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. నూతన ప్రజాస్వామ్య విప్లవ సాధనకై జరుగుతున్న కార్యక్రమాలలో పాల్గొన్నారు. అభ్యుదయ విప్లవ సాహిత్య ప్రచారం చేసారు. 2026 జనవరి 7న జరిగిన సంస్మరణ సభలో దివికుమార్, పాండురంగ వరప్రసాద్, వీరబాబు, రంగావజ్జల భరద్వాజ, ఇంద్రవల్లి రమేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తోంది. ✣

స్పందన

# పండుగలు.... సంబరాలు
# కావేవీ దోపిడీకి అనర్హం

అరుణ

**సంతోషాలు,** ఆనందాలు – వాటిని పంచుకునే ఆత్మీయ మానవ సంబంధాల సమష్టి జీవన విధానంలో వెల్లివిరిసిన సందర్భాలను పండుగలుగా జరుపుకుంటాము. వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి వనరుగా జీవించే మనకు పంటలతో, ప్రకృతితో, ఋతువులతో మన జీవితాలకు గల సంబంధాలే పండుగలుగా ప్రారంభమయ్యాయి. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా, రంగు రంగుల పూలను పేర్చి ఆటపాటలతో బతుకమ్మ పండుగను తెలంగాణలో పెద్ద పండుగగా జరుపుకుంటే, పంటలు ఇంటికి వచ్చిన సందర్భంగా వ్యవసాయ పనిముట్లుకు, పశువులకు విలువనిస్తూ, కొత్త పంటల ధాన్యాలతో వంటలు చేసుకుని సంక్రాంతిని పెద్ద పండుగగా ఆంధ్రలో చేసుకుంటారు. సంక్రాంతి పండుగ సమయాల్లోనే పడవల పోటీలు, ఎడ్ల పందేలు, పొట్టేళ్ళ పోటీలు, ఆవులకు అందాల పోటీలు, కోడి పందేలు, ప్రబల తీర్థాలు వంటి వాటిని అందరూ కూడి ఆటవిడుపుగా ఒకప్పుడు నిర్వహించుకునేవారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా పండుగ సంబరాల పేరుతో ప్రభుత్వాలు నిర్వహిస్తున్న తంతులు, ప్రజల జీవితాలతో సంబంధంలేని ఆర్భాటపు వేడుకలుగా ఆచారాలు పేరుతో సాగుతున్నాయి. ఇది ఏ యేటి కాయేడు 'అభివృద్ధి' చెందుతూ భక్తి పేరుతో సాగే జూదగొండి వ్యాపారంగా స్థిరపడిపోతున్నాయి.

సంతోషాలను పంచుకునే వేడుకలైన పండుగలను ఏ విధంగా నిర్వహించుకోవాలో, వేటితో నిర్వహించుకోవాలో అంటూ ఒక క్రమపద్ధతినీ, సమయాన్నీ, సందర్భాలను సృష్టిస్తూ టి.వీ.లు, మీడియా, సోషల్‌మీడియా వంటి ప్రచార సాధనాల ద్వారా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. విభిన్న జాతుల, మతాల, సంస్కృతులు గల మన దేశంలో ఒక మతానికి చెందిన పండుగలకే విలువనిస్తూ, రాష్ట్ర పండుగలుగా ప్రకటిస్తూ లౌకిక రాజ్య భావనని అపహాస్యం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాల నిర్వహణ, నిరుద్యోగం, చుట్టుముట్టిన అభద్రతా పరిస్థితులతో, పెరుగుతున్న అంతరాలతో సతమతమవుతూన్న ప్రజానీకాన్ని ఈ ప్రచారాలు వ్యాప్తి చేస్తూన్న భావజాలం ముంచెత్తుతుంది. నిజ జీవితంలో లేని సాంత్వనకు, పరిష్కారాలకు అలౌకికంగా సమాధాన పరుస్తున్నాయి. వాస్తవ జీవన సంఘర్షణను తప్పుదోవ పట్టిస్తూ పరాయీకరిస్తున్నాయి. రూపాయిని కూడా ప్రజల దగ్గర మిగలనివ్వకుండా పుణ్యం, పురుషార్థాల పేరుతో ఖర్చుపెట్టిస్తున్నాయి.

పండుగలను ఈవెంట్లుగా నిర్వహిస్తూన్న పాలకుల విధానాలకు పరాకాష్టగా ఈ సంవత్సరం జరిగిన సంక్రాంతి పండుగ నిలుస్తుంది. ఉపసభాపతి నుండి ప్రజాప్రతినిధులు, మంత్రులు 'బాధ్యతగా' జూదాన్ని, కోడిపందేలను దగ్గరుండి నిర్వహించారు. జూదం అంటేనే వస్తాయో, రావో తెలియని సొమ్ము కోసం, సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చనే ఆశపెట్టేవారిని నమ్మి తమ దగ్గర వున్న డబ్బులనో, వస్తువులనో, సంపదలనో పందేలకు పెట్టటం. ప్రజలను పూర్తిగా శ్రమ సంస్కృతికి దూరం చేసి ఆశపోతులుగా మార్చి, వ్యసనకారులుగా మిగిల్చే చట్టవిరుద్ధమైన జూదపు క్రీడను, చట్టబద్ధంగా గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష, పరోక్ష సహకారంతో ఈ సంవత్సరం పెద్దఎత్తున నిర్వహించారు. వార్తాపత్రికలలో వచ్చిన సమాచారం ప్రకారమే 1800ల నుండి 2000 కోట్ల రూపాయల మేర కోడిపందేలు, పేకాట, గుండాట, కోతాట, మూడు ముక్కలాట, లోపలా..బయటా, పెద్దబజార్..చిన్నబజార్ వంటి జూదపు క్రీడలు సాగాయి. కోడిపందేల ఆటలో ఒక కోడి మీద 1.56 లక్షల పందెం జరిగిందట.

తెలంగాణ, కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల నుండి వచ్చిన పందెం రాయుళ్ళతో, రాజకీయ, సినీ ప్రముఖులతో బరులన్నీ కళకళలాడిపోయాయి. ఈ సంవత్సరం మహిళలు ఎక్కువగా పాల్గొన్నారు. మహిళలకు ప్రత్యేక బరులను, వారికి సెక్యూరిటీగా మహిళా బౌన్సర్లను కూడా ఏర్పాటు చేశారు. ఆర్థిక అసమానతలకు తగ్గట్టే పందేల బరులు కూడా మూడు రకాలుగా ఏర్పాటు చేశారు. వేలల్లో సాగే పందేలకు ఒక రకమైన బరులు, వేల నుండి లక్ష వరకూ సాగే బరులు, లక్షల పైనే కోట్ల వరకూ సాగే బరులను చాలా క్రమపద్ధతితో పకడ్బందీగా ఈ పోటీలను నిర్వహించారు. లక్షల పైనే పందేలు జరిగే హైటెక్ బరులు అధునాతన హంగులతో అలరారాయి. హైటెక్ టెంట్లు, డిజిటల్ తెరలు, ఏసీలు, క్యాసినో తరహా ఏర్పాట్లు చేశారు. ఈ టెంట్లలోకి వెళ్ళాలంటే రిసెప్షన్‌లో డబ్బులు కట్టినవారికి కాయిన్స్ ఇస్తారు. ఆ కాయిన్స్ చూపిస్తే చేతికి బ్యాండ్లు వేస్తారు. ఆ బ్యాండ్లు ఉన్నవాళ్ళనే

బౌన్సర్లు లోపలికి పంపిస్తారు. బాక్సింగ్ ఆడేవారికి కట్టే స్టేజి వంటి స్టేజీని బరుల మధ్యలో కట్టి, దానిమీద కోడిపందేలు ఆడించారు. ఇక ఈ కోడిపందాల బరులకు చుట్టూ టెంట్‌లు వేసి, వాటిల్లో టేబుళ్ళు వేసి జూద క్రీడల్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు వచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం ప్రతి మూడు గంటలకి బైక్‌కి రూ. 50/-, కారుకి రూ. 100/- వసూలు చేశారు. బైక్‌లు, కార్లతో నిండిన రోడ్లలో ట్రాఫిక్ కష్టాలను పట్టించుకున్నవారే లేరు.

ఇక బరుల్లో మద్యం, బిర్యాని రెట్టింపు రేట్లకు విక్రయించారు. ఆటోల్లో, బండ్లు మీద పెట్టుకుని వచ్చిమరీ అమ్మారు. సంక్రాంతి మూడు రోజుల్లో 438 కోట్ల రూపాయల మద్యాన్ని అమ్మారు. పండుగ వారంలో మొత్తం 877 కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరిగాయట. డిసెంబరు 29 నుండి జనవరి 1 వరకు నూతన సంవత్సరం అనే ఈవెంట్‌కు 4 రోజుల్లోనే 543 కోట్ల రూపాయల మద్యాన్ని అమ్మారంట. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 మొదటి మూడు త్రైమాసికాల్లో 22,983 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగాయట. ప్రభుత్వాలు మద్యం ద్వారా ప్రజల నుండి సంపాదిస్తున్న ఆదాయ వివరాలు ఇవి. ప్రజల శ్రమను ప్రజలకే తెలియకుండా దోపిడీ చేస్తున్న మార్గాలివి.

ఛోటా, మోటా రాజకీయ నాయకుల నుండి ప్రజాప్రతినిధుల వరకూ వ్యూహాత్మకంగా ప్రతి జిల్లాలోనూ పదులు, వందల సంఖ్యలో బరులను నిర్వహించారు. చిన్నబరుల నిర్వాహకులకు పెద్ద నష్టం వస్తే, పెద్ద బరులకు కోట్లలో లాభాలను గడించారు. బరుల ఏర్పాటు సామాగ్రికి, పోలీసులు, నేతలు, అధికారుల ముడుపులకే చిన్న బరుల నిర్వాహకుల పెట్టుబడి సరిపోక అప్పులపాలయ్యారు. 'నిలువు దోపిడీ దేవుడికిచ్చిన ఫలితం దక్కేది, చక్కెర పొంగలి దక్కేది' అని పాడుకున్నట్లుగా చిన్న బరుల నిర్వాహకులు, పందెంరాయుళ్ళు నిలువు దోపిడీకి గురయ్యారు. పెద్ద బరుల్లో మాత్రం గెలిచినవారు 5-10% నిర్వాహకులకు కమీషన్‌గా ఇచ్చారు. అంతేకాక వరుస పందేలు గెలిచిన పందెం రాయుళ్ళకు కార్లు, బుల్లెట్ బైకులు, స్కూటీలను బహుమతులుగా ఇచ్చారు.

పెద్ద బరుల్లో గెలుపు, ఓటములకూ, చిన్న బరులలో గెలుపు ఓటములకూ మధ్య గల ఆర్థిక, సామాజిక అంతరాలు ఈ పందేల సమయంలో స్పష్టంగా కన్పించాయి. చిన్న బరుల్లో గెలిచినవారు ఓడినవారి మధ్య జరిగిన గొడవలు, కులం, మతం, ప్రాంతం, రాజకీయాల ప్రమేయంతో తీవ్రమైన వైషమ్యాలను కల్పించాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు గొడవపడి, కొట్టుకొని గాయాల పాలయ్యారు. జూదం డబ్బులు దొంగిలించారనే నెపంతో కృష్ణాజిల్లాలోని ఉప్పులూరు బరిలో దుస్తులు వూడదీసి, తాళ్ళతో కట్టేసి 11 మందిపైన అమానవీయంగా దాడి చేశారు. రక్షణ వ్యవస్థ, రక్షకభటులు (పోలీసులు) పాలకవర్గాల సేవలో తేలియాడుతూ ఈ జూదాల బరులవైపే తొంగి చూడలేదు. కేసులూ నమోదు చేసుకోలేదు. నమోదైన కేసుల్లో కూడా కోడిపందేల ఘర్షణలలో కాదన్నట్లుగా కేసులు నమోదు చేశారు. ఇంత పకడ్బందీగా జూదం ఆటలను పాలకవర్గ ప్రతినిధులు నిర్వహించారు.

అప్రజాస్వామికంగా, చట్ట వ్యతిరేకంగా పాలనాధిపతులు పండుగల పేరుతో జూదక్రీడల్ని నిర్వహించటం చూస్తుంటే ప్రజలని ప్రేక్షకులుగా, అనుసరించేవారిగా, వారి ఆటల్లో పావులుగా చేసే విషసంస్కృతి ప్రమాదం ముంచెత్తుతోంది. ప్రజల జీవితాల్లోని సమష్టి సంతోషాలను కూడా దోచుకుంటున్న పాలకుల విధానాలను తిప్పికొట్టాలి. ప్రజలలో సహజంగా వుండే సమష్టితత్వాన్ని, శ్రమ జీవన తత్వాన్ని విచ్ఛిన్నం చేస్తూన్న ఇటువంటి విషసంస్కృతులను ప్రజాచైతన్య కాంతుల భోగి మంటలలో తగలబెట్టాలి.

## శతకోటీశ్వరుల మానవీయ ముసుగు!

**2025** నవంబర్ నెలలో జి20 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా విడుదల చేసిన నివేదిక పెరుగుతున్న అంతరాలను తెలియచేసింది. 90 శాతం జనాభా నివశిస్తూన్న 83 దేశాలలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని వెల్లడించింది. 1980 నుండి 2024 నాటికి అనేక దేశాలు ప్రజావసరులను కోల్పోవటమేగాక, తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయాయని ఆ నివేదికలో తెలియచేశారు. అదే కాలంలో ప్రైవేటు సంపద 80 ట్రిలియన్ డాలర్ల నుంచి 500 ట్రిలియన్ డాలర్లకు పెరిగిందని, ఈ దేశాలన్నింటా పెట్టుబడిదారులు సహస్ర కోటీశ్వరులుగా అవతరించారని కూడా లెక్కలతో సహా ఋజువు చేసింది. మన దేశము ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. దేశంలోని 40 శాతం సంపద ఒక్క శాతంగా వున్న ఆదానీ, అంబానీల వంటి కుబేరుల దగ్గరే పోగుబడుతోంది.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రపంచ శతకోటీశ్వరులందరూ వివిధ దేశాధినేతలకు పెరుగుతున్న ఆర్థిక అసమానతల నేపథ్యంలో తమపై సంపద పన్ను మరింతగా విధించాలని కోరుతూ లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో 24 దేశాలకు చెందిన 400 మంది సంతకాలు పెట్టారు. ప్రపంచంలోని సహజవనరుల్నీ, శ్రమ సంపదలను దోచుకుపోతూన్న ఈ శతకోటీశ్వరులు పాలకులు తమ పట్ల చూపుతున్న విపరీతమైన పక్షపాతం ప్రజలను రెచ్చగొడుతుందన్న భయంతో ఈ మానవీయ ముఖాన్ని తొడుగుకుంటున్నారు.

# మూలవాసివాద కావ్యం "కట్టెలమోపు"

గుత్తా హరిసర్వోత్తమ నాయుడు

**వలసాధిపత్యాన్ని** ఎదుర్కోవడం
మన యుద్ధ నీతి
అదే మూలవాసులు
మనకందిస్తున్న సజీవ సంస్కృతి
దేశీయతే జాతి అంతస్సారం ('కట్టెలమోపు', పు. 221)

'కట్టెలమోపు' కావ్యాన్ని రాసిన కత్తి పద్మారావు కవి, విమర్శకుడు, చరిత్రకారుడు, తత్వవేత్త, గొప్ప వక్త. హేతువాది, అంబేద్కరిస్టు, దళిత బహుజనవాది. కారంచేడు, చుండూరు సంఘటనల తర్వాత ఆయన దళిత మహాసభ స్థాపించి దళితోద్యమకారుడయ్యారు. ఆయన కవిత్వం నిండా మనిషి వాసన వస్తుంది. ఆ మనిషి శ్రామికుడు. దళితులు, గిరిజనులు ఆయన గుండెల్లో ఉంటారు.




పద్మారావు కావ్యాలలో "కట్టెలమోపు" ఒకటి. ఈ కావ్యంలో 83 కవితలున్నాయి. వీటిని 27.12.2004 - 06.08.2006 మధ్య 20 నెలల్లో రాశారు. ఈ కావ్యం 2007లో ప్రచురితమైంది.

వలసాధిపత్యం అనే మాటను సాధారణంగా పాశ్చాత్యులకు ఉపయోగిస్తుంటాం. కానీ మూలవాసి సిద్ధాంతవేత్త అయిన కత్తి పద్మారావు ఆర్యుల రాకను వలసగా భావించారు. ఆర్యులు బయటినుంచి భారతదేశంలోకి ప్రవేశించి, అక్కడ మొదటి నుంచి నివసిస్తున్న ప్రజలను స్వాధీనం చేసుకుని వాళ్లపైన పై చేయి సాధించి, మూలవాసుల మీద వారి భావజాలాన్ని రుద్దడాన్ని ఆయన వలసాధిపత్యం అంటున్నారు. భారతదేశ ప్రాచీన వర్తమాన చారిత్రక పరిణామాలు తెలిసుంటేనే ఆయన కవిత్వం జీర్ణమౌతుంది. ఆర్యులతో మూలవాసులు చేసిన పోరాటాన్ని ఆయన యుద్ధనీతి అన్నారు. ఇప్పుడు కూడా మనదేశంలో ఆర్యసంస్కృతి ఆధిపత్యమే కొనసాగుతున్నదని, దాని మీద తిరగబడవలసినదేనని ఇందుకు మనకు మూలవాసులు పోరాటం ఆధారంగా ఉందని ఆయన చెబుతున్నారు. ఆయన కవితలలో ప్రకృతి పుష్కలంగా ప్రస్తావనకు వస్తుంది. అది కేవలం ప్రకృతి వర్ణన కాదు. మూలవాసులు ప్రకృతి మధ్యలో సహజంగా జీవించిన చరిత్రను అది గుర్తుచేస్తుంది. పద్మారావుకు శ్రామికవర్గ, మూలవాసి మహిళలు అంటే ఎనలేని గౌరవం. ఆయన ప్రతి స్త్రీలోనూ అమ్మతనాన్ని చూస్తారు. ఆ కవితలు చదువుతున్నప్పుడు మనకు స్త్రీల పట్ల గౌరవం పెరుగుతుంది. ఆయన మూలవాసి మహిళా పక్షపాతంతో అందాల పోటీలను తులనాత్మకంగా పోల్చి ప్రశ్నించారు.

"మీరు అన్ని తూకాలు తూసి
మిస్ యూనివర్సుల్ని తయారు చేస్తున్నారు
ఆ కోయ స్త్రీ ఆ సన్నని ఏరులో నుండి నడచి
కొండ గుట్ట మీద నిలబడి ఉంది
ప్రకృతి సౌందర్యానికి
మీ దగ్గర కొలతలు ఉన్నాయంటారా?"
(పు. 115)

మూలవాసి మహిళలు గాజు బొమ్మల్లాంటివారు కాదు. వాళ్లు పోరాట వనితలు. ప్రకృతిలో జీవిస్తూ, ప్రకృతితో స్నేహం చేస్తూ, అనివార్యమైతే పోరాటం చేస్తూ జీవనం సాగిస్తారు. పద్మారావు వారిని గురించి ఇలా రాశారు.

"యుగాలు గడిచినా
ఆమెది యుద్ధ జీవితం
ఆమె కోయా, గదబా అని కాదు
ఆమె చంకలో ఉన్న పిల్లవాడికి
ఆమె నేర్పింది ఒక్క మాటే
ఈ నేల నీది, ఈ అడవి నీది
ఈ దేశం నీది అని" (పు. 131)

బహుళజాతి కంపెనీలు వచ్చి అడవుల్ని ఆక్రమించుకొని, మూలవాసులను వాళ్ల నివాస ప్రాంతాల నుండి క్రూరంగా తరిమేసే దుర్మార్గం మీద పద్మారావు నిరసన తెలుపుతూనే ఉన్నారు. మూలవాసులంటే నీడపాటున కూర్చుని, గాలి పోగుచేసి కట్టుకథలు చెప్పి బతికిపోయే పరాన్న భుక్కులు కాదు. సోమరిపోతులు కాదు. వాళ్లు శ్రామికులు. వాళ్లది సహజ జానపద జీవితం. వాళ్ల జీవితమే కవిత్వం అంటారు పద్మారావు.

"అవును
ఆమె కవిత్వమే చెబుతుంది
ఆ కట్టెలమోపు వెనకున్న శ్రమ
ఆ కాళ్ళ మట్టెల మోతలో ఉన్న ధ్వని
ఆ చెమట బిందువుల్లో ఉన్న శ్రమ
ఆమెను కవయిత్రిని చేశాయి
అందుకే ఆమె కవిత్వం వసివాడదు" (పు. 133)

పద్మారావుది ద్రావిడ సిద్ధాంతం. ఆర్య వ్యతిరేక వాదం. ఆర్యుల దౌర్జన్య నాగరికతను అవకాశం వచ్చినప్పుడంతా ఆయన విమర్శించారు. చరిత్రలో, పురాణాలలో ఆయన ఆర్య నాగరికత దౌర్జన్యాన్ని దర్శించారు. వర్తమాన కాలంలో సంపన్నుల కంపెనీలకు మూలవాసుల నివాస ప్రాంతాలను పాలకులు అప్పజెప్పుతూ, మూలవాసులకు పునరావాసం కల్పించే ప్రహసనాన్ని గతం నుండి జరుగుతున్న దుర్మార్గంగా పద్మారావు వర్ణించారు.

"అవును వారి అశ్వమేధ యాగంలో భాగంగా
మన గూడేల్ని లేపి నగరం శివార్లలో
మురుగు కాల్వల్ల ప్రక్కన
తగరం డేరాలు నిర్మిస్తామంటున్నారు
ఆర్య పాలకుల వారసులు
నేలబిడ్డల గుండెలపై గజతురంగాలతో
దాడులు చేస్తూనే ఉన్నారు కదూ!" (పు. 136)

ప్రపంచవ్యాప్తంగా సంపద కొంతమంది చేతుల్లోకి వెళ్లినప్పుడే వర్గ సమాజం ఏర్పడింది. మూలవాసుల స్థానంలోకి ఆర్యులు వచ్చి చేరడంతోనే భారతదేశంలో వర్గ సమాజం ఏర్పడింది. అప్పటినుంచి మనదేశంలో రెండు వర్గాలు రెండు సమాజాలుగా ఏర్పడ్డాయి. ఆ రెండింటి మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతున్నది అని పద్మారావు రెండు వర్గాల ప్రపంచం పట్ల తనకున్న అవగాహనతో వాటి మధ్య వైరుధ్యాలను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నారు.

"వాళ్ల పిల్లలు విమానాల్లో
మా పిల్లలు క్వారీల్లో" (పు. 93)

ప్రపంచీకరణ వచ్చి భూముల నుండి రైతులను దూరం చేసింది. వ్యవసాయం ధ్వంసమైంది. వ్యవసాయాన్ని ఆవరించిన వృత్తుల వాళ్ళు దిక్కులేని వాళ్ళయ్యారు. వ్యవసాయాన్ని నమ్ముకుని బతికే కూలీలు అనాధలయ్యారు. అయితే ప్రపంచీకరణ విధ్వంస సమయంలో మేధావులు రైతుల బాధలను ఎక్కువగా ప్రస్తావించడాన్ని పద్మారావు ప్రశ్నించారు. వ్యవసాయం అంటే రైతులదే కాదని, రైతుకూలీలది, వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తూన్న అన్ని వృత్తులవారిదని కూడా అని ఆయన వివరించారు.

"కాడి, నాగలి అన్నీ విరిగి కూలుతున్నాయి
నిజమే
వాటితో పాటు ఉప్పరి తట్ట
చిరిగిన సంగతి ఏమిటి?
కుమ్మరి సారే విరిగిన సంగతి ఏమిటి?
సాలెల మగ్గం కూలిన సంగతి ఏమిటి?.....
భూములు ఉన్నోళ్లు కష్టాలకు పతాక శీర్షికలా!
చీకటి గుహల్లో ఉన్నవాడికి
అక్షరాల్లో చోటు లేదా!
అసలు జీవితమే లేని వాళ్ళ గురించి
మాట్లాడేది ఎవరు?" (పు. 217)అని ఆయన ప్రశ్నించారు.

అంబేద్కర్ చూపుడువేలు" (పు. 199) ఆయన కవిత్వంలో తరచుగా ప్రస్తావనకు వస్తూంటుంది.

"కట్టెలమోపు" కావ్యంలో జీవితాన్ని గురించి చాలాసార్లు పద్మారావు మాట్లాడారు. ఆయన అభిప్రాయంలో వ్యక్తి జీవితమంటే సామాజిక జీవితమే.

"నీవు జీవిస్తున్నావంటే అర్థం
ప్రపంచాన్ని జీవింపజేస్తున్నావనే" (పు. 18)

ఆయన దృష్టిలో జీవించడమంటే శ్రమించడమే. సోమరులు ఆయనకు జీవిస్తున్నవారు కాదు. ఆయన జీవిత దృక్పథమే విభిన్నంగా ఉంటుంది.

"కవిత్వం జీవిస్తున్న వారే వ్రాయగలరు
జీవితమంటే
భూమిని చీల్చగలిగిన వారిదే" (పు. 134)

పద్మారావుది శ్రామిక భారతదేశ నిర్మాణ స్వప్నం. అందుకే ఆయన భౌతికవాది అయ్యారు. భావవాదులది ఆయన దృష్టిలో జీవితం కాదు.

"జీవించడమంటే
నదీ ప్రవాహంలా పొంగడం కాదా"! (పు. 175)

జీవితమంటే సమూహ స్వభావం కలిగి ఉండడం. ఏకాకితనం, ఏకాంత వాసం జీవితం కాదన్నది ఆయన అభిప్రాయం. జీవితమంటే స్తబ్దత కాదు, చలనం. చలనం అంటే క్రియాశీలపరత్వం. అది గుంపులో ఉంటుంది. అంటులో ఉండదు.

"జీవితం ఒక చింతన, ఒక సంఘర్షణ
అది నిస్తబ్ధ కుహరం కాదు
వ్యక్తావ్యక్త సంభాషణ కాదు
ఆవేదనతో కూడిన అభివ్యక్తి" (పు. 205)

జీవితం పట్ల వైరాగ్యాన్ని కలిగించే భావ ప్రచారాన్ని పద్మారావు ఆమోదించరు.

“ప్రకృతిలో అంతస్సంబంధిత అంశాలన్నీ
నిరంతరం పరస్పరం
ప్రతిస్పందిత మౌతూనే ఉన్నాయి.
మనుషులు మాత్రం రాను రాను
శిలా సదృశం అవుతున్నారు” (పు. 154)

అన్నది కవి ఆవేదన. ప్రపంచీకరణ మనుషులను శకలాలు శకలాలుగా చేస్తున్నది. దీనినే “పోస్ట్ మోడర్నిజం” అని కొందరు ప్రచారం చేస్తున్నారు. మూలవాసి తత్త్వం శకలవాదాన్ని తిరస్కరిస్తుంది.

“ప్రపంచం దగ్గరవ్వాలని కొందరు కోరుకుంటున్నారు
నేను మనుషులు దగ్గరవ్వాలని ఆశిస్తున్నాను
మనుషుల్లేని ప్రపంచం నాకక్కరలేదు
నేను మనిషి వేపు ప్రయాణిస్తున్నాను” (పు. 168)

ప్రజాతంత్రవాది అయిన పద్మారావుకి పాలక పాలిత దృష్టి ఉండడం సహజం. చరిత్రను నిర్మించేది ప్రజలే నన్నది ఆయన అవగాహన.

“చరిత్రను నిర్మించాల్సింది ప్రజలే గాని పాలకులు కాదు” (పు. 16)

పద్మారావు కవిత్వం వాస్తవికత, తాత్త్వికతల కలనేత. మానవ, మానవీయ వాదాల మడత. మూలవాసి వాద పరిమళం. అంబేద్కర్ మూల సూత్రాల వ్యాఖ్యానం. ✣

కవిత

# నువ్వొక సమూహం!

**- బొల్లిముంత వీరయ్య**

ఎందుకున్నవ్ బిడ్డా...ఒక్కడివే.
ఏం చేస్తున్నవ్...చిరుతా.
మంచు బిందువులు రాలేచోట...
నిండుగ పొగమంచు కమ్మిన చోట...
గడ్డకట్టిన గాలి కదలని చోట...
ఏం చూస్తున్నవ్.

రాముళ్లందరు దేవుళ్లయిరి...
లక్ష్మణులంతా సేవకులైరి...
జుదరులంతా ధర్మజులైరి...
దోపిడిదారులు సూత్రధారులైరి...
పాలకులంతా కీలుబొమ్మలైరి.

ఎందుకు నీకీ ఎదురుచూపులు?
ఎవరికోసమీ కాలయాపన?
బిడ్డా...
ఒక్కడివే అని న్యూనత చెందకు.
అవునక్కడ వున్నది నిజం కాకపోయినా
మీడియా వాళ్లది...పేపరు వాళ్లది
భారతదేశం వెలుగుతోందని ఊదరగొడ్తరు.
వెలుగుతున్నదా...చీకటిలో మగ్గుతున్నదా
ఇంద్రియాలు పనిచేస్తున్నోళ్లకు
చూడచక్కగా అర్థమౌతుంటది.

ఏది మోసమో...ఏది దోసమో లోకం పోకడ
తెలియక నీవు కలత పడొద్దు
నిజం ఎప్పుడూ జనం గుండెల్లో
నిలిచే వుంటది.
లావా దట్టిన నిప్పుకొండవలె
నివురు వుంటది.
సమతావాదిగ పుట్టావు.
సమరసముతోనే బ్రతికావు.
భావము తప్పక నడిచేవు.
ఓటములెన్నెదురైనా...
గెలుపుకోస మెదురొడ్డావు.
మాటలు రాక మూగబోలేదు...
మాటలు లేక మౌనం దాల్చలేదు.
ఆలోచన్లు ఆకాశమంతైతే...
నేర్చిన పాఠాలు భూగోళమంత.
ఎండలల్ల...వానలల్ల...శీతల గాలులల్ల
మెరుపులల్ల...పిడుగులల్ల
తుఫానులల్ల...ఉప్పెనలల్ల...
నిలబడినావు నిండుకొండవలె.

గతం నుంచి.... తరాల నుంచి....
ఆదరణ నుంచి...ఘాతము నుంచి...
వేయి పడగల వేదన నుంచి...
ఎప్పుడూ చదివే పాఠాల నుంచి...
రాసే పాడే రాగాల నుంచి
ప్రేమల నుంచి...ప్రేమానురాగాల నుంచి
ఎన్నో పర్వాల విశేషణం ఈ నీ జీవితం.
ఎదుగుతున్నవా...ఎదిగే వున్నవా...
నీకు నీవే దారి చూపుకో...
సూర్యుడు నీకు దారి చూపుతడు.
చుక్కలు నీకు వెలుగునిస్తయి.
నువు ముందుకు సాగితే చాలు...
నీ వెనక వస్తరు.
నీ సోదరులంతా కాచుకున్నరు.
వేలు లక్షలు కోట్లమంది..
నీడ జాడలై కదలి వస్తరు.

కాలానికే ఎంత కష్టంగున్నది.
కాలం ఎప్పుడూ ఎవరిదీ కాదు.
కాలం ఎప్పుడూ ప్రగతి పథానిదే.

బండలన్నీ దుమ్మయి పోతయి.
కొండలన్నీ పిండయి పోతయ్.
నీరదులన్నీ నీరయిపోతే...
ప్రకృతి అంతా స్వాగతమంటది.
కాలిక్రింది మట్టి కదిలి పోతుంటే...
గుండెలోని ఆయుధం చేతిలొకొస్తది.

ఓ బిడ్డా...
బిడ్డవు కాదు నువ్విపుడు...
చైతన్యఝరివై కదులు ముందుకు...
సారంగధరివై దూసుకెల్లు ముందుకు.
నువ్వనేది నువ్వొక్కడివే కాదిపుడు.
నువ్వొక సమూహమని
ఎప్పుడూ గుర్తుంచుకో. ✣

# దేశ విభజన నేపథ్యంలో సినిమాలు, నాటకాలు-5

కొత్తపల్లి రవిబాబు

## గదర్: ఏక్ ప్రేమ్ కథా (విప్లవం : ఒక ప్రేమ కథ) - - హిందీ (2001)

బూటాసింగ్ అని బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో పనిచేసిన ఒక మాజీ సైనికుడి వాస్తవ జీవితంపై ఆధారపడి దర్శకుడు అనిల్ శర్మ,ఈ చిత్రాన్ని తీశారు. సన్నీ డియోల్, అనూషా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. పాటలు ఆనంద్ బక్షీ రాశారు. ఇది 15 జూన్ 2001లో విడుదలైనపుడు ముంబాయి, అహమదాబాదు,భోపాల్ లో మతాంతర వివాహాలకు వ్యతిరేకంగా హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. సిక్కులు, ముస్లిములు నిరసన ప్రదర్శనలు చేశారు.

అమృతసర్‌లో తారాసింగ్ అనే ట్రక్కు డ్రైవరు కాలేజీకి సరుకులు చేరవేస్తుండేవాడు. అతను గాయకుడు కూడా. కాలేజీలో జరిగే పోటీలు గమనిస్తూ వుండేవాడు. ఆ విధంగా అతనికి కాలేజీలో చదువుతున్న ఒక సంపన్న కుటుంబానికి చెందిన సకీనా పరిచయమై ప్రేమగా మారుతుంది. సకీనా తండ్రి అష్రాఫ్ ఆ వూరిలో ప్రసిద్ధ వ్యాపారి. అతను శరణార్థిగా తన కుటుంబసమేతంగా లాహోర్ వెళ్ళే ఆఖరు ట్రైన్ అందుకోడానికి అమృతసర్ స్టేషన్‌కు వెళ్తాడు. రైల్వేస్టేషన్లో జరిగిన దాడి, అల్లర్లలో అష్రాఫ్ కుటుంబ సభ్యులందరూ ట్రైన్ ఎక్కుతారు కానీ, సకీనా ఎక్కలేకపోతుంది. రక్తమోడుతున్న శవాల మధ్య ఒంటరిగా వున్న సకీనాపై ఒక గుంపు దాడి చేస్తే తారాసింగ్ ఆమెను వెంటాడుతున్న గుంపునుంచి రక్షిస్తాడు. తారా సింగ్ కూడా అల్లర్ల ప్రారంభంలో ముస్లిములను చంపినవాడే. సకీనాను తన ఇంటికి తీసుకువెళ్లి మతం మార్చి ఆమె నుదుటన రక్తతిలకం దిద్ది ఆమెను వివాహం చేసుకుంటాడు. అలా ఐదేళ్లు గడిచాయి. వారి కొడుకు చరణజీత్. జీతా అని పిలుస్తుంటారు. వారు సంతోషంగా జీవిస్తూ వుంటే ఒకరోజు ఒక చిత్తు కాగితంలో సకీనా తన తండ్రి అష్రాఫ్ ఫోటో చూస్తుంది. అల్లర్లలో కనబడకుండా పోయిన తండ్రిని చంపేసి వుంటారని ఇన్నాళ్ళు అనుకొంది. ఇప్పుడు తన తండ్రి లాహోర్ మేయర్‌గా వున్నదని తెలుసుకుంటుంది. సకీనా విషయం తెలుసుకున్న తండ్రి అష్రాఫ్ ఆమె లాహోర్ కు వచ్చేట్లు డిల్లీ లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం వారి ద్వారా ఏర్పాట్లు చేయగా తారాకు, జీతాకు వీసా రాకపోవడంతో తన తండ్రిని కలవడానికి సకీనా ఒంటరిగా లాహోర్ వెళ్తుంది. అక్కడ తండ్రి ఆమెకు బలవంతంగా వేరే పెళ్లి చేసే ఏర్పాట్లలో వుంటాడు. అనుకున్న సమయానికి సకీనా తిరిగిరాకపోవడంతో తారా, అతని కొడుకు జీతా దాల్మియాన్ అనే మిత్రుడి సహకారంతో రహస్యంగా సరిహద్దులు దాటి లాహోర్‌కు వస్తారు. రకరకాల చర్చల తర్వాత అష్రాఫ్ తారాసింగ్‌ను అల్లుడిగా అంగీకరించాలంటే కొన్ని షరతులు పాటించాలంటాడు. అవేమిటంటే 1. మతం మార్చుకోవాలి, 2. పాకిస్తాన్ సైన్యంలో చేరి ఇండియన్స్‌తో యుద్ధం చేయాలి, 3. పేరు ముస్లిం పేరుగా మార్చుకోవాలి, 4. 'పాకిస్తాన్ జిందాబాద్', 'ఇండియా ముర్దాబాద్' అనే నినాదాలు గొంతెత్తి ఇవ్వాలి. ఈ షరతులకు తారాసింగ్ అంగీకరిస్తాడు.కానీ అష్రాఫ్ నియమించిన ఒక హంతకుల బృందం తారాసింగ్‌ను అవమానిస్తుంది. దానితో ఆగ్రహం చెందిన తారాసింగ్ ఆ కిరాయి బృందాన్ని హతమారుస్తాడు. ఒక స్నేహితుని సహాయంతో తారా, సకీనా, జీతా తప్పించుకుని సరిహద్దు వద్ద ఒక కుటీరంలో రక్షణ పొందుతారు. ఆ కుటీరం యజమాని అత్యాశతో అష్రాఫ్ కు వీరు ఇక్కడున్న విషయం తెలియచేస్తుంది. వారు ఇండియా వెళ్ళే ట్రైన్ ఎక్కుతుండగా అష్రాఫ్ వారిని అడ్డుకుంటాడు. ఆ సంఘర్షణలో జరిగిన కాల్పులలో సకీనా గాయపడి కోమాలోకి వెళ్తుంది. బాగుపడిన తర్వాత తారా జీతాలను కలుస్తుంది. అష్రాఫ్ కూడా వారి వివాహాన్ని అంగీకరించి తారాసింగ్ ను తన అల్లుడిగా ప్రకటిస్తాడు. తారాసింగ్ కుటుంబం ఇండియాలో స్థిరపడుతుంది.

## 'హోమ్ 1947'

ఈ పేరుతో శర్మీన్ ఒబైదీ షినాయ్ ఒక ప్రదర్శన తయారుచేశారు. దానిలో ఎందరివో వలస బతుకులూ, వారు వారి వారి స్వస్థలాలనుండి విస్తాపనకు గురి కావడం మొదలగు విషయాలతో తయారైన 7 లఘు చిత్రాలు వుంచారు. ఆనాటి సంక్లిష్టమైన చారిత్రకకాలం నాటి సంఘటనలపై వ్యక్తిగత దృక్పథాలు సేకరించి పెట్టారు. గత కాలపు జీవితాల దృశ్యాలు, శబ్దాలు, వాసనలు అక్కడ సందర్శకులు అనుభవిస్తారు. ఈ ప్రదర్శనలో నూరేళ్ళ నాటి పాత ఇల్లు కూడా చూడగలం.దీని రూప కల్పనకు మాంచెస్టర్ అంతర్జాతీయ ఫెస్టివల్, ది బ్రిటీష్ కౌన్సిల్, సూపర్ న్యూ వే సంస్థలు సహాయం చేశాయి. 2017లో ఈ ప్రదర్శన ముంబాయి, లాహోర్, కరాచీ మొదలగు

ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. దీనిలోని మూడో లఘు చిత్రం పేరు 'జమీన్'(భూమి). దీనికే మరో పేరు 'లాఖో మే ఏక్'. దీని రచయిత జియా సర్హాది. తండ్రి మత ఘర్షణలో తప్పిపోగా ఒక హిందూ బాలిక పాకిస్తాన్లోనే పెరుగుతుంది. ఆమెకు, ఒక ముస్లిం బాలుడికి మధ్య జరిగిన ప్రేమకథ ఇది. తరువాత కొన్నేళ్లకు తండ్రి తిరిగివస్తాడు. ఆయన వీరి వివాహానికి ఒప్పుకోడు. దాని ఫలితంగా వచ్చిన పరిణామాలు దీనిలో చిత్రించారు. 1965లో ఇండియా– పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధం తర్వాత రాసిన రచన ఇది. దీనిలో వాడిన నూర్జహాన్ పాడిన భజన 'మన్ మందిర్ కా దేవతా' అనే భజన వివాదాస్పదం అయింది. ప్రజాదరణ పొందిన ఈ పాటను పాకిస్తాన్ రేడియోలో నిషేధించారు. ఈ రచయిత పాకిస్తాన్కు వలస వెళ్ళే ముందు సామాజిక వాస్తవికత ప్రతిబింబించే 'హమ్ లోగ్', 'ఫుట్ పాత్' చిత్రాలు తీశారు.

### 'కౌన్ హై యే గుస్తాఖ్?' ('ఎవరు తిరుగుబాటుదారుడు?') నాటకం :

మంటో జీవితం ఆధారంగా మంటో శతజయంతి సందర్భంగా మదీహా గౌహర్ దర్శకునిగా, షహీద్ నదీం సంభాషణలతో రూపొందిన ఈ నాటకాన్ని లాహోర్ అజోక థియేటర్ అనే నాటకసంస్థ వారు విర్సా విహార్ లో ప్రదర్శించారు.

దీనిలో మధ్యతరగతి సంపన్నులు తమ గ్రామాలు ఆస్తులు వదలి వెళ్లాల్సిన పరిస్థితులు, వారిలో నిరాశ, నిస్పృహ, భయం.... ఒక ముస్లిం నాయకుడు హిందువులు వలస వెళ్లడాన్ని వ్యతిరేకిస్తాడు. మరొకడు వారిని ఎలా పంపించాలో కుట్రలు చేస్తాడు.

తులసి లాహిరి రాసిన నాటకం 'Banglar Mati'లో తూర్పు పాకిస్తాన్ నుండి సామూహికంగా హిందువుల వలస పోవడం కథా వస్తువు.

రిత్విక్ ఘటక్ రాసి ప్రదర్శించిన 'Dalil' ('Deed')లో కలకత్తాలో బౌబజార్ ప్రాంతం నుంచి స్త్రీలు చేస్తున్న మౌన ప్రదర్శనపై విచక్షణా రహితంగా పోలీసు కాల్పులు జరపగా ముగ్గురు మహిళలు లోతిక, ప్రతిభ, అమిలాల మృతిని చిత్రిస్తుంది.

సలీల్ సేన్ నాటకం 'Nutan Yehudi' ('The New Jews')లో తూర్పు బెంగాల్ ప్రజలు ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులు చిత్రించారు. తూర్పు బెంగాల్ లోని అమాయక ప్రజలను యూదులతో పోల్చారు. 1951లో మొదటి ప్రదర్శన జరిగింది. 1957లో పుస్తక రూపంలో వెలువడింది.

## నవలా చిత్రాలు

దేశ విభజన కథావస్తువుగా రాసిన నవలలు కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. కుశ్వంత్ సింగ్ రాసిన 'ట్రైన్ టు పాకిస్తాన్' (1998)లో, బాప్సీ సిద్వా రాసిన 'క్రాకింగ్ ఇండియా' నవలను '1947 ఎర్త్' పేరుతో 1998లో, అమృతా ప్రీతం నవల అదే పేరుతో 'పింజార్' 2003లో, భీష్మ సాహ్నీ 'తమస్' నవల అదే పేరుతో టీవీ సీరియల్గా 1987లో, సాల్మన్ రుష్దీ నవల ఆధారంగా 'మిడ్ నైట్ చిల్డ్రన్' 2012లో విడుదల అయ్యాయి. నవలలుగా వీటిని పరిచయం చేస్తున్నాము గనుక సినిమాలుగా వీటి గురించి రాయడం లేదు.

### లాహోర్ (1949)

1947 నాటికి ఇండియాలో సినిమా పరిశ్రమ కేంద్రాలుగా ముంబాయి, పూనా, కలకత్తా, మద్రాసు వున్నాయి. పాకిస్తాన్లో ఒక్క లాహోర్లో మాత్రమే సినిమా నిర్మాణం జరిగేది. లాహోర్లో వున్న రెండు ఫిల్మ్ స్టూడియోలు హిందూ యజమానులవే. మత ఘర్షణల్లో వాటిని నేలమట్టం చేశారు. మంటో లాంటి రచయితలు, నటులు కొందరు పాకిస్తాన్కు వలస వెళ్ళినా ముస్లిములలో సినిమా పరిశ్రమకు చెందిన అత్యధికులు ఇండియాలోనే వుండి పోయారు. పాకిస్తాన్ లో దేశ విభజనపై వచ్చిన తొలి చిత్రం 'లాహోర్'.

### దేశ విభజనపై పృథ్వీరాజ్ కపూర్వి నాలుగు నాటకాలు

దేశ విభజన జరగడానికి ముందే మత సహనం వస్తువుగా ప్రముఖ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ కపూర్ నాలుగు నాటకాలు తయారు చేసి ప్రదర్శించారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం వారూ, ముస్లిమ్ లీగు వారూ వీటిని వ్యతిరేకించారు. 1945 ఆగస్టులో అంటే విభజనకు ఇంకా రెండు వేసవుల ముందే పృథ్వీరాజ్ కపూర్ 'దీవార్' అనే నాటకం ప్రదర్శించారు. దీవార్ అంటే గోడ అనే అర్థం. ఈ నాటకంలో హిందీ, ఉర్దూ కలిసిన హిందూస్తానీ భాషను వాడారు. సంభాషణలను పృథ్వీతో కలిసి ఇందిరారాజ్ ఆనంద్ రాశారు. దీనిలో పృథ్వీరాజ్తో పాటు ఆయన ముగ్గురు కొడుకులూ రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ లు నటించారు. విదేశీ స్త్రీగా దమయంతి సాహ్నీ, జోహ్రా సెహగల్ నటించారు. నటుల సంభాషణలలో సమకాలీన రాజకీయ, సామాజిక సమస్యలపై గాంధీ, జిన్నాలు చేసిన వుపన్యాసాలలోని వ్యాఖ్యలు వుంటాయి. ఒక సోదరుని ఆహార్యం జిన్నాను పోలి వుంటుంది.

ఒక విదేశీ స్త్రీ ఒక సంపన్న కుటుంబాన్ని తన కుయుక్తులతో చీల్చి వేస్తుంది. రమేశ్, సురేశ్ అన్నదమ్ములు. ఉమ్మడి జమిందారీ కుటుంబంలో రమేశ్, సురేశ్ అన్నదమ్ములు. ఒక దీపావళి అమావాస్య రోజున అలసిపోయిన ఇద్దరు విదేశీ దంపతులు ఆరోజు రాత్రికి మాత్రం ఆశ్రయం కోసం వీరి ఇంటికి వస్తారు. ఆ తరువాత అక్కడే తిష్ట వేసి వారితో కలిసి వుండి వారి ఉమ్మడి కుటుంబాన్ని చీలుస్తారు. రమేశ్, సురేశ్లు తమ ఇంటిని రెండు భాగాలు చేసి మధ్యలో గోడ కట్టుకునే పరిస్థితిని సృష్టిస్తారు. ఆ జమీలో విద్య పేరుతో తాము సాంస్కృతిక ఆధిపత్యం సాధిస్తారు. వీరి జమీలోని సంపదను విదేశాలకు

తరలిస్తారు. దానికి బదులుగా అక్కడినుంచి ఆధునిక యంత్రాలను తెప్పిస్తారు. వారి భూములను తమ అదుపులోకి తెచ్చుకుంటారు. చివర్లో ఈ దంపతుల కుట్రను గ్రహించిన ఆ కుటుంబం వారూ, ప్రజలూ ఆ గోడను పగులగొట్టి మరలా ఏకమౌతారు. ప్రదర్శన చివర్లో పృథ్వీ రాజ్ ఆ గోడను పగులగొట్టాల్సిన అవసరాన్ని వివరిస్తూ భావోద్వేగమైన ఒక ప్రసంగంతో నాటకం ముగిస్తారు. కొన్ని ప్రదర్శనలలో ప్రేక్షకులు స్టేజ్ పైకి వెళ్ళి అక్కడ వున్న గోడను పగులగొట్టే ప్రయత్నం చేసిన సందర్భాలు వున్నాయి.

తాము ప్రచారం చేస్తున్న రెండు దేశాల భావనకు ఇది వ్యతిరేకం గనుక ముస్లిం లీగు వారు దీని ప్రదర్శనకు అభ్యంతరం తెలియచేసారు. ముస్లిం లీగ్ సమ్మతిస్తే తాము అనుమతి ఇస్తామని బ్రిటీషు ప్రభుత్వం చెప్పింది. జిన్నా వస్తే ముందుగా ఆయనకు చూపిస్తాము అన్నా ముస్లిం లీగ్ పెద్దలు ఒప్పుకోలేదు. పోలీస్ వారు పృథ్వీ పెట్టిన దరఖాస్తు తిరస్కరిస్తూ, దానికి సంబధించిన కాగితాన్ని వేరుగా దరఖాస్తుకు పిన్ చేశారు. తన దరఖాస్తు వెనక్కు తెచ్చుకున్న పృథ్వీ ఆ తిరస్కరణ కాగితాన్ని తీసివేసి తన దరఖాస్తు మాత్రమే చూపించి నాటకం ప్రదర్శించారు. నిరసనలు, ఆందోళనల మధ్య రాయల్ ఒపెరా థియేటర్‌లో క్రిక్కిరిసిన ప్రేక్షకులతో మొదటి ప్రదర్శన జరిగింది. ఒక ప్రదర్శనలో కేవలం కొన్ని నిముషాలపాటు వుంటానని చెప్పిన సర్దార్ పటేల్ నాటకం చివరివరకూ వున్నారు. ఒక సన్నివేశంలో కన్నీరు కార్చారు. చివర్లో ఆశువుగా ఒక అరగంట ప్రసంగించారు. ఆ తరువాత దీనిపై వినోదపు పన్ను మినహాయించారు.

1945లో ఇండియాలో తుఫాను సృష్టించిన ఈ నాటకాన్ని పృథ్వీరాజ్ కపూర్ IPTA ప్రభావంతో రూపొందించిన పృథ్వీ థియేటర్ అనే సంచార నాటక బృందం ద్వారా దేశవ్యాప్తంగా ప్రదర్శించారు. మత సామరస్యాన్ని ప్రచారం చేసే ఈ నాటకాన్ని దేశంలో 2000 ప్రదర్శనలు పైగా ఇచ్చారు. 1945-50ల మధ్య దీనిని 712 సార్లు ప్రదర్శించారు. 1952-1960 మధ్య పృథ్వీరాజ్ రాజ్యసభలో నామినటెడ్ సభ్యుడిగా వున్నారు. అయినా నాటక ప్రదర్శనలకు వారి 80 సభ్యుల బృందంతో రైలులో వెళ్ళేటప్పుడు తనకు మొదటి తరగతిలో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని వదలి మూడవ తరగతిలోనే ప్రయాణం చేసేవారు.

తన 38వ యేట ప్రారంభించి 16 సంవత్సరాలపాటు సజీవంగా నడిపించిన పృథ్వీ సంచార నాటక దళం 1960లో పృథ్వీరాజ్ అనారోగ్యం కారణంగా మూతపడింది. ఈ నాటక బృందం 1944-1960 మధ్య 5,982 రోజుల్లో, 112 పట్టణాలలో 2,662 వివిధ నాటక ప్రదర్శనలను ఇచ్చింది. పృథ్వీరాజ్ కపూర్ 1972 మే 29న తన 66వ యేట మరణించారు. శశి కపూర్, అతని భార్య జెనీఫర్ కలిసి పృథ్వీరాజ్ కపూర్ ఆశించినట్లు ఒక శాశ్వత థియేటర్‌ను నిర్మించి 1978, నవంబర్ 5న ప్రారంభించారు. దాని 40వ వార్షికోత్సవ సందర్భంగా 2018 డిసెంబరు 3న 'దీవార్' నాటకాన్ని నవీకరించి ఎన్నో సమకాలీన విషయాలను జోడించి సునీల్ శాంబాగ్ దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటకం ప్రారంభంలో ఒక బాలిక, ఒక బాలుడు వేదిక మీదకు వచ్చి 2018లో ఈ నాటక ప్రాసంగికతను వివరించారు. దీనిలో ఫైజ్ రాసిన ప్రసిద్ధ కవితలు 'సుబహ్ యే ఆజాద్', 'హమ్ దేఖెంగే' లను వుపయోగించుకున్నారు.

## పఠాన్ (ఏప్రిల్ 1947)

విభజనపై పృథ్వీరాజ్ కపూర్ నాలుగు నాటకాలలో రెండవది 'పఠాన్'. ప్రధాన పాత్రధారుడు ఒక ఫక్తూన్ ముస్లిం. పేరు షేర్ ఖాన్. ఫక్తూన్ ముస్లింలను సమాజంలో గేట్ కీపర్లు గానూ, వడ్డీ వ్యాపారులుగానే చూస్తుంది. కానీ దీనిలో షేర్ ఖాన్, తన హిందూ యజమాని ప్రాణాలను ముస్లిముల దాడి నుండి రక్షిస్తాడు. దీనికి ప్రతీకారంగా ఆ ముస్లిం దారి దోపిడీదారుడు తన దాడి నుండి తప్పించుకున్న హిందూ యజమాని కొడుకును వెంటాడి నిర్బంధిస్తాడు. పఠాన్ తన సొంత కొడుకును బలి ఇస్తేనే యజమాని కొడుకును వదలి పెడతానంటాడు. పఠాన్ తన కొడుకును శత్రువుకు అప్పచెప్పే దృశ్యంలో కంట తడి పెట్టని ప్రేక్షకుడు లేడు. షేర్ ఖాన్‌గా, పృథ్వీరాజ్, ఇద్దరు కొడుకులుగా తన కొడుకులైన రాజ్ కపూర్, షమ్మీ కపూర్‌లు నటించారు. ఈ నాటకానికి సంగీతం శంకర్, జయకిషన్‌లు సమకూర్చడమే గాక నాటకంలో నటించారు కూడా.

## గద్దర్ (జూన్ 1947)

దేశ విభజనకు రెండు నెలల ముందు ప్రదర్శించిన ఈ నాటకాన్ని విభజన తరువాతకూడా చాల చోట్ల ప్రదర్శించారు. ఒక జాతీయవాది అయిన ముస్లిం విభజన అనంతరం పాకిస్తాన్‌కు వెళ్లడానికి నిరాకరిస్తాడు. అయితే తన తోటి ముస్లిముల చేతనే ద్రోహిగా చిత్రింపబడి వారి చేతుల్లో హత్యకు గురవుతాడు.

## ఆహుతి

దేశ విభజన అనంతరం మహిళలు ఎదుర్కొన్న సమస్యలను కథావస్తువుగా తీసుకున్న ఈ నాటకం విభజన నాటకాలలో నాలుగోది. విభజన సమయంలో ఇరువైపులా మహిళలను అపహరించి తీసుకు పోవడం సాధారణ విషయంగా మారింది. అలా అపహరణకు గురై, లైంగిక దాడికి గురై తిరిగివచ్చిన ఒక హిందూ మహిళను ఆమె మామ గారు ఇంట్లోకి రానీయరు. ఈ అంశంతో రూపొందిన నాటకం ఇది. ప్రతి నాటక ప్రదర్శన అనంతరం పృథ్వీరాజ్ తన శాలువాను ముందుకు జాపి శరణార్థుల పునరావాస నిధికి విరాళాలు సేకరించేవారు. నాటక ప్రారంభంలోనూ నాటకం చివరలోనూ పృథ్వీరాజ్ ఆసక్తిదాయకమైన

ప్రసంగాలు వుండేవి. 'జిన్నా వుపన్యాసాలు విని కరడు కట్టిన ముస్లిం వాదులుగా మారినవారికి ఈ దేశంలో స్థానం లేదు' అని నిర్ద్వంద్వంగా చెప్పేవారు. ముస్లిం లీగ్‌ను, ఆర్.ఆర్.ఎస్. సంస్థలను విమర్శించేవారు. గాంధీ హత్య తరువాత ఒక రైలు ప్రయాణంలో గోల్వాల్కర్‌ను కలిసిన పృధ్వీరాజ్ ఆయనతో తన ఆర్.ఆర్.ఎస్. వారిని అదుపులో పెట్టుకోమని చెప్పారు. ప్రతి ప్రదర్శనకు ఈ రెండు సంస్థల వారినీ, తన అభిమానులనూ ఆహ్వానించేవారు. ఈ నాటకాలపై ప్రజలు తమ ఇళ్ళల్లో చర్చించుకునేవారు.

## కబడ్డీ (2018)

దేశ విభజనపై 'కబడ్డీ' అనే నాటకాన్ని ఇంగ్లీషులో 2018 ఫిబ్రవరి 26న హైదరాబాదులోని సెయింట్ ఫ్రాన్సిస్ స్త్రీల కళాశాలవారి నాటక సంఘం ప్రదర్శించింది. దీనిని ఆ కళాశాల ఇంగ్లీషు శాఖ వారి క్లబ్ రూపొందించింది.

కబడ్డీ ఆటలో వున్న సంఘర్షణ, రెండు శత్రు బృందాలుగా విడిపోయి గెలుపుకోసం కృషి చేయడం ప్రతీకగా తీసుకుని, విభజన సమయంలో కుటుంబాలు, సమాజాలు ఎలా పోరాడాయో దీనిలో చిత్రించారు. ప్రజలు ఆ సంఘర్షణ సమయంలో ఎదుర్కొన్న గందరగోళం, అనిశ్చితస్థితి, తెగింపు, హింస మొదలగు అంశాలను షాడో ప్లే, మంద్రమైన లైటింగ్ మొదలగు వాటి ద్వారా సూచించారు. గుల్జార్ రాసిన ప్రసిద్ధ కవితను ప్రతిభావంతంగా వాడుకున్నారు. విధ్యార్థులే సంభాషణలు రాసుకున్నారు. నిర్మాతలు దర్శకులు కూడా వారే. నాటకంలో దేశాలు ఏవిధంగా చీలిపోయాయో, అవి చేసుకున్న సంధులూ, ఒప్పందాలూ, ఆయుధాల సమీకరణ, సాధారణ ప్రజలపై విభజన ప్రభావం, కుటుంబాలు ఎదుర్కొన్న కష్ట నష్టాలూ చెప్పి మనదేశం నిజంగా స్వతంత్రం సాధించిందా అనే ప్రశ్నతో నాటకం ముగుస్తుంది.

ఈ నాటకాన్ని 2019లో హైదరాబాదులో ఏర్పడ్డ కట్టింగ్ చాయ్ కంపెనీ అనే నాటక బృందం ఆగష్టు 2019లో లా మకాన్‌లోనూ, ఫొనిక్స్ ఎరీనాలోనూ ప్రదర్శించింది.

## 'ఆగత్తి' (Agathi) దాగ్ దాగ్ ఉజాలా

పాకిస్తానీ నాటక కళాకారులూ, అమెరికా సంయుక్తంగా తయారుచేసిన నాటకం ఇది. ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన ఉర్దూ కవితలోని పాదాన్ని ఈ నాటకం పేరుగా వాడారు. 1947 విభజన పట్ల వ్యక్తుల అభిప్రాయాలను నాటకీకరించారు. విభజన బాధితులతో చేసిన ముఖాముఖీలపై ఆధారపడి తయారు చేశారు. సింగపూర్ అప్సరా ఆర్ట్స్ వారు 2018లో మద్రాస్‌లోని నాట్య దర్శన్ కార్యక్రమాలలో భాగంగా ఇండియాలో మొదటిసారి ప్రదర్శించారు. దీని కళా దర్శకుడు అరవింద్ కుమారస్వామి. ప్రపంచవ్యాప్తంగా 12 సంవత్సరాల వయసుగల శరణార్థుల పిల్లలు రాసిన కవితల సంపుటి 'A Book of Poems: Expressions from our Youth' పై ఆధారపడి రూపొందించిన రూపకం ఇది. ఈ సంపుటిని UNHCR (యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రిఫ్యూజీస్) ప్రచురించింది. వీటిలో కొన్ని కవితలను తమిళంలోకి నిరంజన్ భారతి అనువదించారు. కవిమణి దేశిగ వినాయగ పిళ్లై కవిత ఒకటి, సుబ్రమణ్య భారతి, కణ్ణదాసన్ పాటలు వుపయోగించుకున్నారు. దీనిలో అమెరికాకు, పాకిస్తాన్‌కు సంబంధించిన కళాకారులు నటించారు.

ఇది కేవలం నృత్యకళా రూపకం కాదు. సామాజిక సమస్యలపై వ్యాఖ్యానం కూడా. ఏ కారణాలవల్ల ప్రజలు తమ ఇళ్లూ, ఆస్తులూ వదలిపెట్టి పారిపోతారో, ప్రకృతి విపత్తులూ, రాజకీయపరమైన కారణాలతో సాగే విస్తాపనలూ ఎలా అన్యాయమైనవో వివరించే ప్రదర్శన ఇది. 'జీవితం ఇంతకు ముందు వున్నట్లు వుండదు' అంటూ అరవింద్ తన బాల్యదశలో శ్రీలంక నుండి సింగపూర్‌కు వలస పోవడాన్ని తెలియచేస్తాడు. ఆయా దృశ్యాలను శక్తిమంతమైన సంభాషణలతో, సవగతం రూపంలోనూ (Soliloquy), ప్రధానమైన అంశాలపాఠాన్ని తెరపై చూపిస్తూ ఇంగ్లీషు, తమిళంలో వ్యాఖ్యానంతోనూ పాటలు, కవితలతోనూ ప్రదర్శించారు. ఒక పాత్ర ఇలా అనుకుంటుంది: 'మన ఇళ్ల నుంచి మనం ఎందుకు పారిపోతున్నాం? వాళ్ళు నా వాళ్ళపై లైంగిక దాడులు చేసి చంపేస్తున్నారు. దేనికోసం? వారి మతాన్ని మేము నమ్మనందుకా? లేక దానిని వ్యతిరేకించినందుకా? నేనిప్పుడు ఏకాకినై పోయాను.... నా కుటుంబమూ, నా మిత్రులూ అందర్నీ పొట్టన బెట్టుకున్నారు. నేను ఎలా బతకాలి? అతడు ఎలా బతుకుతాడు' ఈ నాటకంలో శరణార్థులు ఒక బోట్‌లో వెళ్తున్న దృశ్యం ఒకటి వుంది. పడవలోకి ఎక్కి ప్రాణాలు కాపాడుకోడానికి చేసిన పెనుగులాట ఆ దృశ్యం. అల్లకల్లోలమైన సముద్రంలో ఆ బోటు అటూ ఇటూ వూగుతూ భయపెట్టే దృశ్యాన్ని నటులు తమ హావభావ ప్రకటనలతో చూపించారు. ఆ పడవలో ఒక చిన్న పిల్ల చనిపోతుంది. ఆ అమ్మాయి శవాన్ని తండ్రి కన్నీరు కారుస్తూ సముద్రంలోకి వదలివేస్తాడు. ఈ దృశ్య ప్రదర్శన సాగినంతసేపు నేపథ్యంలో మధువంతి రాగం మంద్రంగా వినబడుతూ ప్రేక్షకులను వెంటాడుతుంది.

'శరణార్థుల విలాపం' అనే దృశ్యంలో ఒక్కొక్కరు వారి దయనీయ గాథ వివరిస్తారు. మిగిలినవారు వేదికపై చీకటిలో వుంటారు. ఇదే ఈ రూపకంలో ముఖ్యమైన, ప్రధానమైన దృశ్యం. నేపథ్యంలో సింధు భైరవి మొదలగు విషాద రాగాలు వినిపిస్తూ వుంటాయి.

***('ది హిందు' ఇంగ్లీషు దినపత్రిక 2018 జనవరి 5 సంచికలో రూప శ్రీకాంత్ వ్యాసం సౌజన్యంతో)***

(ఇంకావుంది)

# కార్మికుల పోరాటాల ఫలితాన్ని హరిస్తున్న లేబర్ కోడ్స్!

కృష్ణ కానూరి

**కార్మికులు** పోరాడి సాధించుకున్న హక్కులను, ఉద్యోగ భద్రతను కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ఒకే ఒక వేటుతో కూల్చివేసింది. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఐరోపా దేశాలలోనూ, కాలిఫోర్నియాలోను, కార్మికులకు మరింత భద్రత, మెరుగైన వేతనాలు, తగ్గిన పని గంటలు (నాలుగు రోజుల పని వారం వంటివి) కల్పిస్తూ చట్టాలను సవరిస్తుంటే, భారతదేశంలో మాత్రం సరిగ్గా అందుకు విరుద్ధంగా, పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారు. ఇది కేవలం చట్టాల క్రమబద్ధీకరణ కాదు, కోట్లమంది శ్రమజీవుల గొంతు పిసికి, యజమానుల దోపిడీకి పాలకులు ఇస్తున్న లైసెన్స్. ఇది కార్మిక వర్గంపై జరిగిన హత్యాచారం!

కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న కొత్త లేబర్ కోడ్స్ పైకి ఆధునిక సంస్కరణలుగా కనిపిస్తున్నా, వాటి వెనుక దాగి ఉన్నది ఫ్యూడల్' వ్యవస్థను పోలిన నిరంకుశత్వం. కార్మికుడికి గౌరవం, మెరుగైన జీవన వేతనం, సామాజిక భద్రతను హామీ ఇవ్వాల్సి ఉండగా, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (Ease of Doing Business) పేరుతో మన దేశంలో యజమానుల దోపిడీకి చట్టబద్ధత కల్పిస్తున్నారు. ఇది కేవలం చట్టాల మార్పు కాదు, కార్పొరేట్ దాస్యాన్ని చట్టబద్ధం చేస్తూ, భారతీయ కార్మిక వర్గంపై జరిగిన అతిపెద్ద మోసం! ఈ కోడ్‌లు కార్పొరేట్ కంపెనీలకు తిరుగులేని ఆయుధాలను అందించి, కార్మికుడిని కేవలం 'వాడి పారేసే' వస్తువుగా మారుస్తాయి.

### చారిత్రక పోరాటం :

"ప్రతి హక్కును సాధించుకోవటం వెనుక ఒక పోరాట చరిత్ర ఉంది. భారత కార్మిక చట్టాలన్నీ అలాంటి సుదీర్ఘ పోరాటాల ఫలితమే. 1881లో మొదలైన ఫ్యాక్టరీల సమ్మెల నుంచి 1974 రైల్వే సమ్మె, 1982 బొంబాయి టెక్స్‌టైల్ సమ్మె, ఈనాటికీ కొనసాగుతున్న సమ్మెల వరకు... ప్రతి హక్కు కోసం ఎంతోమంది, ఎన్నో త్యాగాలు చేస్తూ 29 కార్మిక చట్టాలను కార్మికులు పోరాడి సాధించుకున్నారు. కార్మికుల రక్తంతో రోడ్లు తడిచాయి. తల్లులు కడుపుకోతకు గురయ్యారు. అలా సాధించుకున్న 29 చట్టాలను ఒక్క రాత్రికి రాత్రే రద్దు చేసి, నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను 2025 నవంబర్ 21న అర్ధరాత్రి నోటిఫై చేశారు. ఈ కోడ్‌లలో కార్మికుడికి న్యాయం, భద్రత, గౌరవం అనే అంశాలకు స్థానమే లేదు. కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా అమలవుతున్న ఈ చట్టాలు, కార్మిక సంక్షేమానికి కాదు, కేవలం కార్పొరేట్ సంస్థల లాభార్జనకు మార్గం సుగమం చేస్తున్నాయి.

### కార్మిక లోకానికి ద్రోహం :

దేశంలోని కేంద్ర ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాలుగు నూతన లేబర్ కోడ్‌లలోని కొన్ని నిబంధనలు, కోట్లాది మంది శ్రమజీవుల జీవితాలను చీకటిలోకి నెట్టేస్తున్నాయి. ఈ చట్టాలు కేవలం నిబంధనల మార్పు కాదు, నియంత్రణ లేని దోపిడీకి యజమానులకు లైసెన్స్ ఇస్తున్నాయి. ఉద్యోగ భద్రతపై ఉరితాళ్ళు బిగించడం ఈ కోడ్‌ల ప్రధాన లక్ష్యం. పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం, 300 మంది కార్మికులు ఉన్న సంస్థలు ఇకపై ప్రభుత్వ అనుమతితో నిమిత్తం లేకుండానే ఇష్టానుసారం లేఆఫ్‌లు ప్రకటించవచ్చు లేదా సంస్థను మూసివేయవచ్చు. ఈ పరిమితిని 100 నుంచి 300కు పెంచడం ద్వారా, మధ్య తరహా సంస్థల్లోని అధిక శాతం కార్మికులకు చట్టబద్ధమైన రక్షణ లేకుండా పోయింది. చిన్న లాభం కోసం కూడా యజమాని కార్మికులను తక్షణమే తొలగించే అధికారం సంపాదించుకోవడంతో, కార్మికుడిపై నిరంతర ఒత్తిడి, అభద్రత పెరుగుతాయి. దీనికి తోడు, ఈ కోడ్‌లు ఫిక్స్‌డ్-టర్మ్ కాంట్రాక్టులకు పూర్తి చట్టబద్ధత ఇచ్చి, శాశ్వత ఉద్యోగ వ్యవస్థను దెబ్బతీస్తాయి. కాంట్రాక్టు కాలం ముగియగానే, ఎటువంటి పరిహారం లేదా కారణం చూపకుండా కార్మికుడిని తొలగించవచ్చు. ఫలితంగా, కార్మికులకు గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు దక్కకుండా పోతుంది. కంపెనీల శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించినట్లవుతుంది.

### సమ్మె హక్కును హరించివేశారు :

నిరసన తెలియజేసే ప్రాథమిక హక్కును కూడా ఈ కోడ్‌లు దారుణంగా హరిస్తున్నాయి. పారిశ్రామిక సంబంధాల కోడ్ సమ్మెకు వెళ్లడానికి 60 రోజుల ముందు నోటీసు ఇవ్వడం తప్పనిసరి చేసింది. అంతేకాకుండా, 50% కంటే ఎక్కువ మంది కార్మికులు ఒకే రోజు అనుకోకుండా సామూహిక సెలవు పెట్టినా అది సమ్మె కిందకే వస్తుందని నిర్వచించడం ద్వారా, యజమానుల అన్యాయాన్ని ప్రశ్నించే కార్మికుల ఐక్యత అనే శక్తివంతమైన ఆయుధాన్ని లాగేసుకున్నారు. ఇక, సామాజిక భద్రతకు ద్రోహం చేస్తూ, గిగ్ అసంఘటితరంగ కార్మికులకు భద్రత

కల్పిస్తామని ప్రకటించినా, కోడ్‌లోని నిబంధనలు వాటిని కార్మికుడి హక్కుగా కాకుండా, కేవలం ప్రభుత్వ పథకంగా పేర్కొన్నాయి. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ESIC) కవరేజీ వేతన పరిమితిని రూ.21,000 వద్ద స్థిరంగా ఉంచడం వల్ల, అధిక సంఖ్యలో అభద్రతలో ఉన్న కార్మికులు దాని పరిధిలోకి రావడం లేదు. ఫలితంగా, దేశంలోని 90% పైగా కార్మికులను కనీస పెన్షన్, ఆరోగ్య భీమా లేకుండా తీవ్ర అభద్రతలోకి నెట్టివేస్తున్నారు.

### కనీస భద్రతా ప్రమాణాలకు పాతర :

కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ఈ కోడ్‌లు ఘోరంగా విఫలమయ్యాయి. వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (OSHWC Code) లో కనీస భద్రతా ప్రమాణాలను పొందుపరచలేదు. భద్రతా అధికారి, క్యాంటీన్, క్రెచ్ వంటి సౌకర్యాలకు ఉన్న పరిమితులను పెంచడం ద్వారా, అధిక శాతం సంస్థలు వాటిని పాటించకుండా తప్పించుకునే వీలు కల్పించింది. అంతకుమించి, పర్యవేక్షణ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. 'ఇన్స్‌పెక్టర్' పదవిని 'ఇన్స్‌పెక్టర్ కమ్ ఫెసిలిటేటర్'గా మార్చారు. ఫిర్యాదుల ఆధారంగా లేదా ఆకస్మిక తనిఖీలకు బదులుగా, కంప్యూటరైజ్డ్ 'రాండమ్' ఎంపిక ద్వారా, ఆన్‌లైన్‌లో తనిఖీలు నిర్వహించే వ్యవస్థను తీసుకువచ్చారు. యజమానులకు ముందుగానే సమాచారం చేరే అవకాశాలు ఉన్నందున, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) నిబంధనలకు వ్యతిరేకంగా, తనిఖీ వ్యవస్థ బలహీనపడింది. ఇప్పటికే సరైన వసతులు లేక ప్రతి సంవత్సరం వేలాదిమంది కార్మికులు ప్రమాదాల కారణంగా చనిపోతున్న మన దేశంలో, యజమానులు నిబంధనలను ఉల్లంఘించినా పట్టించుకునేవారు లేని స్థితిని కల్పిస్తున్న ఈ కోడ్‌ల అమలు కార్మికులను మరింత దుర్భరమైన స్థితికి నెట్టేస్తుంది.

### ప్రపంచ కార్మిక విధానాలకు భిన్నంగా....

ప్రపంచ కార్మిక విధానాలను పరిశీలిస్తే స్పష్టంగా ఒక గీత కనిపిస్తుంది. జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ వంటి దేశాలు ఉద్యోగ రక్షణను మరింత బలోపేతం చేస్తూ, కార్మికుల హక్కులను కాపాడే దిశగా ముందుకెళ్తుంటే, మన దేశం మాత్రం పూర్తి భిన్న దిశలో పరిగెడుతోంది. జర్మనీలో ఉద్యోగిని తొలగించాలంటే కఠినమైన చట్టపరమైన కారణం తప్పనిసరి. ఫ్రాన్స్‌లో యూనియన్ల శక్తి ఎంతో బలంగా ఉండి, వారానికి కేవలం 35 గంటలే పని. జపాన్‌లో "లైఫ్‌టైమ్ ఎంప్లాయ్మెంట్" అనే జీవితకాల ఉద్యోగ భద్రత ఒక పరంపరగా ఉంది. కానీ భారతదేశంలో మాత్రం కథ పూర్తిగా తలకిందులే – సంస్థలకు స్వేచ్ఛ, కార్మికులకు రక్షణ తగ్గింపు, యూనియన్ల శక్తి నిర్వీర్యం, 48 నుంచి 60 గంటల వరకూ పెరిగిన పనిఒత్తిడి. ప్రపంచం మొత్తం "మానవకేంద్రిత పని సంస్కృతి (human-centred work)" వైపు కదులుతుంటే, భారతదేశం మాత్రం "కార్పొరేట్ కేంద్రిత శ్రమ విధానం (corporate-centred labour policy)" అనే ప్రమాదకర దిశలో వేగవంతమవుతోంది.

### ఐక్యంగా ఉద్యమిస్తేనే భవిష్యత్తు :

కార్మికులు నిస్సత్తువతోనో, నిర్లక్ష్యంతోనో నిరాశతో కూర్చునే సమయం ఇది ఎంతమాత్రం కాదు! కార్మికుల రక్షణ కవచాలను, కార్మికుల హక్కులను, పోరాట చరిత్రను ఈ ప్రభుత్వ ఏకపక్ష, ఫాసిస్టు నిర్ణయాలు చెరిపివేస్తున్నాయి. ప్రభుత్వం చెప్పే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (Ease of Doing Business) నినాదం వెనుక, 'ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లోయిటింగ్ లేబర్' (Ease of Exploiting Labour) అనే దారుణమైన నిజం దాగి ఉంది. ప్రజలు నాయకులను ఎన్నుకుంది కార్పొరేట్ సంస్థలకు సేవ చేయడానికి కాదు, శ్రమను గౌరవించి కార్మికులకు భద్రతను కల్పించటానికి. దేశంలోని రైతులు చారిత్రక పోరాటంతో వ్యవసాయ నల్ల చట్టాల రద్దుకై ఎలా పోరాడారో, అదే స్ఫూర్తితో, శాశ్వత ఉద్యోగాల కోసం, జీవన వేతనం కోసం, సార్వత్రిక సామాజిక భద్రత కోసం, పని చేసే హక్కు కోసం కలసికట్టుగా కార్మికులందరూ నిరంతరం, ఐక్యంగా ఉద్యమించాలి. శ్రమజీవుల సమస్యలు కేవలం వారివి మాత్రమే కాదు. సమాజం అంతటివి, శ్రమజీవులందరూ ఐక్యమై ఈ అన్యాయాన్ని ప్రశ్నించాలి! కార్మిక వర్గానికి అండగా నిలవాలి.

పాట

## జనసాహితి బడి

– కొన్న బాలక్రిష్ణ

జనసాహితిబడి
శ్రమజీవన నుడి
ఇది ప్రజాతంత్ర భావజాల సాహిత్యపు ఒడి
॥ జనసాహితి బడి ॥

పదపదపద పదపదపద పదపదమని పడి
నవసమాజ నిర్మాణపు దారులలో పడి
పెంచవోయి అక్షరాల ఆయుధాల వాడి
హెచ్చవేయి ఆలోచన ఆచరణలు వాడి
॥ జనసాహితి బడి ॥

భూస్వాములు జమిందార్లు పచ్చనోట్ల కుబేరులు
అభివృద్ధికి కారకులని ప్రభుత్వపు పుకారులు
కులమంటూ మతమంటూ రెచ్చగొట్టే ధోరణులు
మత మౌఢ్యపు పోకడలతొ భ్రష్టుపట్టె పాలనలు
॥ జనసాహితి బడి ॥

కదలాలోయ్ మనమంతా ప్రజాస్వామ్య దారులతో
ఉరకాలోయ్ శ్రమజీవన చైతన్యపు పోరులతో
నడిపించాలోయ్ విప్లవాన్ని పోరుదారి హోరులతో
నిలపాలోయ్ దేశమంత స్వాతంత్ర్యపు పొరులతో
॥ జనసాహితి బడి ॥

# గౌతమ్! ఇంకా ఇంకా ప్రశ్నించు!!

పి.యస్. నాగరాజు

**గుండె** పిడికెడు!
కూడు పిడికెడు!!
పుట్టిన పుట్టుకా బిగించిన పిడికిళ్లతోనే!!
సడలించని పిడికిలే కదా బలమైన ప్రశ్న!!!

ఈ ప్రపంచంలోకి కళ్ళు తెరిచిన పసి రెప్పలు, ప్రశ్నలు గానే మొలకెత్తుతాయి! నోరు తెరిచిన పసిబిడ్డ మొదటి మాట అమ్మ! ఆ తర్వాత వచ్చిన ప్రతి మాటా – ఒక ప్రశ్నే!! సత్యమైన, సంతృప్తికరమైన సమాధానం వచ్చేవరకు ప్రశ్నలే

ఈ చౌడు నేలలో ప్రశ్నలు పుట్టటం లేదు!! పుట్టినా బతకడం లేదు!! డెబ్భైలలో వచ్చిన 'బాలరాజు కథ' అనే పిల్లల సినిమాలో – ఒక పాట ఉంది.

అడిగానని అనుకోవద్దు!
చెప్పకుండా దాటేయొద్దు!
ఏమిటీ రహస్యం? స్వామీ!!
ఏమిటీ విచిత్రం??

ఒక్క రాయిని కాలికిందేసి
తొక్కుతు ఉంటారెందుకు?
వేరొక్క రాతికి – చేతులెత్తి
మొక్కుతు ఉంటారెందుకు?

మనిషికి ఒక పెళ్లే చాలంటూ
దేవుడి కేటేట పెళ్ళెందుకు??
ఊరు మీద పడి చందాలెందుకు??
పలుగాకుల(దుర్మార్గులు) బొజ్జల పెంచుటకు!!

అని ఆ పాటలోనే సమాధానం ఉంటుంది!!

పిల్లల ప్రశ్నించేతత్త్వాన్ని మొగ్గలోనే తుంచేసే తరగతి గది ఈరోజు దాపురించింది!!

పిల్లలు ఏ ప్రశ్నలూ అడగరు!! ఉపాధ్యాయులు ఏ సమాధానాలు ఆశించరు!! ఆఖరికి ఉపాధ్యాయులు కూడా ఎటువంటి ప్రశ్నలు పిల్లలకి వెయ్యలేరు!! పాఠాలు అయిపోతూ ఉంటాయి ఇలా!! సిలబస్సులు పూర్తవుతూ ఉంటాయి అలా. విద్యా సంవత్సరాలు గడిచిపోతూ ఉంటాయి ఎలాగోలా!!. సర్టిఫికెట్లు వచ్చేస్తూ ఉంటాయి!! తరగతులు మారుతూ ఉంటాయి!! జీవితంలోకి ఉరుకులు పరుగులు మొదలవుతూ ఉంటాయి! ఎక్కడా, తల ఎత్తే ప్రశ్న కనిపించనే కనిపించదు!!

ఈ సందర్భంగా మనం యూట్యూబ్ వీక్షకులుగా – ప్రేక్షక సంస్కృతిలోకి జారిపోయిన వర్తమానంలో – ఆ యూట్యూబ్‌లోనే చోటు చేసుకున్న ఒక బలమైన ఇంగ్లీషు పాట గుర్తు చేసుకుందాం. పాట పాడినది – డిక్లేన్ గాల్బ్రెత్ అనే 14 ఏళ్ల బాలుడు. ఆ పాట పేరు – 'టెల్ మీ వై??' సుమారు 20 సంవత్సరాలుగా యూట్యూబ్లో తిరుగుతూనే ఉంది. ఒక్కసారి ఆ పాట లోకి వెళదామా!!

"ఎందుకో నాకు చెప్పండి!!
ఎప్పుడు అవసరాలలోనే ఎందుకు కొట్టుమిట్టాడుతున్నాం??

ఇదిలా ఉండొచ్చా??
నేనేదో ఎందుకు కోల్పోతున్నాను??
చాలామందికి ఎంతోమంది సహాయ హస్తాలు ఎందుకు అందించటం లేదు??
నేను మనిషిని కావడానికి అసలు నేనేం చేయాలి??
నేనెవరో నిరూపించుకోవడానికి నేనెందుకు ఒక యుద్ధం చేయాల్సి వస్తోంది??
ఇందుకోసమేనా నా జీవితం??
నిరంతరం యుద్ధాల మధ్య ఉన్న ఈ ప్రపంచంలో నా జీవితం వ్యర్థం కావాలా??
ఇదిలా ఉండవచ్చా??
నేనెందుకు ఏదో కోల్పోతున్నాను??
అడవులు తగలబడి పోవడానికి మనం ఎందుకు అనుమతిస్తున్నాం??
జలచరాలు ఆర్తారావాలు చేస్తుంటే
మనమెందుకు నిష్క్రియగా తేరిపారి చూస్తూ ఉండిపోతున్నాం??
ఈ సముద్రాలు ఎందుకు ఇంకిపోతున్నాయి??
ఇతరులపై ఎందుకు నిందల్ని తోసేస్తున్నాం?
ఈ పరిస్థితులకు ఎందుకు అంతం ఉండదు??
మనమంతా స్నేహంగా ఎందుకు ఉండలేకపోతున్నాం??
మనం కళ్ళు ఎందుకు మూసుకొని ఉన్నాం??

నేల కోసం – నీరు కోసం – గాలి కోసం మనం ఎందుకు పోరాడాల్సి వస్తోంది??

ఈ అస్తవ్యస్తాలకు కారణాలను మనం ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాం??

ఎందుకో నాకు చెప్పండి!!"

ఇది ఆ పాటలో ఉన్న ప్రశ్నల పిడికిళ్ళు!!

ఎవరు జవాబుదారీ?? ప్రశ్నను పుట్టనివ్వకుండా చేస్తున్న పరిస్థితులకు బాధ్యులు ఎవరు? ప్రశ్న ఎందుకు వెలివేయబడుతోంది?? ప్రశ్నిస్తే నేరమని ఎందుకు అంటున్నారు? ప్రశ్నిస్తే పాపం అని ఎందుకు నోరు మూయిస్తున్నారు?? ప్రశ్న ప్రగతి పథానికి దారిదివ్వె అని అనటానికి ఎందుకు భయపడుతున్నాం? పసిపిల్లల ప్రశ్నల్ని మొగ్గలోనే తుంచేస్తున్నది ఎవరు?? ప్రశ్నల విత్తనాల్ని నిషేధిస్తున్నది ఎవరు?

ఆఖరికి విశ్వ గురువుగా గొప్పలు చెప్పుకుంటున్న మనదేశపు పాలకవర్గం 14 ఏళ్ళ గౌతమ్ ప్రశ్నకు ఎఫ్.ఐ.ఆర్‌లో రిజిస్టర్ చేసే స్థితికి దిగజారిపోయింది! బతుకులు ప్రశ్నార్థకమైపోతున్న ఈ కాలంలో – ప్రశ్నలను నిర్భయంగా సంధించటమే పురోగమనం!!

ప్రశ్న ప్రగతికి విత్తనం!! నిషేధాల ఎడారిలో కూడా ప్రశ్నలు మొలకెత్తడమే – నిజమైన చైతన్యం!!

కవిత

# గాయం లేని సూర్యుడు

– కంచరాన భుజంగరావు

పిల్లల్ని పిల్లల్లా ప్రేమిద్దాం
ఆశల రెక్కలపై ఎగిరే కాలాన్ని
గాలిపటం చేసి చేతికిద్దాం
కొండరాళ్ల నోటిలో ఎంగిలిపడ్డ వాగునీటిని
తేటపాయల తేనెధారలుగా కానుకిద్దాం
పిందె పూతల అడవి చెట్లనూ
పిగిలి నవ్వే పూల గుత్తులనూ
హరిత హారాలుగా ముడుపు కడదాం
పరవశంతో ప్రకృతి.. బాల్యావస్థ పొంది
పిల్లల ఒడి చేరి ఆడుకొనేలా
లేత చివురుల తోరణాలు చుడదాం
బాల్య క్రీడల తిరణాలు చూద్దాం

పిల్లల లోకం చుట్టొద్దాం..
సాలెపురుగుల గూటి అల్లిక గమనిస్తూ
గులాబీలకు ముల్లు అవసరమని గ్రహిస్తూ
స్వేచ్ఛకు ఊపిరిపోసే చిన్నారి సాహసుల్ని
వినమ్రంగా అనుసరిద్దాం
వర్షపు జల్లుల్లోకి పడవలై పరిగెత్తే
రంగు కాయితాల్లాంటి పిల్లల ఎదుట
తెల్లని గొడుగుల్లా విచ్చుకుందాం

పిల్లల ఉషోదయాల్లోకి మేల్కొందాం
సూర్యుడికీ సత్యానికీ అనుచరులై
పొద్దు తిరుగుడు పువ్వుల్లా మిగలనిద్దాం
కాళ్ళకు చుట్టుకునే కెరీరిజం పాముల్ని
అడవి తుప్పల్లోకి తరిమేద్దాం
మన అనుభవ సారాన్ని పిండి
వంకర దారుల్లో హెచ్చరిక చిహ్నాలు పెడదాం
రుజుమార్గాల్లో నీతి సూచికలై నిలబడదాం

పిల్లల్ని పిల్లల్లా ఎదగనిద్దాం
ఎవరి కోసమైనా మాట్లాడాల్సివస్తే
గొంతులేని వాళ్ల కోసం..
ఎవరి కోసమైనా కొట్లాడాల్సివస్తే
బలంలేని వాళ్ల పక్షం..
నిటారు వెన్నుపూసల్లా నిలవనిద్దాం
నిలువెత్తు మనుషుల్లా మిగలనిద్దాం

పిల్లల్ని పిల్లల్లా పెరగనిద్దాం
గతం తడబడిన దోవల్లో
తకరారు లేకుండా నడిచేలా తర్ఫీదునిద్దాం
నింగితెర లాంటి పిల్లల లోకంలో
గాయం లేని సూర్యుడిలా
బాల్యాన్ని వెలగనిద్దాం..




**అశోక@75 :** సింగంపల్లి అశోక్‌కుమార్‌పై కొన్ని వ్యూలు, కొన్ని రివ్యూలు, మరికొన్ని ఇంటర్వ్యూలు.

శ్రీశ్రీ సాహిత్యనిధి సంచాలకుడు, కవి అశోక్‌కుమార్ 75 సంవత్సరాల వయసు పూర్తి అయిన సందర్భంగా ఆలోచన సంస్థ ప్రచురించిన జ్ఞాపిక ఇది.

1973లో 'తల్లీ! ఎవరు నువ్వు?', 'బాబా మహత్యం' లాంటి దీర్ఘ కవితలు రాసిన నాటినుండీ ఈనాటివరకూ అశోక్‌కుమార్ రచనలపై వివిధ సాహితీవేత్తలు వెలిబుచ్చిన అభిప్రాయాల మాలిక ఇది. కొన్ని సుదీర్ఘమైన వ్యాసాలు కూడా వున్నాయి. అయితే ఇన్ని సంవత్సరాలుగా వచ్చిన పత్రికలు, పుస్తకాలు సంప్రదించి వీటన్నిటినీ క్రోడీకరించి ప్రచురించిన 'ఆలోచన' సంస్థ నిర్వాహకుల కృషి ప్రశంసనీయం.

గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథానికి కట్టుబడి దాదాపు గత 60 ఏళ్ళుగా అశోకకుమార్ సాహిత్య కృషి కొనసాగిస్తున్నారు. ఈ చివరి సంవత్సరాలలో శ్రీశ్రీ శతజయంతి (2010) సందర్భంగా 'శ్రీశ్రీ సాహిత్యనిధి' అనే ప్రణాళిక ప్రారంభించి, నాలుగు వామపక్ష సాహిత్య సంస్థల, వ్యక్తుల సహకారంతో శ్రీశ్రీ రాసినవీ, శ్రీశ్రీపై రాసినవీ 200 పుస్తకాలు ప్రచురించారు. ఈనాటితరం వారికి అవి శ్రీశ్రీపైనా, ప్రగతిశీల సాహిత్యంపైనా ఒక సరైన అవగాహన కల్గిస్తాయి.

1/8 డెమ్మీలో 216 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : నవంబరు 2025. ప్రతులకు : 92462 77375.

**మహా భారతం : సొగసులు - సూక్ష్మాలు.** రచన : సాకం నాగరాజ

పిల్లలలో పుస్తక పఠనం ప్రోత్సహించడం ఒక ఉద్యమంగా చేబట్టిన రచయిత తిరుపతికి చెందిన సాకం నాగరాజ. మిత్రుల పుస్తకాలను ప్రచురించి పాఠశాలల్లో వాటిని చదివించిన నాగరాజ ఇప్పుడు తానే ఈ పుస్తకం రాయగా అభినవ ప్రచురణలవారు ఉమాకాంత్ దంపతుల ఆర్థిక సహాయంతో ముద్రించారు.

మన ప్రాచీన గ్రంథాలైన మహా భారతం, రామాయణంలోని అనేక అంశాలు మన సంస్కృతిలో మిళితమై వున్నాయి. వాటిని అర్థం చేసుకోవాలంటే స్థూలంగానైనా ఆ గ్రంథాల గురించి పరిజ్ఞానం అవసరం. గతంలో బాలల కోసమని రాసిన 'బొమ్మల భారతం', 'బొమ్మల రామాయణం'లలో రచయిత వ్యాఖ్యానం వుండదు. కాని నాగరాజ తన 'మహాభారతం'లో కొన్ని సన్నివేశాలను 78 పుటలలో పిల్లలకు చెబుతూ, ఆయా ఘట్టాల గురించి శాస్త్రీయంగా వ్యాఖ్యానాలు కూడా చేర్చారు. ఇది ఒక మంచి ప్రయోగం. దీనిని చదివిన ఈనాటి పిల్లలు ఆ మహా గ్రంథంలోని వివిధ ఘట్టాలను విమర్శనాత్మకంగా అర్థం చేసుకుంటారు.

1/8 డెమ్మీలో 92 పుటలు. వెల : రూ. 100/- మొదటి ప్రచురణ : అక్టోబరు 2025. ప్రతులకు : 94403 31016.

**కొత్త సచ్చిదానందమూర్తి :** (1924-2011) రచన : బి.ఎల్. నారాయణ

సుప్రసిద్ధ తత్త్వశాస్త్రవేత్త, పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి సందర్భంగా చరితార్థులను క్లుప్తంగా పరిచయం చేసే ఈ చిన్న పుస్తకాన్ని తెనాలి ఇంప్రెషన్స్ అనే సంస్థ ప్రచురించింది. గతంలో ఈ సంస్థ వీరచక్ర తాతా పోతురాజుపై, కాంచనమాలపై, బొల్లిముంత శివరామకృష్ణపై పరిచయాలను ప్రచురించింది.

1924 సెప్టెంబరు 25న రైతు కుటుంబంలో పుట్టిన సచ్చిదానందమూర్తి 1949లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో తత్త్వశాస్త్ర అధ్యాపకునిగా చేరి, ఉద్యోగ విరమణ అనంతరం 1975-78లలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గానూ, 1986-89లలో యు.జి.సి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. పలు దేశాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పర్యటించారు.

చివరి సంవత్సరాలలో తన స్వగ్రామమైన తెనాలి సమీపంలోని సంగం జాగర్లమూడిలో స్థిరపడ్డ ఆయన 2011 జనవరి 24న మరణించారు.

1/8 డెమ్మీలో ఆల్బమ్ పద్ధతిలో - 24 పుటలు. వెల : రూ. 25/-

**కన్నెగంటి నాసరయ్య :** (1924-2008)

తెనాలికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు కన్నెగంటి నాసరయ్య శతజయంతి సందర్భంగా తెనాలి ఇంప్రెషన్స్‌వారు దీనిని ప్రచురించారు. వారు ప్రచురిస్తున్న చిరు పుస్తకాల పరంపరంలో ఇది ఐదవ పుస్తకం.

1924 నవంబరు 9న జన్మించిన నాసరయ్య 1942లో నేతాజీ నాట్యమండలి పేరుతో బుర్రకథ దళాన్ని తయారుచేశారు. స్వరాజ్య ఉద్యమంలో భాగంగా నేతాజీ వీరగాధను ప్రచారం చేశారు. తన నాట్యమండలి పేరును జనతా ఆర్ట్ థియేటర్‌గా మార్చి నాటక ప్రదర్శనలు ప్రారంభించారు. 'ఇదా ప్రపంచం', 'భయం', 'హిమజ్వాల' మొదలగు నాటకాలను ప్రదర్శించటమేగాక ఆ థియేటర్‌ను ఒక నట శిక్షణా లయంగా చేసారు. చివరివరకు నాటకాన్నే శ్వాసించి, నాటకం కోసమే తపించిన నాసరయ్య 2008 ఆగస్టు 26న మరణించారు.

1/8 డెమ్మీ - ఆల్బమ్ పద్ధతిలో 24 పుటలు. ప్రథమముద్రణ : నవంబరు 2024. వెల : రూ. 30/- ప్రతులకు : 95509 30789, 7981114797

(ఇంకా వున్నాయి)

# బి.బి.సి. కి చెందిన ప్రముఖ విలేఖరి మార్క్ టుల్లీ మరణం

**వార్తల** ప్రసారంలో బి.బి.సి.కి విశ్వసనీయత తెచ్చిన ప్రసిద్ధ విలేఖరి టుల్లీ 2026 జనవరి 25న న్యూఢిల్లీలో తన 90వ ఏట మరణించారు. ఆయన కలకత్తాలోని టోలీగంజ్‌లో ఒక సంపన్న బ్రిటిషు వ్యాపారి కుటుంబంలో 1935 అక్టోబరు 24న జన్మించారు.

మొదట డార్జిలింగ్‌లోని బ్రిటిష్ బోర్డింగ్ స్కూల్‌లో చేరినా, ఆ తరువాత విద్యాభ్యాసానికి ఇంగ్లాండ్ వెళ్ళారు. హాంప్ షైర్‌లో హైస్కూల్ విద్య, మార్ల్ బరోలో కళాశాల విద్య పూర్తి చేసి కేంబ్రిడ్జ్‌లో మతశాస్త్రం చదివారు. బాల్యంలో డ్రైవర్ వద్ద హిందీ అంకెలు నేర్చుకుంటున్న టుల్లీని తల్లి 'అది సేవకుల భాష - మనది కాదు' అని నిరుత్సాహ పరిచింది.

ఆయన 1964లో బ్రిటష్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీలో చేరి, 1965లో ఇండియా విలేఖరిగా వచ్చారు. 1972లో బి.బి.సి. ఇండియా బ్యూరో అధిపతిగా పని చేసి ఆనాటి నుండి ఇండియానే తన దేశంగా ఢిల్లీలో నిజాముద్దీన్ కాలనీలో స్థిరపడ్డారు. తన ఉద్యోగకాలంలో దేశంలో జరిగిన అనేక ముఖ్యమైన సంఘటనలను ఆయన రిపోర్ట్ చేసారు. ఉదాహరణకు ఇండియా - పాకిస్తాన్ ఘర్షణలు, భోపాల్ గ్యాస్ విషాదం, ఆపరేషన్ బ్లూ స్టార్, ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ హత్య, బాబ్రీ మసీదు విధ్వంసం మొదలగునవి.

బాబ్రీ మసీదు సంఘటనలో ఐదుగురు సభ్యులతోకూడిన వీరి బృందాన్ని గుర్తు పట్టిన కరసేవకులు వీరిని ఒక దేవాలయంలోని గదిలో బంధించారు. రెండు గంటల తర్వాత ఒక మహంతు వచ్చి టుల్లీ కి ఒక శాలువా కప్పి పోలీస్ వారి ట్రక్‌లో హోటల్‌కు చేర్చారు. ఎమర్జెన్సీలో విదేశీ విలేఖరులు సెన్సార్ షిప్‌ను అంగీకరిస్తున్నట్లు రాతపూర్వకమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వం అడిగినపుడు టుల్లీ దానికి అంగీకరించలేదు. ఫలితంగా ఆయన్ను24 గంటలలోగా దేశం విడచి వెళ్లాలని ఆదేశించారు.

నిష్పక్షపాత వాస్తవ రిపోర్టింగ్‌కు ప్రతిరూపమై బి.బి.సి.కి 20 ఏళ్ళు దక్షిణ ఆసియా అధికారిగా ఆయన పనిచేసారు. బి.బి.సి. డైరెక్టర్ జనరల్ జాన్ బిర్ట్ తో వచ్చిన అభిప్రాయ భేదాలవల్ల తన ఉద్యోగానికి 1994 జూలైలో రాజీనామా చేసారు. 2003 లో విజయవాడ అశోక బుక్ సెంటర్ వారి కార్యక్రమానికి వచ్చి, సిద్ధార్థ అకాడెమీలోనూ, ప్రెస్ క్లబ్‌లోనూ ప్రసంగించారు. భారత ప్రభుత్వం ఆయనకు పద్మ శ్రీ 1992లో, పద్మ భూషణ్ 2005లో ప్రకటించింది.

# జాతీయ సాహిత్య పురస్కారాలను నిర్వహించనున్న తమిళనాడు ప్రభుత్వం

**ఇటీవల** కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ఖరారు చేసి ప్రకటించబోయే సమయంలో కేంద్ర సాంస్కృతిక శాఖ జోక్యం చేసుకుని అవార్డుల ప్రకటనను రద్దు చేయటం అందరికీ తెలిసిందే! సాహిత్య అకాడమీ అవార్డుల విషయంలో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని మేధావులు తప్పు పట్టారు. నిరసనను తెలియచేశారు. ఈ నేపథ్యంలో సాహిత్య అకాడమీ అవార్డులకు ధీటుగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతియేడూ ఏడు ప్రాంతీయ భాషలకు చెందిన అత్యుత్తమ రచనలకు 'సెమ్మొళి సాహిత్య అవార్డు' (శాస్త్రీయ భాషా సాహిత్యం అవార్డు)ను ఇవ్వనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, ఒరియా, బెంగాలీ, మరాఠీ భాషలలో వెలువడే ఉత్తమమైన రచనలకు ఈ శాస్త్రీయ భాషా సాహిత్య అవార్డులను ఇస్తారు. ఈ జాబితాలో హిందీ భాష లేకపోవటాన్ని గమనించవచ్చు.

# యూనివర్శిటీల్లోనూ తీవ్రమవుతున్న కులవివక్ష

**యూనివర్శిటీలలోనూ,** వాటి అనుబంధ కళాశాలలోనూ ఈక్వల్ ఆపర్చునిటీ సెల్స్ (ఈఓసి), ఎస్టీ / ఎస్సీ విభాగాలను ఏర్పాటుచేసిన తర్వాత యూనివర్శిటీలలో కుల ఆధారిత వివక్షపై అందుతున్న ఫిర్యాదుల గణాంకాలను యూజీసి పార్లమెంటరీ ప్యానెల్ సుప్రీంకోర్టుకు సమర్పించింది. 2019 నుండి 2024 మధ్య, అయిదు సంవత్సరాలలో కుల ఆధారిత వివక్ష 118.4% పెరిగాయని తెలియచేశారు. 2019-20లలో 173 కేసులు, 2020-21లలో 182 కేసులు, 2021-22లలో 186 కేసులు, 2022-23లలో 241 కేసులు, 2023-24లలో 378 కేసులు నమోదయ్యాయి. 2019-2020, 2023-24ల మధ్య 704 విశ్వవిద్యాలయాలు, 1553 కాలేజీల్లోని ఈవోసీ నుండి యూజీకి 1160 ఫిర్యాదులు అందాయట. ఈ గణాంకాలన్నీ ఫిర్యాదుల వరకు వచ్చినవి మాత్రమే. ఫిర్యాదులు వరకూ రానివే ఎక్కువుంటాయన్నది బహిరంగ రహస్యమే.

# కిటుకు

– యండపల్లి భారతి

**ఏడుకొండల** ఎంకటేసుడు యముని పాయం పట్టలేక
మొగినాలీ పొందుకై పాకులాటను పాటగా పాడిన
మా నాగవ్వ పాటే మా కింపైన బాస

నడిజామున పానం అగ తప్పితే చెట్టోరు మందు పొంగ పోసి ఇస్తే
కాంచేడికి జుట్టు పట్టి పైకి లేపినట్లు చేసే
మా మల్లయ్య చేతి వైద్యమే మా బతుకు

మొన్న కూడా పెరక్క తినే కటన్న కరువులో
గొట్టి గొడ్డలు అనప బేడలు బెల్లం వేసి
చింతకట్లతో రేయంత ఉడకబెట్టి పంచె వన్నె పదార్తాన్ని మా నోటికందించిన
మా లచ్చమ్మ చెయ్యి వాటం మా బతుకు తీపి

ఏడు పొగుళ్ళు ఏడు రేత్రులు తెరపెరగని వాన గాలి ఎత్తుకుంటే
ఊరందరి పైకప్పలు పైకి లేస్తే మా ఇంటి కప్ప చెక్కుచెదరకుండ కప్పిన
మా బోయకొండ తాత పనితనమే మా నెత్తి గొడుగు

కుదుట్లో నిండు నీళ్ల కడవపై బూతద్దం వేసి వెతికినా
ఎల్లని కుండ చేసిన కుమ్మరి వెంకటప్ప చేతుల్లో ఉన్న
ఉన్నరి తనమే మా నోటి కూడు

పెండ్లి, పుట్టుక, పండగ, ఆట, పాట, రంపు, చావుల్ల
పెద్ద తలకాయగా నిలబడి
అంతు ఇడసకుండా అందరినీ ఒకే గాటీ కట్టేసే మల్లెతనం ఉన్న
మా రామయ్య కొండమ్మలే మా మేలుకొలుపు

ఏడేండ్లు వెతికిన పురుగుకి దారి దొరకనీయకుండా దాసిన విత్తనాల కోసం
పోవిడి దొరికిన వాల్లంతా ఒంటికాలి మింద నిలబెట్టేలా చేసిన
మా ఈరమ్మ ముందుచూపే మా బతుకు నిలుపు

పగోనిపై చెయ్యి కర్ర వాడకుండా
నీ బుర్ర దొల్లాడా నీ దటం యాలాడ అని నోటితోనే అల్లి పెట్టె
మా అనసూయ తిట్టే మా నోటి గెలుపు

నూరేండ్లు అయినా నేల పోయే నల్ల జీమను కనిపెడుతూ
పొప్పెమకలు పలపల కొరుకుతూ వంగకుండ
అందురు అసోద్దపోయేటట్లు బతికిన
పాపుల పెద్దమ్మ బతికిన బతుకే మా పానతీపి!

తరాలు మారినా యుగాలు మారినా
మనతో బతికేది మన బతుకు కిటుకే

('పచ్చబొట్టు' కథల సంపుటి నుండి) ✤

PRAJA SAAHITI February 2026 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# నినదించండి గొంతెత్తి!

# అన్ని భాషలకు సమానస్థాయి ఉండాలని!!




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI